అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 06-04-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 45
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

ఈ వాణిజ్య యుద్ధంలో ఎవరూ గెలవరు

యూఎన్ చీఫ్ హెచ్చరిక



ఐక్యరాజ్య సమితి : 'వాణిజ్య యుద్ధంలో విజేతలంటూ ఎవరూ వుండరు' అని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్యం జరిపే కొన్ని భాగస్వామ్య దేశాలపై అధిక టారిఫ్‌లను విధించడంతో పాటూ కనీసం 10శాతం పరస్పర సుంకాలను విధిస్తూ ట్రంప్ తీసుకువచ్చిన ఉత్తర్వులపై అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ విధానంపై యూఎన్ చీఫ్ స్పందన గురించి ప్రశ్నించగా, ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ ...2లో



ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే

రాహుల్ విమర్శల నేపథ్యంలో వ్యాసాన్ని తొలగించిన ఆర్గనైజర్

న్యూఢిల్లీ : కేథలిక్ చర్చిలు, వక్ఫ్ బోర్డుల ఆధీనంలో వున్న స్థలాలను పోలుస్తూ వచ్చిన ఒక వ్యాసాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం వున్న ఆంగ్ల పత్రిక ఆర్గనైజర్ ఇటీవల తొలగించింది. ముస్లింల తర్వాత వంతు ఇక క్రైస్తవులదేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ వ్యాసం తొలగింపు చోటు చేసుకుంది. వక్ఫ్ ఆస్తుల క్రమబద్ధీకరణకు సంబంధించి గణనీయమైన మార్పులను ప్రతిపాదిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును మొత్తానికి మోడీ ప్రభుత్వం ఆమోదింపచేసుకున్న సమయంలో ఈ పరిణామం చోటు ...2లో




పోరాటం పదునెక్కుతోంది

ప్రజలు కదులుతున్నారు : బీవీ రాఘవులు

సీతారాంఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వివిధ సమస్యలపై పోరాటాలు జరుగుతున్నాయని, ప్రజలు పెద్దఎత్తున ఈ పోరాటాల్లో పాల్గొంటున్నారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) 24వ అఖిలభారత మహాసభ నాల్గవరోజైన శనివారం సీతారాం ఏచూరి నగర్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే పోరాటాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. మహాసభలో శనివారం ప్రవేశపెట్టిన ముసాయిదా ఆర్గనైజేషనల్ రిపోర్ట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదారవాద విధానాలు ప్రజలకు పెనుభారంగా మారడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో పాటు, సంక్షేమ పథకాలు నిర్వహించడం కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు కష్టంగా మారుతోందని, దీంతో ఆ భారాన్ని కూడా ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితులు ప్రజలు రోడ్లమీదకు వచ్చి పోరాటం చేయక తప్పని స్థితిని కలిగిస్తున్నాయని చెప్పారు. కార్మికవర్గంపై పడుతున్న భారాలకు, పెరుగుతున్న ఒత్తిడికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేసిన పోరాటాలకు సీపీఐ(ఎం) క్రియాశీలక మద్దతు ఇచ్చిందని తెలిపారు. అదే విధంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్‌మోర్చా చేసిన పోరాటానికి కూడా పార్టీ కీలక మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. భూమి, ఇండ్లస్థలాలు, ఉపాధి కోసం తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, రాజస్థాన్‌లతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సీపీఐ(ఎం) ప్రజలను కదిలించి పోరాటాలు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా కేరళలో పెద్దఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమాలు జరిగాయని, నిరుద్యోగానికి నిరసనగా పశ్చిమబెంగాల్‌లో యువత ఆందోళనలు చేసిందని, బీజేపీ దాడులకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా త్రిపురలో భారీ ఆందోళనలు సాగాయని తెలిపారు. పశ్చిమబెంగాల్, తమిళనాడుతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలు, పిల్లలపై జరిగిన లైంగికదాడులు, వేధింపులకు వ్యతిరేకంగా ...3లో



ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు : సీపీఐ(ఎం) డిమాండ్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో సభ్యులు రామచంద్రడోమ్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఇష్ఫాకర్ రహమాన్ బలపరిచారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నట్టు ఈ తీర్మానంలో పేర్కొన్నారు. 'సమాజంలోని అణచివేతకు గురైన షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్సీలు), షెడ్యూల్డ్ ట్రైబల్ (ఎస్టీలు), ఇతర వెనుకబడిన తరగతు లు (ఓబీసీలు) ఇప్పటికీ సామాజిక వివక్షకు విస్మరణకు గురవు తూనే ఉన్నారు. పేదరికం, వివక్ష కులాల ఆధారంగా ఏర్పడిన సామాజిక నిర్మాణాల్లో ప్రధాన భాగంగా ఉన్నాయి. భూమి ...3లో

హెచ్‌సీయూ భూములు లాక్కున్నట్టు

తప్పుడు ప్రచారం

ఏఐ ద్వారా లేనివి ఉన్నట్టు సృష్టించారు

ఫేక్ కంటెంట్ తయారీపై కోర్టుకు వివరించండి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి

సైబర్ క్రైం విభాగాన్ని మరింత బలోపేతం చేయండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను లాక్కున్నట్టుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. "సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రయివేటు బిల్డింగ్‌లు, యూనివర్సిటీ బిల్డింగ్‌లను నిర్మించారు. వాటిపై ఎలాంటి ఆందోళన జరగలేదు" అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు తలెత్తలేదని ...11లో

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం
స్ఫూర్తిదాయకం : సీఎం

వివరాలు 10లో..

నేడు భద్రాద్రికి ముఖ్యమంత్రి

సీఎం హెూదాలో శ్రీరామనవమికి తొలిసారి..

సీఎంతోపాటు ఏడుగురు మంత్రులూ..

తానీషా కాలంనాటి ఆనవాయితీకి గత సీఎం బ్రేక్

సారపాకలో సన్నబియ్యం అన్నం రుచి చూడనున్న రేవంత్ రెడ్డి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భారీ బందోబస్తు



ఢిల్లీ పోలీస్ కమిషనర్ వాంగ్మూలం నమోదు

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల కేసులో రెండు గంటల పాటు విచారించిన దర్యాప్తు కమిటీ

ఇప్పటికే పలువురి స్టేట్‌మెంట్లు రికార్డు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయవాది జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంలో దర్యాప్తు కమిటీ పలువురిని విచారిస్తోంది. ఇందులో భాగంగా ముగ్గురు జడ్జిల కమిటీ ముందు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా హాజరయ్యారు. ఆయనను కమిటీ రెండు గంటల పాటు విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. అలాగే, న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ...11లో

బాయ్‌కాట్ అమెరికా

పలు దేశాలలో వస్తు బహిష్కరణలు



వాషింగ్టన్ : ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య భాగస్వాములపై ప్రతీకార సుంకాలు విధించి సంబరపడుతుంటే మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అమెరికా వస్తువుల బహిష్కరణ కొనసాగుతోంది. 'బాయ్‌కాట్ అమెరికా' పేరుతో సోషల్ మీడియా, సెర్చ్ ఇంజిన్లలో పుంఖానుపుంఖాలుగా సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా బ్రాండ్లు, ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దంటూ నెటిజన్లు విజ్ఞాపనలు పంపుతున్నారు. సుంకాలను ట్రంప్ ప్రకటించకముందే ఐర్లాండ్‌లోని డూన్‌బెగ్‌లో, స్కాట్‌లాండ్‌లోని టర్న్‌బెర్రీలో ఉన్న అధ్యక్షుడి గోల్ఫ్ కోర్టుల వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. కెనడాలో వ్యాపారులు అమెరికా వస్తువులను విక్రయించడం ఆపేశారు. ఇక ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క్‌పై కూడా ప్రజాగ్రహం అమెరికాతో సహా పలు దేశాల్లో పెల్లుబుకుతోంది. యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని టెస్లా కార్ షోరూముల వద్ద నిరసనలు జరిగాయి.జర్మనీ వంటి కొన్ని చోట్ల ఆందోళనకా రులు కార్లకు నిప్పు పెట్టారు. కార్ల అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మొత్తంగా చూస్తే ట్రంప్, మస్క్ బ్రాండ్ల బహిష్కరణ ఊపందుకుంటోంది. డెన్మార్క్‌లోని అతి పెద్ద వ్యాపార సంస్థ సాలింగ్ గ్రూప్ యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులన్నింటి ...11లో

వీడీసీ ఆగడాలు



ఆలయంలో పూజలో పాల్గొనకుండా అడ్డగింత

గౌడ సామాజిక తరగతిపై తాళ్లరాంపూర్ వీడీసీ దాష్టీకం

పోలీస్‌స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు

గ్రామకమిటీ సభ్యులు, పూజారిపై కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

నిజామాబాద్ జిల్లాలో గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల ఆగడాలు శృతిమించుతున్నాయి. ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌లో చాలా గ్రామాల్లో వీడీసీ పేరిట వివిధ కుల వృత్తులపై ఆంక్షలు విధిస్తూ వేధిస్తున్నాయి. గౌడ కులస్తులపై గ్రామంలో ఆంక్షలు విధించిన వీడీసీ.. తాజాగా శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆ సామాజిక తరగతికి చెందిన మహిళలను పూజలు చేయకుండా అడ్డగించిన వైనం వెలుగుజూసింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లరాంపూర్ గ్రామంలో గీత కార్మికులకు, గ్రామ కమిటీకి కల్లుగీత విషయంలో కొన్ని నెలలుగా గొడవలు ...11లో



సమగ్ర రక్షణ సహకారం

ఏడు కీలక ఒప్పందాలపై భారత్, శ్రీలంక సంతకాలు

ప్రధాని మోడీకి మిత్ర విభూషణ అవార్డు ప్రదానం

కొలంబో : మొట్టమొదటిసారిగా, భారత్, శ్రీలంక బృహత్తరమైన రక్షణ సహకార ఒప్పందంపై శనివారం సంతకాలు చేశాయి. మరింత సమగ్రమైన రీతిలో ద్వైపాక్షిక సహకారానికి చేపట్టాల్సిన విస్తృత ప్రణాళికను ప్రధాని మోడీ వివరించారు. ఇరు దేశాలు పరస్పరం ఆధారపడి వున్నాయని, వాటి భద్రత కూడా ముడిపడి వుందని మోడీ పేర్కొన్నారు. ఇరు పక్షాలు ఏడు కీలకమైన ఒప్పందాలపై సంతకాలు చేయగా వాటిలో రక్షణ ఒప్పందం ఒకటి. అంతకుముందు ప్రధాని మోడీ, శ్రీలంక అధ్యక్షుడు ...11లో

ఆయుధాలు వీడండి

మావోయిస్టులకు అమిత్ షా విజ్ఞప్తి



దంతెవాడ : ఆయుధాలు విడనాడి జన జీవన స్రవంతిలో చేరాల్సిందిగా మావోయిస్టులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా కోరారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల గురించి ప్రశ్నలు లేవనెత్తిన వారిని ప్రస్తావిస్తూ బస్తర్ ప్రాంతంలో అమాయకులైన గిరిజనులు ప్రాణాలు కోల్పోవడాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు. ఏ ఒక్క మావోయిస్టు చనిపోయినా ఏ ఒక్కరూ సంతోషంగా ...11లో

క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని..

మనస్తాపంతో రైలు కిందపడి యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-బేగంపేట్

క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్రలోని బీహెచ్‌ఈఎల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రాజ్వీర్ సింగ్ ఠాకూర్(25) ప్రయివేటు ఉద్యోగి. అతను క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ...11లో

హిందూత్వ శక్తుల డిజిటల్ మాయ

అసత్య కథనాలు, విద్వేష కంటెంట్‌తో విపరీత ప్రచారాలు




సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న వైనం

కల్పిత వీడియోలు, మీమ్స్, ట్రోల్స్ వైరల్

ముస్లింలు, క్రిస్టియన్లు, ప్రతిపక్ష నాయకులే టార్గెట్

కలిసొచ్చిన సామాజిక మాధ్యమాల అల్గారిథమ్

బీజేపీకి అనుకూలంగా వ్యవహారం



న్యూఢిల్లీ : ప్రపంచంలో డిజిటల్ టెక్నాలజీ రాక, దాని విస్తృత వినియోగం రాజకీయ చర్చను మార్చివేసింది. భారత్‌లో ఈ పరివర్తన హిందూత్వ సైద్ధాంతిక స్థిరత్వానికి బాటలు పరిచింది. హిందూత్వ సంస్థలు, సంఘాలు, పార్టీలు ఈ వేదికను తమకు అనుకూలంగా వినియోగించుకున్నాయి. వాట్సప్, ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు హిందూత్వ సైద్ధాంతిక విస్తరణకు ఎంతగానో దోహదం చేశాయని మేధావులు, విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇందుకు భారత్‌లో సదరు వేదికల అల్గారిథమ్‌లు కావచ్చు, ఆ సంస్థల ఆర్థిక ప్రయోజనాలు కావచ్చు.. హిందూత్వ శక్తుల విష ప్రచారానికి అనుకూలంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ కోసం మతాల మధ్య చిచ్చు

విద్వేషపూరిత కంటెంట్, కల్పిత కథనాలు, మీమ్స్, ట్రోల్స్‌ను హిందూత్వ శక్తులు వాడుకుంటున్నాయి. ఇవి హింసనూ ప్రేరేపిస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సత్యదూరమైన కథనాలతో ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నాయి. హిందు, ముస్లిం, క్రిస్టియన్ అంటూ రెచ్చగొడుతున్నాయి. ఆ వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. సమాజంలో మతసారస్యానికి విఘాతం కలిగిస్తున్నాయి. మత ఘర్షణలతో బీజేపీకి రాజకీయ ప్రయోజనాలను అందించే ప్రయత్నాలను హిందూత్వ శక్తులు చేస్తున్నాయి. ముస్లింలను శాశ్వత దురాక్రమణదారులుగా చరిత్రను తిరిగి రాసే కుటిల యత్నాలకూ పూనుకుంటున్నాయి.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాషాయ ప్రభుత్వాలకు ప్రచారం

కేంద్రంలోని మోడీ సర్కారు, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు, చేసే చర్యలను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. మోడీ, బీజేపీ.. హిందువుల కోసం పని చేసే శక్తులుగా చిత్రీకరిస్తున్నాయి. ఇతర పార్టీలను హిందు వ్యతిరేకులుగా, మైనారిటీ పక్షపాతం కలిగినవిగా ప్రచారం చేస్తున్నాయి. హిందూత్వవాదంతో వీహెచ్‌పీ, అంతర్రాష్ట్ర హిందూ పరిషద్-రాష్ట్రీయ బజరంగ్ దళ్, హిందూ జన జాగృతి సమితి అనే సంస్థలతో పాటు బీజేపీలు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఉదాహరణకు, 2023లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో టిప్పు సుల్తాన్‌ను 'క్రూరమైన ఆక్రమణదారుడు'గా, హిందువులను అణచివేసిన వ్యక్తిగా హిందూత్వ శక్తులు చిత్రీకరించాయి. హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు.. టిప్పు సుల్తాన్ విషయంలో కల్పిత కథనాలు, వీడియోలు, మీమ్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి వైరల్ చేశాయి. కాంగ్రెస్‌పై విషం చిమ్మాయి. ఇక అయోధ్య బాబ్రీ మసీదు అంశంలో సుప్రీంకోర్టు తీర్పు పైనా హిందూత్వ శక్తులు సోషల్ మీడియాలో పోస్టుల వరదను కురిపించాయి.

కలిసి వచ్చిన సోషల్ మీడియా అల్గారిథమ్.. బాసటగా బీజేపీ ప్రభుత్వాలు

ఇక సోషల్ మీడియా అల్గారిథమ్‌లు కూడా హిందూత్వ శక్తులకు కలిసి వస్తున్నాయి. సంచలన కథనాలకు ఈ అల్గారిథమ్‌లు సానుకూలంగా పని చేస్తున్నాయి. ఈ అల్గారిథమ్ పక్షపాతంతో హిందూత్వ కంటెంట్‌కు ప్రయోజనం చేకూరుతున్నదని అయాన్ ఇన్‌స్టిట్యూట్ 2022 నివేదిక, సహనా ఉడుపాస్ (2020) పరిశోధన వెల్లడించింది. ఇక ప్రభుత్వాల మద్దతు కూడా హిందూత్వ శక్తుల విపరీత ప్రచారానికి కీలకంగా మారుతున్నది. ముఖ్యంగా, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ తీరు కనిపిస్తున్నది. ఆన్‌లైన్‌లో తప్పుడు ప్రచారంలో చాలా నైపుణ్యం కలిగి ఉన్న బీజేపీ ఐటీ సెల్.. పెయిడ్ ప్రకటనలతో డిజిటల్ వేదికను తనకు అనుకూలంగా వాడుకుంటున్నది. అయితే, భారత్‌లో మత విద్వేష ప్రసంగాలకు తమ వేదికను వాడుకుంటున్నారన్న విషయం ఫేస్‌బుక్ మాతృ సంస్థ అయిన మెటాకు తెలిసినా.. ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అటువంటి కంటెంట్‌ను కట్టడి చేసే విషయంలో పెద్దగా ఏమీ చేయటం లేదని ఫేస్‌బుక్ విజిల్‌బ్లోయర్ ఫ్రాన్సెస్ హాగెన్స్ వివరించారు. ఇక వాట్సప్‌లో ప్రత్యేకమైన గ్రూపులను ఏర్పర్చి ద్వేషపూరిత కంటెంట్‌ను షేర్ చేస్తున్నాయి. ముఖ్యంగా, ముస్లింలు, క్రిస్టియన్లను టార్గెట్‌గా చేసుకుంటూ వీటి చర్యలు ...11లో

ఫార్మా భూముల్లో ఫెన్సింగ్ ఆపాలి

- ఫార్మా రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి
- మేడిపల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-యాచారం

రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ భూముల్లో చేపట్టిన ఫెన్సింగ్‌ను వెంటనే ఆపి, ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి.అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్తలో ఫార్మా భూముల విషయంలో సీపీఐ(ఎం) నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలవంతంగా ఫార్మాసిటీ భూముల్లో ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కోర్ట్ ఆర్డర్‌ను ధిక్కరించి మేడిపల్లిలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దింపి ఫార్మా భూములకు హద్దు రాళ్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకున్న రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా రెండు మండలాల్లో భూసేకరణ చేపట్టిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట మార్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఫార్మా రైతులకు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. 2,800 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని అధికారులను కోరారు. వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పించాలన్నారు. ఫార్మాసిటీ బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మేడిపల్లి, కుర్మిద్దలో తమ పార్టీ ఇంటింటి సర్వే నిర్వహించిందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి జీపు జాతాను కూడా చేపట్టిందని చెప్పారు. సమస్యలు పరిష్కరించే వరకూ తమ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఆలంపల్లి జంగయ్య, ఎండీ జహంగీర్, ఆలంపల్లి యాదయ్య, వడ్డెమోని భూషణ్, ఆలంపల్లి పెంటయ్య, గడ్డం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

నవతెలంగాణ-పాల్వంచ

ముఖ్యమంత్రి ఆమోదం
ఎర్త్ సైన్సెస్‌గా మైనింగ్ కళాశాల
అప్ గ్రేడ్ : సీఎం రేవంత్‌కు
మంత్రి తుమ్మల ధన్యవాదాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్టు ప్రకటించారు. సీఎం ప్రకటనతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రమ ఫలించింది.

సహజ వనరులు, మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు అందచేసిన విషయం తెలిసిందే. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు సీఎం సానుకూలంగా స్పందించి యూనివర్సిటీని మంజూరు చేస్తూ ప్రకటన జారీ చేశారు. దీంతో మంత్రి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెం జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి జిల్లాకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పొచ్చు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్‌కు బాటలు వేయనున్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

లొంగిపోయినవారికి పునరావాసం
కల్పిస్తాం : మల్టీజోన్-1
ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి
లొంగిపోయిన 86 మందికి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ- కొత్తగూడెం

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని, పోలీసుల ఎదుట లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని మల్టీ జోన్-1 ఐజీపీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. భద్రాద్రి జిల్లాకు చెందిన 81 మంది, ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు మావోయిస్టు సభ్యులు శనివారం ఆయా జిల్లాల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విలేకర్ల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కింద చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. మావోయిస్టులు వారి ఉనికి చాటుకునేందుకు అమాయకులైన కొంత మందిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. చిన్న వయసులో ఉన్న వారికి మాయమాటలు చెప్పి దళంలోకి తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే మావోయిస్టుల ఉనికి పెద్దఎత్తున తగ్గిపోయిం దన్నారు. అనేక మంది దళాల్లో వివిధ హెూదాల్లో పనిచేసిన నాయకులు, దళ సభ్యులు లొంగిపోతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది 224 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో భద్రాద్రి జిల్లాకు చెందిన 203 మంది, ములుగు జిల్లాకు చెందిన 21 మంది ఉన్నట్టు తెలిపారు. శనివారం 86 మంది లొంగిపోగా, వారిలో 26 మంది మహిళలు, 60 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఇందులో నలుగురు ఏసీఎంలు ఉన్నారని, వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, ఐదుగురికి రూ.5 లక్షల చొప్పున, సభ్యులకు రూ.25 వేల చొప్పున పునరావాసం కింద చెక్కులు అందజేసినట్టు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మందు పాతరలు పేలి అనేక మంది సామాన్య ప్రజలు చనిపోయారని అన్నారు. మందు పాతరలను గుర్తించేం దుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చర్ల పరిసర ప్రాంతంలోని పూసుగుప్ప వద్ద బాంబును గుర్తించి నిర్వీర్యం చేశామన్నారు. తెలంగాణలో అండర్ గ్రౌండ్‌లో సుమారు 95 మంది మాత్రమే మావో యిస్టులు ఉండి ఉంటారని అభి ప్రాయ పడ్డారు. వారితో చర్చించి ప్రజాజీవనంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామ న్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ములుగు ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ఖమ్మం ప్రొహిబిషన్ ఐపీఎస్ అధికారి రుత్విక్‌సాయి కొట్టే, 141 బెటాలియన్ కమాండెంట్ కమల్ వీర్, 81 బెటా లియన్ కమాండెంట్ ప్రీత, హిమాన్షు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో గందరగోళం

పేర్లు తారుమారు
మార్పులు.. చేర్పుల్లోనూ తప్పులు
అసలు పేర్లు కనిపించకపోగా.. ఉన్నవీ మాయం
కొందరి పేర్లు ఇతరుల కార్డుల్లో నమోదు
లబ్దిదారుల్లో ఆందోళన
ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, సిరికొండ

ఇన్నాండ్లు రేషన్‌కార్డులు లేక బాధపడితే.. ఇప్పుడు కొత్త కార్డులు వచ్చాయన్న సంతోషం కన్నా ఆందోళనే ఎక్కువైంది. కొత్త కార్డుల జారీ కంటే ముందు మార్పులు, చేర్పులకు సంబంధించి కార్డుల్లో పేర్లు తారుమారు కావడం.. అసలు పేర్లు కనిపించకపోవడం.. ఉన్నవి మాయం కావడం.. కొందరి పేర్లు ఇతరుల కార్డుల్లో నమోదు కావడం తదితర చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. అసలు లబ్దిదారుల పేర్లు కార్డులో కనిపించకపోవడం.. వారి పిల్లల పేర్లు ఇతరుల కార్డుల్లో ఎక్కడంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వీటిని సరిచేసేందుకు న ర్కారు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో నూతన రేషన్ కార్డుల జారీలో జరిగిన గందరగోళంపై ప్రత్యేక కథనం..

సిరికొండ మండల కేంద్రానికి చెందిన కత్తెర్ల సురేష్ భార్య పేరు మీద కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేశారు. ఇందులో వారి ఇద్దరి పిల్లల పేర్ల కోసం పెట్టారు. అయితే మంజూరైన కొత్త కార్డులో భార్యాభర్తల పేర్లు రాకపోగా.. పిల్లలిద్దరి పేర్లు వారి సమీప కుటుంబ సభ్యుల కార్డులో యాడ్ అయ్యాయి. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అనేక మందికి ఎదురుకావడంతో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ సర్వత్రా గందరగోళానికి దారితీస్తోంది.

గందరగోళంగా జారీ ప్రక్రియ..

కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ చేపట్టడంతో ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజాపాలన సభలతోపాటు మీసేవలోనూ దరఖాస్తులు అందించారు. కొత్త కార్డులతోపాటు పాతవాటిలో పిల్లల పేర్లు చేర్పించడం వంటి వాటికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో అన్నీ కలిపి 90వేల మంది దరఖాస్తులు అందించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు లబ్దిదారులను గుర్తించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి పంపించారు. ముందుగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులకు సంబంధించి 14,900 కార్డులు జారీ అయినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు లబ్దిదారుల పేర్ల మీద కొత్త కార్డులు జారీ కావడం లేదని అంటున్నారు.

కొత్త కార్డులో మా పేర్లు రాలేదు
రాథోడ్ రవీందర్, సిరికొండ

రేషన్ కార్డు కోసం ప్రజాపాలన సభలో దరఖాస్తు చేశా. రెండు నెలల కింద జాబితాలో పేరు వచ్చింది. దీంతో అమ్మ పేరు మీద ఉన్న పాత రేషన్‌కార్డులో నుంచి మా పేర్లు తొలగించుకున్నాం. తీరా కొత్త కార్డులో మా భార్యాభర్తల పేర్లు రాలేదు. పిల్లల పేర్లు మాత్రం మా తల్లిదండ్రుల కార్డులో నమోదయ్యాయి. అధికారులు వీటిని సరిచేయడంతోపాటు కొత్త కార్డు జారీ చేయాలి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినం
వాజిద్ అలీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, ఆదిలాబాద్

కొత్తగా జారీ అవుతున్న రేషన్‌కార్డుల్లో పేర్లు తారుమారయ్యాయన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినాం. కొత్త కార్డులు ఇంకా జారీ కాలేదు. కానీ పేర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి మాత్రం వచ్చాయి. ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తుంది.

ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష ఎంపీలు మాట్లాడుతూ, వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఇక క్రైస్తవులతో సహా ఇతర కమ్యూనిటీలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని విమర్శించారు.

కేథలిక్ చర్చ్‌లు వర్సెస్ వక్ఫ్

'భారత్‌లో ఎవరికి ఎక్కువ భూమి వుంది? కేథలిక్ చర్చిలు వర్సెస్ వక్ఫ్ బోర్డుపై చర్చ ' అనే శీర్షికతో ఆర్గనైజర్‌లో వ్యాసం వచ్చింది. భారతదేశంలో కేథలిక్ చర్చిల అధీనంలో 7కోట్ల హెక్టార్లకు పైగా భూమి వుందని, అది, ప్రభుత్వేతర భూ యజమానుల్లో ఇదే అతి పెద్దదని ఆ వ్యాసం పేర్కొంది. ఈ భూమి విలువ రూ.20వేల కోట్లు వుంటుందని అంచనా వేసినట్లు తెలిపింది. భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో వక్ఫ్ బోర్డు కన్నా ఎక్కువగా చర్చి కీలక పాత్ర పోషిస్తోందని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వం తర్వాత దేశంలో రెండో అతిపెద్ద భూ యజమాని అంటే వక్ఫ్ బోర్డేనని అందరిలోనూ సాధారణంగా ఒక నమ్మకం వుందని, కానీ వాస్తవిక డేటాతో ఈ నమ్మకం సరిపోలడం లేదని పేర్కొంది. కేథలిక్ చర్చి అతిపెద్ద ప్రభుత్వయేతర భూ యజమానిగా ఆవిర్భవించిందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూముల సమాచార వెబ్‌సైట్ నుండి సేకరించిన డేటాను ఈ వ్యాసంలో పొందుపరిచారు.

ఈ వ్యాసం లక్ష్యమేంటి ?

ఈ వ్యాసం లక్ష్యం ఏమిటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే బిజెపి వైఖరికి ఇదొక చక్కని ఉదాహరణ అని విమర్శించారు. దీనిపై తాను ఇప్పటికే ప్రజలను హెచ్చరించానన్నారు. క్రిస్టియన్లపై తన దృష్టిని మళ్లించేందుకు బిజెపికి ఇక ఎక్కువ సమయం పట్టదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ నేతలు రమేష్ చెన్నితాల కూడా ఆర్ఎస్ఎస్ మేగజైన్ ప్రచురించిన వ్యాసాన్ని తీవ్రంగా విమర్శించారు.

కాగా ఈ వివాదంపై స్పందిస్తూ మేగజైన్ సంపాదకులు ప్రఫుల్ కేట్కర్, ఆ వ్యాసం చాలా పాతదని చెప్పారు. వక్ఫ్ బిల్లు తర్వాత దాన్ని బయటకు లాగారని విమర్శించారు.

ఈ వాణిజ్య యుద్ధంలో ఎవరూ గెలవరు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ, పై వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఏ మాత్రమూ సన్నద్ధంగా లేని దేశాల గురించే తమ ఆందోళన అంతా అని ఆయన చెప్పారు. ఈ వాణిజ్య యుద్ధం వల్ల ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని అన్నారు. అమెరికా విధించిన టారిఫ్‌ల వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ చాలా ప్రమాదకరమైన దశలోకి నెట్టబడుతోందని ఆంక్టాడ్ (వాణిజ్యం, అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి సదస్సు) శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. దీనివల్ల అభివృద్ధికి ముప్పు పొంచి వుందని, పెట్టుబడులు, ప్రగతి ముఖ్యంగా అత్యంత బలహీనమైన ఆర్థిక వ్యవస్థలు దెబ్బ తింటాయని హెచ్చరించింది. అమెరికా టారిఫ్‌లకు దీటుగా ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ కూడా పెద్ద ఎత్తున కొత్త టారిఫ్‌లు విధిస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని పేర్కొంది.

సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకోవాలి

శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
రెండో రోజు కొనసాగిన విత్తన పండుగ

నవతెలంగాణ-ఆమనగల్



స్థానిక సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకుంటూనే, సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించే పద్ధతులను అన్వేషించాలని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ నిర్వహిస్తున్న విత్తన పండుగ శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయంలో జీవనోపాధి, ఆరోగ్యం ఉంటుందని యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం యువతని ఆకట్టుకోవాలన్నారు. వాళ్లకు నమ్మకం కలిగిస్తేనే మనం వ్యవసాయాన్ని కాపాడుకోగలుగుతామని చెప్పారు. దానికి స్వదేశీ పద్ధతులు, విత్తనం మంచిదని, అయితే ప్రపంచ పోటీని కూడా తట్టుకునేలా వ్యవసాయ విధానాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ కమిషన్ కేబీఎస్ రెడ్డి, సిజీఆర్ వ్యవస్థాపకులు లీల లక్ష్మారెడ్డి, దొంతి నరసింహారెడ్డి, వ్యవసాయ నిపుణులు సునంద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కనీస అవసరాలను

ప్రాథమిక హక్కులుగా గుర్తించండి

సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ తీర్మానం

(సీతారాం ఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారత మహాసభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు ప్రవేశపెట్టగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఏఆర్ సింధు బలపర్చారు. 'ఈ కనీస అవసరాలను అందించే సంక్షేమ పథకాలు దాతృత్వ చర్యలు కావు. ఇవి ప్రతి పౌరుడి మౌలిక హక్కులు' అని తీర్మానంలో పేర్కొన్నారు.

'వీటిని పొందడం ప్రతి పౌరుడి హక్కు. ఇవే న్యాయం, సమానత్వానికి పునాది. ఆర్థిక హక్కులు సామాజిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి. సంక్షేమ కార్యక్రమాలు పెట్టుబడులుగా పని చేస్తాయి. ఫలితంగా ఎక్కువ ఉత్పాదకత కలిగిన కార్మిక వర్గాన్ని తయారుచేసి, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయి.' అని తీర్మానంలో సీపీఐ(ఎం) వివరించింది. 'నూతన ఉదారవాద విధానాల ప్రవేశంతో, సామాజిక రంగంపై దాడులు మొదలయ్యాయి. ప్రభుత్వాలు ఆరోగ్యం, విద్యా రంగాల నుంచి తప్పుకోవాలని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వాటిని ప్రయివేటీకరించి తీరాలని ఈ విధానాలు చెబుతాయి. బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం ఈ సంక్షేమ కార్యక్రమాలను నిర్వీర్యం చేయడానికి, సబ్సిడీలను తగ్గించేందుకు ప్రయత్నాలను తీవ్రం చేస్తోంది. ప్రధాని మోడీ ఈ సంక్షేమ పథకాలను 'రేవడీలు'గా పోలుస్తూ, ఇవి దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది అసలు వాస్తవానికి వ్యతిరేకం, ఎందుకంటే ఈ సంక్షేమ కార్యక్రమాలే మార్కెట్ ప్రేరేపిత నూతన ఉదారవాద విధానాల వల్ల నష్టపోయే బలహీన వర్గాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.' అని తీర్మానం వివరించింది. ' సబ్సిడీల ఆధారంగా ఉన్న పథకాల స్థానంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని నగదు బదిలీ పథకాలు చివరికి మౌలిక సామాజిక భద్రతా పథకాలను కుదించడానికి దారి తీస్తాయని, ఫలితంగా అత్యంత బలహీన వర్గాలు మరింత దుర్బల స్థితిలోకి వెళ్లిపోయాయని తీర్మానంలో పేర్కొన్నారు. 'ఇది భారత రాజ్యాంగంలోని మార్గదర్శక సూత్రాలను ఉల్లంఘించ డమే.! ఇవి అన్ని వర్గాల పౌరులకు కుల, మత, వర్ణ, లింగ, ఇతర భేదాభిప్రాయాలకు అతీతంగా గౌరవనీయ జీవితానికి హామీ ఇవ్వాలని స్పష్టంగా చెబుతున్నాయి. అయితే, వాటిని అమలు చేయడం లేదు. అందువల్ల వీటిని న్యాయబద్ధమైన రాజ్యాంగ హక్కులుగా మార్చాల్సిన అవసరముంది.' అని తీర్మానం పేర్కొంది. 'నూతన ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు "ఆర్థిక భారం" వల్ల ఈ హక్కులకు హామీ ఇవ్వలేమని చెబుతాయి. ఇది పూర్తిగా తప్పుడు వాదన. ఎందుకంటే, కార్పొరేట్ పన్నులను నిరంతరం తగ్గించడమే కాకుండా, కంపెనీల నుంచి చట్టపరంగా వసూలు చేయాల్సిన పన్నులను వసూలు చేసేందుకు కూడా ప్రభుత్వాలు సిద్ధపడటం లేదు. బీజేపీ ప్రభుత్వం తన అధికారంలో ఉన్న ప్రతి ఏడాది కార్పొరేట్ పన్నులను తగ్గిస్తూ వచ్చింది. దీనికి బదులుగా ఒక న్యాయబద్ధమైన పన్నుల విధానం ద్వారా అవసరమైన అన్ని సేవలు ప్రతి పౌరునికి అందించవచ్చు' అని సీపీఐ(ఎం) తీర్మానంలో తెలిపింది. ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఈ తీర్మానంలో సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది.

పోరాటం పదునెక్కుతోంది

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) పెద్దఎత్తున ఆందోళనలు చేసిందని తెలిపారు.

పెరిగిన పార్టీ సభ్యత్వం..

గత మహాసభ (2021) నుంచి ప్రస్తుత మహాసభ మధ్య కాలంలో సీపీఐ(ఎం) సభ్యత్వం పెరిగినట్టు రాఘవులు తెలిపారు. 2021 నాటికి 9,85,757గా ఉన్న పార్టీ సభ్యత్వం 2024 నాటికి 10,19,009కి చేరిందని, మహిళల సభ్యత్వం 18.2శాతం నుంచి 20.2 శాతానికి పెరిగిందని వివరించారు. పార్టీలో యువకుల సభ్యత్వం కూడా పెరుగుతోందని తెలిపారు. 2021లో 19.5శాతంగా ఉన్న యువకుల సభ్యత్వం 2024 నాటికి 22.6కు చేరిందని, వర్గ పొందిక కూడా సంతృప్తికరంగా ఉంద ని చెప్పారు. మొత్తం సభ్యత్వంలో 48.25శాతం కార్మిక వర్గానికి చెందిన వారు కాగా, 17.79 శాతం వ్యవసా య కార్మికులు, 9.93శాతం పేద రైతులు ఉన్నారని తెలిపారు. మొత్తం సభ్యత్వంలో 75.97శాతం పునాదివర్గాలకు చెందినవారని తెలిపారు.

13 తీర్మానాలు ...

వ్యవసాయ మార్కెటింగ్ కోసం రూపొందించిన నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్‌ను ఉపసంహరించుకోవాలని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్య, వైద్యం, ఆహారం, పెన్షన్ వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్మానించినట్టు చెప్పారు. వీటితో పాటు మొత్తం 13 తీర్మానాలను శనివారం నాటి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించి నట్టు రాఘవులు తెలిపారు. ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చెప్పారు. ఈ తీర్మానంపై జరిగిన చర్చల్లో 53 మంది ప్రతినిధులు పాల్గొన్నారని, మొత్తం 174 సవరణలు అందాయని చెప్పారు. చర్చకు పొలిట్‌బ్యూరో సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్ సమాధానం ఇచ్చారని, అనంతరం మహాసభ ఆమోదించిందని చెప్పారు. క్రిస్టియన్లపై సంఘ్‌పరివార్ చేస్తున్న దాడులను ప్రస్తావించగా అటువంటి సంఘటనలను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవండి : తరిగామి

కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యుడు తరిగామి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలను కేంద్రం తీవ్రంగా దెబ్బ తీసిందని, సొంత దేశంలోనే శరణార్థుల్లా బతకాల్సిన పరిస్థితిని తీసుకు వచ్చిందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత పరిస్థితులు ఘోరంగా మారాయని, ప్రజల చేతుల్లో నుంచి భూమి కార్పొరేట్ల చేతుల్లోకి పోతోందని అన్నారు. ఎన్నుకున్న ప్రభుత్వానికి కనీస హక్కులు కూడా లేవని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు : సీపీఐ(ఎం) డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడం, వివిధ వత్తుల్లో ప్రవేశించే అవకాశాల్లో ఆంక్షలు, విద్య నిరాకరణ వంటి అంశాల కారణంగా ఆర్థికంగా వీరికి ఎదగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'రాజకీయంగా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఈ కులాల ఆర్థిక విస్మరణను ఎదుర్కోవడంలో అత్యంత కీలకంగా మారాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15(4), 16(4), 46, 335 ఆధారంగా ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడానికి మార్గం ఏర్పడింది. అయితే ఈ రిజర్వేషన్లు ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమ య్యాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు లోనూ తీవ్ర లోపాలు జరిగాయి. అనేక రిజర్వ్ చేసిన ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 2023లోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యో గాల్లో 10 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయి. వీటిలో అత్యధికం రిజర్వ్ ఉద్యోగాలే. రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి. నూతన సరళీకరణ ఆర్థిక విధానాలతో, రిజర్వేషన్ వర్తించే ప్రభుత్వరంగ ఉద్యోగాల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయింది. 1990లలో సుమారు 2 కోట్ల ప్రభు త్వ ఉద్యోగాలు (కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు, సెమీ -ప్రభుత్వ రంగాలు కలిపి) ఉండగా, 2012 నాటికి ఈ సంఖ్య 1.7 కోట్లకు పడిపోయింది. అంటే 30 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిణామం మరింత వేగంగా జరిగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలపై సమగ్ర గణాంకాలను ప్రచురించడం మానే సింది. అయినప్పటికీ, రైల్వేలు, పోస్టులు, బ్యాంకులు వంటి రంగాల్లో ఉద్యోగాలు పెద్దఎత్తున తగ్గినట్టు గణాంకాలు చూపుతు న్నాయి. 1990ల మధ్యకాలంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 10 లక్షలకు పైగా ఉద్యోగులు ఉండగా, 2024 నాటికి ఇది 7.5 లక్షలకు తగ్గిపోయింది. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 4.5 లక్షల ఉద్యోగాలు తగ్గాయి (అంటే 35 శాతం తగ్గుదల). రైల్వేలో 80,000, పోస్టల్ శాఖలో 40,000, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 90,000 ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదల అధికంగా గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాల్లో నమోదైంది. 2014-15 నుంచి 2022-23 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంలో తగ్గిన ఉద్యోగాల్లో 86 శాతం ఈ ఉద్యోగాలే. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాలు వీటిలోనే ఎక్కువ జరిగాయి. ఈ విధానాల కారణంగా ప్రభుత్వ సంస్థలలో ఔట్‌సోర్సింగ్, ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగుల నియామకం పెరిగింది. విద్యారంగ ప్రయివేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియామకాలు పెరగలేదు. ఫలితంగా ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయుల నిష్పత్తి భారీగా తగ్గింది. 2023-24లో ఎస్టీ ఉపాధ్యాయులు కేవలం 7.7 శాతం, ఎస్సీ ఉపాధ్యాయులు 12.6 శాతం మాత్రమే ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఈ కులాల ఉపాధ్యాయులకు అవకాశం మరింత తక్కువగా కేవలం 13 శాతం మాత్రమే ఉంది.' అని తీర్మానం పేర్కొంది. 'ప్రభుత్వ నిధులతో రూపొందించే ఉపాధి పథకాల్లోనూ రిజర్వేషన్లు అమలు కావడం లేదు. ఉదాహరణకు, 2024 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఉపాధి పథకాల నిమిత్తం రూ.1.73 లక్షల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించింది. ఇందులో 20 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్ అమలయ్యేలా ఎటువంటి నిబంధనా లేదు. నూతన ఉదారవాద విధానాల్లో ప్రయివేటీకరణ, కాంట్రాక్టు విధానం ప్రధానంగా ఉన్నాయి. ఇవి ఉపాధి అవకాశాలను అసంఘటిత రంగానికి తరలించాయి. ఫలితంగా రిజర్వేషన్లు ఒక సామాజిక న్యాయం సాధించే సాధనంగా ఉండలేకపోయాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు రంగం మొత్తానికి రిజర్వేషన్లను వర్తింపజేయాలని, అన్ని గుర్తింపు పొందిన సంస్థలకు విస్తరిం చాలని. ప్రతి ప్రయివేట్ కంపెనీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధనను రూపొందించి, అమలు చేయాలి' అని సీపీఐ(ఎం) తీర్మానంలో డిమాండ్ చేసింది.

మరిన్ని తీర్మానాలు...

- వక్ఫ్ సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలన్న తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. దీనిని కేంద్ర కమిటీ సభ్యులు ఎలమరిం కరీం ప్రతిపాదించగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు అంజుకుమార్ బలపరిచారు.
- జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్రహోదా కల్పించడం, ప్రజాస్వామ్యాన్ని బలపర్చడం వంటి చర్యలు తక్షణం తీసుకోవాలి. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి ప్రవేశపెట్టగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్ సర్కార్ బలపర్చారు.
- క్యూబాకు సంఘీభావం తెలపడంతోపాటు, ఆ దేశంపై అమెరికా విధించిన అన్ని అమానవీయ ఆంక్షలను ఎత్తివేయాలన్న తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ ప్రతిపాదించగా, మయూఖ్ బిశ్వాస్ బలపర్చారు.
- ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే యత్నాలను ప్రతిఘటించాలి. ఈ తీర్మానాన్ని సుదీప్ దత్త ప్రతిపాదించగా, ప్రమోద్ ప్రధాన్ బలపరిచారు.
- డీప్ సీ మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర కమిటీ సభ్యులు థామస్ ఐజాక్ తీర్మానాన్ని ప్రతిపాదించగా ఆలీ కిషోర్ పట్నాయక్ బలపరిచారు.
- మహిళలు, పిల్లలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని మరియం ధావలే ప్రవేశపెట్టగా, సురేంద్రమల్లిక్ బలపరిచారు.
- యువత డ్రగ్స్‌కు అలవాటు పడటానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ తీర్మానాన్ని సీసీ సభ్యులు సుఖ్విందర్ సింగ్ షేఖాన్ ప్రతిపాదించగా, అరుణ్‌మెహతా ప్రతిపాదించారు.
- ఎల్‌జీబీటీక్యూకు సమాన హక్కుల తీర్మానాన్ని సీసీ సభ్యురాలు యు.వాసుకి ప్రతిపాదించగా, కె.నీల బలపర్చారు.
- అంగవికలాంగులకు గౌరవం, న్యాయం కల్పించాలన్న తీర్మానాన్ని ఝూన్సీరాణి ప్రతిపాదించగా, సామ్య గంగూలీ బలపర్చారు.
- యూజీసీ రూపొందించిన ముసాయిదా నిబంధనలను వ్యతిరేకిం చాలన్న తీర్మానాన్ని రాజీవ్ కున్వార్ ప్రతిపాదించగా, వీపీ సాను బలపర్చారు.



సాంస్కృతిక వేదిక వద్దకు వస్తున్న ప్రకాశ్‌రాజ్



కర్నాటక కళాకారుల నృత్య ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శనలకు వర్షం ఆటంకం



క్రైస్తవులపై పెరుగుతున్న 'సంఘ్' దాడులు

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి



మధ్యప్రదేశ్‌ను క్రైస్తవులపై దాడులకు ప్రయోగశాలగా సంఘ్ పరివార్ శక్తులు మార్చుకున్నాయని ఆ రాష్ట్ర సీపీఐ(ఎం) కార్యదర్శి జస్విందర్ సింగ్ చెప్పారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో సంఘ్‌పరివార్ శక్తులు చెలరేగిపోతున్న తీరును వివరించారు.


-'జబల్పూర్‌లో విహెచ్‌పి గుండాలు మలయాళీ క్రైస్తవ పూజారు లపై దాడి చేశారు. ఇది మైనారిటీలపై గత కొన్నేళ్లుగా జరుగుతున్న అణచి వేతలకు కొనసాగింపే. మధ్యప్రదేశ్‌లో సాధారణంగా ముస్లింలు సంఘ్ పరివార్ దాడులకు గురవుతుంటారు. అయితే ఆదివాసీ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడు క్రైస్తవులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు.' అని ఆయన వివరించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా చురుకుగా పోరాడుతున్నట్లు చెప్పారు.

'2024 జనవరి 22న, ప్రధాని రామ్ మందిరాన్ని ప్రారంభించిన రోజే, ఝబువా జిల్లాలో చర్చ్‌ను సంఘ్ పరివార్ కూల్చివేసింది. . గోడలపై "జై శ్రీరామ్" అని రాశారు. మరో చర్చ్‌పై కాషాయ జెండా ఎగురవేశారు. ఎప్పుడూ లేని విధంగా నర్మదా నదికి కుంభ మేళా నిర్వహించి క్రైస్తవ చర్చ్‌లను ధ్వంసం చేశారు.' అని ఆయన తెలిపారు. 'దీని అర్థం ముస్లింలపై దాడులు జరగడం లేదని కాదు. వారిపై మరింత ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఈ దాడులన్నింటి వెనుక పోలీసులు ఉన్నారు. ఇటీవలే ఇండోర్ జిల్లాలోని మ్హౌ పట్టణంలో ఊరేగింపు సందర్భంగా ఒక మసీదు మీద దాడి జరిగింది. దాడి చేసిన వారి పేర్లు ఇచ్చినా, ఎఫ్ఐఆర్‌లో "గుర్తు తెలియని వ్యక్తులు" అనే నమోదు చేశారు. అదే సమయంలో, 13 మంది ముస్లిం యువకులపై అబద్ధపు కేసులు బనాయించి, వారి ఇండ్లు బుల్డోజర్లు పంపించి కూల్చేశారు. ఇన్ని దాడులు జరుగుతున్నా సీపీఐ(ఎం) తప్ప బాధితుల తరపున మరే పార్టీ మాట్లాడటం లేదని అన్నారు.

'వక్ఫ్' తరువాత చర్చిపై సంఘ్ దృష్టి

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

పినరయి విజయన్



వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించిన అనంతరం చర్చిపై సంఘ్‌పరివార్ దృష్టి సారించిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. మదురైలో సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ జరుగుతున్న సీతారాం ఏచూరి నగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడం ద్వారా నరేంద్రమోడీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన దాడి చేసిందని చెప్పారు. దాని తరువాత దేశ వ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ చర్చిపై సంఘ్ పరివార్ దాడికి దిగుతోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మౌత్‌పీస్ 'ఆర్గనైజర్'లో ప్రచురితమైన ఒక వ్యాసం ఈ విషయాన్ని ధృవీకరిస్తోందని పినరయి విజయన్ చెప్పారు. 'సంఘ్ లక్ష్యాలను ఆ వ్యాసం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది' అని ఆయన అన్నారు. చర్చి ఆస్తుల విషయాలను అసందర్భంగా ప్రస్తావించడమే కాకుండా, ఆ వ్యాసం ద్వారా తన శ్రేణులకు చర్చి పట్ల వ్యతిరేక సంకేతాలను ఉద్దేశ పూర్వకంగానే పంపుతోందని ఆయన అన్నారు. ఆర్గనైజర్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఆ వ్యాసాన్ని ప్రస్తుతం తొలగించినప్పటికీ, సంఘ్ పరివార్ అసలు ఉద్దేశాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ యొక్క అసలైన ఆలోచనా ధోరణులకు ఆ వ్యాసం అద్దం పట్టిందని చెప్పారు. మెజార్టీ వాదం పేరుతో సంఘ్ పరివార్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, మైనార్టీ మతాలను లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. క్రమంగా వారిని అణచివేయాలన్న విస్తృత కార్యాచరణలో భాగంగానే ఈ తరహా చర్యలు చోటుచేసుకుంటున్నా యని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతంగా ఉన్న భారతీయ సంస్కృతిపైనా, రాజ్యాంగంపైన సంఘ్ పరివార్ శక్తులు చేస్తున్న ఈ దాడులను ఎదుర్కునేందుకు ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా స్పందించాలని ఆయన కోరారు.

నిర్విరామంగా వాలంటీర్ల సేవలు

ఇదొక గొప్పఅనుభూతి : వాలంటీర్ల ఇన్‌చార్జి ఏ.వీ.సింగార వేలన్

- మహాసభ కోసం జనవరి నుంచే రంగంలోకి..

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ఎక్కడా ఎలాంటి అవాంతరాల్లేకుండా మహాసభ సజావుగా సాగటంలో వారి పాత్ర కీలకం. అధ్యక్షవర్గం నుంచి పరిశీలకుడి దాకా ఎవరికి ఏ అవసరమొచ్చినా క్షణాల్లో తీరుస్తూ ఏ చిన్న అసౌకర్యం కలగకుండా చూస్తూ ఆ కామ్రేడ్లు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నిర్విరామంగా సేవలందిస్తూ 'శభాష్' అనిపించుకుంటున్నారు. వారే వాలంటీర్లు. తమిళనాడులోని మదురైలో సీపీఐ(ఎం) 24వ మహాసభ నిర్వహణ కోసం వీరు జనవరి నుంచే రంగంలోకి దిగారు. దాదాపు మూడు నెలలపాటు శ్రమించి... నిధుల సమీకరణ, ప్రచారం, గోడల మీద రాతలు తదితర కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశారు. మహాసభ ప్రాంగణంలో సౌకర్యాలను కల్పించటం, వాటి నిర్వహణ, ప్రతినిధులకు స్వాగతం పలకటం, వారి బస, రవాణా, వివిధ ప్రదర్శనల ఏర్పాటు, వైద్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికల ఏర్పాట్లు తదితర పనులను 425 మంది వాలంటీర్లు తమ భుజాన వేసుకున్నారు. వీరిలో 50 మహిళా వాలంటీర్లు కూడా ఉన్నారు. తమిళనాడులోని అన్ని ప్రాంతాలకు చెందిన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా సంఘాల నుంచి చురుకైన కార్యకర్తలను వాలంటీర్లుగా నియమించారు. వీరిలో సీఐటీయూకు చెందిన వంద మంది వాలంటీర్లు రవాణా సౌకర్యాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరో వంద మంది వాలంటీర్లు మహాసభ ప్రాంగణం, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం బాధ్యతలను చూస్తున్నారు. ప్రతినిధులు



రావటానికి వీలుగా కాన్ఫరెన్సు హాల్‌కు ఉన్న ఆరు గేట్లు, ఒక వీపీఐ గేటు దగ్గర మరికొంతమంది బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరో వైపు ప్రతినిధుల సహాయార్థం ఇంగ్లీషు, హిందీ, తెలుగు, మళయాళం భాషలు తెలిసిన 30 మంది వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కాగా ఉదయం ప్రతినిధులు వచ్చేసరికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు వీలుగా ప్రతీరోజూ పది మంది వాలంటీర్లను రాత్రి విధుల్లో నియమించారు. రొటేషన్ పద్ధతిలో రోజుకో బృందం ఈ రకంగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. మహాసభల కోసం పనిచేయటం తమకు గొప్ప అనుభూతిని మిగిల్చిందని వాలంటీర్ల ఇన్‌చార్జి ఏ.వీ. సింగార వేలన్ తెలిపారు. పార్టీ, ప్రజా సంఘాల సమన్వయంతో తాము ఈ పనులన్నింటినీ జయ ప్రదంగా చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

వ్యవసాయ మార్కెటింగ్

నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని ఉపసంహరించండి

సీపీఐ(ఎం) తీర్మానం

సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

వ్యవసాయ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు 24వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కృష్ణప్రసాద్ ప్రవేశపెట్టగా, కేంద్ర కమిటీ సభ్యులు కరుమలయాన్ బలపరిచారు. 'పోరాడుతున్న రైతు ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా, కొత్తగా తీసుకువస్తున్న ఫ్రేమ్ వర్క్ పాలసీ రైతులపై కార్పొరేట్ దాడిని మరింత ఉధృతం చేసే ప్రయత్నం. దీనిని మహాసభ తీవ్రంగా ఖండిస్తోంది. రైతుల పోరాటాల కారణంగా రద్దైన వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన తీసుకువచ్చే కుట్ర ఇది. రైతులు ముందుకు తీసుకువచ్చిన ప్రధాన డిమాండ్లయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణమాఫీ, సమగ్ర పంటల బీమా, వ్యవసాయంపై ప్రభుత్వ పెట్టుబడుల పెంపు, రుణ సౌకర్యాలు వంటివాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ఈ ముసాయిదా ను తీసుకువచ్చారు. రాజ్యాంగంలోని 246వ ఆర్టికల్ ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర అంశం అయినా కూడా కేంద్రం దీనిని తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరిస్తోందని తీర్మానం పేర్కొంది. ఇది ప్రభుత్వ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని, సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయాలని, చిన్న, మధ్యస్థ రైతులను ప్రయివేట్ వ్యాపార దోపిడీకి అప్పుచెప్పాలని ప్రయత్నం చేస్తోంది.' అని తీర్మానం పేర్కొంది. 'ప్రయివేట్ హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, కార్పొరేట్ సంస్థలు నేరుగా రైతుల నుంచి పొలాల దగ్గరే కొనుగోలు చేయడం , సంప్రదాయ మార్కెట్ యార్డులను కార్పొరేట్ గోదాములుగా మార్చడం రాష్ట్రవ్యాప్తంగా ఏకీకత మార్కెట్ ఫీజు, లైసెన్స్ విధానం తీసుకురావడం వంటివి నూతన ప్రతిపాదనల్లో ఉన్నాయని తీర్మానంలో పేర్కొన్నారు.

పంజాబ్‌లో లుధియానా, హర్యాణాలో సిర్సాలో ఇప్పటికే రిలయన్స్, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలు పెద్ద స్థాయిలో గోదాములు, ప్రయివేట్ రైలుట్రాకులు నిర్మించాయని, ఇది రైతులను కార్పొరేట్లకు అప్పజెప్పడమేనని తీర్మానంలో తెలిపారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, బ్రాండింగ్‌తో పాటు మిగతా ప్రక్రియలు చేసి ఎక్కువ లాభాలు పొందే వ్యూహం దీని వెనకు ఉందని, ఇది రైతులను వినియోగదారులను ఇద్దరినీ దోచుకునే విధానమేనని తెలిపారు. ఈ విధంగా వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన వల్ల రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరుగుతాయని, రైతాంగం మరింత పేదరికంలోకి నెట్టబడుతోందని తీర్మానం ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కబ్జాకు వదిలిపెట్టడంతో పాటు, ప్రధాని మోడీ ప్రమోట్ చేస్తున్న కార్పొరేట్ సంస్థకు అప్పజెప్పే దుర్మార్గమైన వ్యూహం ఉందని, ఇది దేశంలో ఆహారకొరతకు దారి తీస్తుందని తీర్మానం వివరించింది. దీనిని వెనక్కి తీసుకునేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని రైతులకు సీపీఐ(ఎం) మహాసభ పిలుపునిచ్చింది.





దేశానికి 'అనన్య' పాఠం!

సంపాదకీయం

ఈ దృశ్యం చూడగానే ప్రపంచ నరమేధ ఇజ్రాయిల్ గాజాపై సాగిస్తున్న భీకరబాంబుల వర్షం నుంచి తప్పించుకుని, శిథిలాల కింద పుస్తకాల బ్యాగును సంకన పెట్టుకుని, గాజాలో వీధుల వెంట పరుగెత్తిన చిన్నారి గుర్తుకొచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో తమ గుడిసె కాలుతుంటే ఓ బాలిక స్కూల్ బ్యాగును పట్టుకుని ఏడుస్తూ పరుగెత్తడం అందరి మనసుల్ని కలిచి వేసింది. ఈ వీడియో భారత అత్యున్నత న్యాయస్థానాన్ని కలవరపాటుకు గురిచేసింది. అంతకన్నా ముందు 'బుల్డోజర్' కూల్చివేతలపై యోగీ సర్కార్‌కు మొట్టికాయలు వేసింది. ఇక్కడే ఒక పసివాడని మనసు అనన్య దేశానికి ఒక పాఠం చెప్పింది! చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన బుల్డోజింగ్‌ను 'డబులింజన్‌సర్కార్' ఒక సంస్కృతిగా మార్చింది. దళితులు, ముస్లిం మైనార్టీల లక్ష్యంగా ప్రారంభమై 'బుల్డోజింగ్ జస్టిస్' పేరుతో పేదల ఇండ్లను కూల్చేస్తున్నది. ఈ కూల్చివేత పర్వం భావి భారత పౌరులుగా ఎదగాల్సిన చిన్నారుల హృదయాలకు ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నది పాలకులు గమనించకపోవడం శోచనీయం. దేశాన్ని ఏలే పెద్దమనుషులు మాట మాట్లాడితే 'బేటి బచావో..బేటి పడావో' అంటూ సాగించే ఉపన్యాసం ఈ చిన్నారి వేదనకు కారణం అన్వేషించగలదా? ఈ ఘటన నుంచి గుణపాఠం నేర్వగలదా?

ఆ ఎనిమిదేండ్ల బాలిక పేరు అనన్య. యూపీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నది. కూలీ పనులు చేసుకుని బతికే కుటుంబం. గతనెల 21న అంబేద్కర్‌నగర్‌లో ఇండ్ల కూల్చివేత వారిని నిలువ నీడ లేకుండా చేసింది. యాభై ఏండ్లుగా ఆక్రమణలో ఉంటున్న గుడిసె మంటల్లో కలిసింది. దీన్ని చూస్తున్న బాలిక తన పుస్తకాల సంచిని భద్రంగా పట్టుకుని పరుగులు పెట్టింది. స్కూలు నుండి వచ్చిన తర్వాత తమ గుడిసెను ఆనుకుని వున్న పశువుల పాకలో పుస్తకాల సంచి పెట్టింది. ఆక్రమణలో ఉన్నాయనే పేరుతో కొందరి ఇండ్లు కూలగొడుతుండగా మంటలు చెలరేగాయి. వారి గుడిసె కూడా నిప్పంటుకుంది. ఒక్కసారిగా తన పుస్తకాలు కాలిపోతాయేమోననే భయంతో చిన్నారి పరుగెత్తింది. తల్లి వారిం చినా వినలేదు. అవి కాలిపోతే మళ్లీ స్కూల్లో దొరకవని భయపడింది. ఆ చిన్నారి వీడియో వైరల్ అయ్యాక ఆమెతో చాలామంది మాట్లాడారు. 'కలెక్టర్ కావాలని..దేశాన్ని రక్షించాలని' చెప్పి దేశం మీద తన అభిమానాన్ని చాటింది.

అంతకన్నా ముందు సుప్రీంకోర్టు ప్రయాగ్‌రాజ్‌లో 2021లో బీజేపీ ప్రభుత్వం డెవలప్‌మెంట్ అథారిటీ ఆరు ఇండ్లను బుల్డోజర్లతో కూల్చి వేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యూపీ గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ హత్య తర్వాత అతని స్థిరాస్తుల్ని ప్రభుత్వం కూల్చివేసింది. 'అతిక్ ఇండ్లనుకుని పొరపాటు వేరేవారివి కూల్చామని' అధికారులు చెప్పారు. వాస్తవానికి ఇండ్ల కూల్చివేతల బాధితుల్లో ఓ లాయర్, ఓ ప్రొఫెసర్ కూడా ఉన్నారు. ప్రొఫెసర్, లాయర్, మరో ముగ్గురు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ కోర్టు వారి పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో వారు సుప్రీం గడపతొక్కాల్సి వచ్చింది. అనేక వాదనల తర్వాత మంగళవారం సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి మొట్టికాయలేసి తుదితీర్పును వెలువరించింది. 'ఈ తీరు మమ్మల్ని ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ కూల్చివేతలు పూర్తిగా అమానవీయం, చట్టవిరుద్ధం. ఎవరైనా ఆశ్రయం పొందేందుకు భారత రాజ్యాంగం హక్కు కల్పించింది. రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్‌లో అది స్పష్టంగా ఉందని డెవలప్‌మెంట్ అథారిటీ గుర్తుంచుకోవాలి.' అని పేర్కొంది. దీంతో పాటే 'మీరు కూల్చి వేసిన ఇంటి బయట ఓ చిన్నారి ఏడుస్తున్న వీడియో ఎంతో హృదయ విదార కంగా ఉంది. ఈ వీడియో చూసి ప్రజలు అనేక మంది కలత చెందారు. ఈ తరహా కూల్చివేతలను వెంటనే ఆపేయాలి. కూల్చివేతలు ఫ్యాషన్ కాకూడదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

అంతేకాదు, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే ప్రతీకార ధోరణికి స్వస్తి చెప్పాలని, అధికారులే న్యాయమూర్తుల పాత్ర పోషిం చటం సరైంది కాదని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహరించాల్సిన విధి విధానాలను కూడా ప్రకటించి, అవి దేశం మొత్తానికి వర్తిస్తాయని చెప్పింది. అయినప్పటికీ పాలకులు పట్టించుకుంటే కదా! యోగి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఇలా తలంటడం ఇదే మొదటిసారి కాదు, బుల్డోజింగ్ అన్యాయాన్ని తలకెత్తుకున్న ప్రతిసారీ మొట్టికాయలు వేస్తూనే ఉంది. అయినా, బుద్ధితెచ్చుకోని సర్కార్ అదే అనాగరిక ధోరణిని సాగిస్తున్నది. ఇది క్రమంగా బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటికీ పాకించింది. దేశంలో ముస్లింల ఇండ్లను కూలగొట్టడం ప్రారంభించి, ఆ తర్వాత ప్రభుత్వ వ్యతిరేక కార్యక్ర మాలు, నిరసనల్లో పాల్గొన్న సామాన్యుల ఇండ్లను నేలమట్టం చేస్తూ వచ్చింది. మొన్నిమధ్య మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'మీ ఇంటి మీదకు బుల్డోజర్లను పంపిస్తాం' అన్నాడు. ఈ వ్యాఖ్యల్ని పరిశీలిస్తే అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని చట్టాలను వారి చుట్టంగా భావిస్తున్నా రన్నమాట! ఇలా.. మతం మాటున జరుగుతున్న కూల్చివేతలపై దేశంలో ఇంకా పెద్ద ఎత్తున చర్చ జరగాలి. ఉత్తరప్రదేశ్‌లో జరిగింది ఘటనగా కా కుండా, దేశానికి పొంచిన ముప్పుగా పరిగణించాలి. అనన్య లాంటి చిన్నారికి జరిగిన 'భావోద్వేగ గాయం' మరెవరికి జరగకుండా బాసటగా నిలవాలి.

వక్ఫ్‌బిల్ టు నాగపూర్.. వివాదాల పరివార్!



తెలకపల్లి రవి

ప్రధాని నరేంద్ర మోడీ ఈ పదవి చేపట్టిన తర్వాత పదకొండేండ్లకు మార్చి 30న నాగపూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించటం జాతీయ స్థాయిలో కచ్చితమైన రాజకీయ సంకేతాలిచ్చింది. ఔరంగజేబు సమాధికి సంబంధించిన నాగపూర్‌లో అల్లర్లు జరగటం, పార్లమెంట్లో వక్ఫ్‌బిల్లు ఆమోదం, కాశీ మధురల్లో మసీదు మందిర వివాదాల్లో ఆరెస్సెస్ కార్యకర్తలు పాల్గొనవచ్చునని దాని కీలక ద్వితీయ నాయకుడైన దత్తాత్రేయ హోసబులే కాషాయ జెండా ఊపడం ఒక వరసలోవే. త్వరలో జరిగే బీహార్, యూపీ, గుజరాత్, బెంగాల్, కేరళ ఎన్నికలకు ముందు బీజేపీ సంఘ పరివార్ హిందుత్వ ఎజెండాను ఉధృతం చేయబోతున్న సూచనలే.

పార్లమెంట్‌లో వక్ఫ్‌బిల్లు మీద జరిగిన హోరాహోరీ పోరాటం ఒక విషయాన్ని స్పష్టం చేసింది రాజ్యాంగం 25 నుంచి 28 అధికరణాల వరకు మత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాథమిక హక్కులపై దాడిగా ప్రతిపక్షాలు ఈ బిల్లును ఎదుర్కొన్నాయి. అయితే హోంమంత్రి అమిత్ షా, బిల్లును ప్రతిపాదించిన న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాత్రం ఇదేదో పేద ముస్లింలకు మేలు చేయడానికి తెచ్చినట్టు గొప్పలు పోయారు. కానీ వారి భాష, ఇచ్చిన ఉదాహరణలు చూస్తే రాజకీయ కోణం స్పష్టమవుతుంది. 'ఈ పార్లమెంటు భవనం కూడా వర్క్ వక్ఫ్ కిందకే వస్తుందని వారు వాదిస్తారని' రిజుజు ముస్లింలను ఉద్దేశించి అన్నారు. చర్చను కాంగ్రెస్ వైపు మళ్లించి 2014 ఎన్నికలకు ముందు ఆ పార్టీ వేలాది ఆస్తులను కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురాభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ. ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు ఎవరైనా భారతీయులైనన్న రాజ్యాంగ స్పృహను దెబ్బ తీసేలా ముస్లిం సంస్థల ఆస్తులు వశపరచుకోవటం పెద్ద విజయంలాగా చూపించటం ఎన్నికల లబ్ధి కోసమే. వక్ఫ్ బోర్డులోని 22 మంది సభ్యులలో నలుగురు ముస్లి మేతరులు ఉండాలని నిర్ణయించటం నిస్సందేహంగా వారి మత భావాలను దెబ్బతీసే అంశం అవుతుంది. ఒకవైపున తిరుపతిలో అన్యమత ఉద్యోగులను కూడా తొలగించాలంటున్న తీరుకు ఇది పూర్తి విరుద్ధం. దేవాలయాలను పూర్తిగా మత సంస్థలకు అప్పగించాలంటూ ఇటీవల విజయవాడలోనే భారీ సమీకరణ జరపటం కూడా చూశాం. రాజ్యాంగం మైనారిటీ మతాలకు ప్రత్యేక రక్షణ కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యత గుర్తించడం, దేశ సమైక్యతను కాపాడుకోవడం కోసమే. కులమత లింగ వివక్ష లేకుండా పౌరులందరూ ఒకే హక్కులు కలిగి ఉండటం, ప్రజాస్వామ్యం కనుక రక్షణలు ఎప్పుడు తక్కువ సంఖ్యలో ఉన్న వారికే కల్పించబడతాయి. భారతదేశంలో హిందూ ముస్లిం ఐక్యత సామరస్యం భవిష్యత్తు భద్రతకు అత్యవసరమని అరక్షణమైన మర్చిపోకూడదు.

వక్ఫ్‌పై కేంద్రం భాష

2019లో బీజేపీ రెండోసారి అధికారంలోకి రాగానే కాశ్మీర్ 370 అధికరణం రద్దుకు పాల్పడటం వెనుక ఏ వ్యూహం ఉందో మూడోసారి నెగ్గాక వక్ఫ్‌మీద దాడి కేంద్రీకరించటం వెనకా అదే ఉంది. ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీలు మాత్రమే కాక రెండు లౌకిక పక్షాలు కూడా దాన్ని బలపరచటం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా వైసీపీ, అలాగే బీఆర్ఎస్ ఈ బిల్లుపై బీజేపీకి వ్యతిరేకంగా ఓటు చేయడం విశేషం. బిల్లు ఆమోదం పొందాక 'ఇది చారిత్రక మూలమలుపు'అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అచ్చంగా అలాంటి ప్రకటన విడుదల చేయడం యాదృచ్ఛికం కాదు. తెలుగుదేశం పార్టీ తాము ఏవో సూచనలు చేశామంటూ కొన్ని సంకేతాలివ్వడానికి ప్రయత్నించినా వారి భేషరతుగా మద్దతు ఇవ్వడమే దేశం గుర్తించింది. దక్షిణాది సీట్ల తగ్గింపు, ఈ బిల్లు రెండు విషయాల్లో వ్యవహరించిన దాన్నిబట్టి టీడీపీ అధినేత చంద్రబాబు మోడీని ఏ మాత్రం వ్యతిరేకించరాదని నిర్ణయించుకున్నట్టు 'హిందూ' ప్రత్యేక వ్యాసమే ప్రచురించింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వుంది గనక బీజేపీ కన్నా దాన్నే ఎదుర్కోవటం కీలకమని భావిస్తున్న బీఆర్ఎస్ కూడా ఈ బిల్లు విషయంలో మాత్రం వ్యతిరేకించి ఓటేయడం మంచి విషయమే. ఇటీవల తిరుపతిలో జరిగిన పరి ణామాలు, ఇప్పుడు పాస్టర్ ప్రవీణ్ మరణంపై సాగుతున్న వివాదం విద్వేషపూరిత వ్యాఖ్యలన్నీ గమనిస్తే చాప కింద నీరులా తెలుగు రాష్ట్రాల్లోనూ మత రాజకీయాలు చొరబడుతున్న తీరు తీరు కళ్లకు కడుతుంది. ఇక్కడ బీజేపీ పెద్ద శక్తి కాకపోయినా వామపక్షాలు ఎక్కువ కేంద్రీకరిస్తున్నాయంటూ మాట్లాడే వాళ్లకు ఈ పరిణామాలే హెచ్చరికలవుతాయి. వక్ఫ్ బిల్లును గజెట్ అయ్యాక సుప్రీంకోర్టులో సవాలు చేస్తామంటున్న నేపథ్యం ఒకవైపుంటే, అటు నుంచి మతపరమైన స్పందనలు ఎలా ఉంటాయో కూడా చూడాల్సిందే.



పార్లమెంట్లో వక్ఫ్‌బిల్లు మీద జరిగిన హోరాహోరీ పోరాటం ఒక విషయాన్ని స్పష్టం చేసింది. రాజ్యాంగం 25 నుంచి 28 అధికరణాల వరకు మత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాథమిక హక్కులపై దాడిగా ప్రతిపక్షాలు ఈ బిల్లును ఎదుర్కొన్నాయి. అయితే హోంమంత్రి అమిత్ షా, బిల్లును ప్రతిపాదించిన న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాత్రం ఇదేదో పేద ముస్లింలకు మేలు చేయడానికి తెచ్చినట్టు గొప్పలు పోయారు కానీ వారి భాష, ఇచ్చిన ఉదాహరణలు చూస్తే రాజకీయ కోణం స్పష్టమవుతుంది. 'ఈ పార్లమెంటు భవనం కూడా వర్క్ వక్ఫ్ కిందకే వస్తుందని వారు వాదిస్తారని' రిజుజు ముస్లింలను ఉద్దేశించి అన్నారు. చర్చను కాంగ్రెస్ వైపు మళ్లించి 2014 ఎన్ని కలకు ముందు ఆ పార్టీ వేలాది ఆస్తులను కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురాభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ.

నాగపూర్ నాటకాలు

మోడీ పర్యటన విషయానికి వస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆరెస్సెస్ మూల స్తంభాలైన హెగ్డేవార్,గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి.ఆరెస్సెస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ 11 ఏళ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు అసలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘపరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆరెస్సెస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆరెస్సెస్ ముందు సమీక్షకు హాజరైంది.

గతేడాది అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ సంప్రోక్షణ కార్యక్రమానికి మోడీ తోపాటు ప్రస్తుత ఆరెస్సెస్ సద్నేత మోహన్ భగవత్ కూడా హాజరయ్యారని గుర్తుంచుకోవాలి.2024 ఎన్నికలకు ముందు దేశానికి హిందూత్వ సంకేతం ఇవ్వడం కోసమే వారి వారి కాంబినేషన్ అక్కడ అవసరమైంది. అయితే ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ 'గతంలో బీజేపీకి తగినంత బలంలేదు కనుక ఆరెస్సెస్ సహకారం తీసుకునేవారుమనీ, ఇప్పుడు సొంతశక్తితో ఎదిగాము కనుక ఆ అవసరం లేదని' వ్యాఖ్యానించారు. తాను ఏదో దైవకార్యం నిర్వహించడానికి పంపబడినట్టు అనిపిస్తుందని, సాధారణ జీవపదార్థంతో ఉన్నట్టు అనుకోనని చెప్పారు. ఈ రెండు ప్రకటనలు ఆరెస్సెస్ వారికి నచ్చలేదనీ కథనాలు నడిచాయి.మొన్నటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కోల్పోయి 243 స్థానాలకు పరిమితమైనాక మోహన్ భగవత్ ఇంటర్వ్యూ ఇస్తూ ఎవరికైనా అహంభావం తగదని వ్యాఖ్యానించారు. తాము సేవకులమనే భావన నుంచి దైవ స్వరూపులమని అహంకరించడం ప్రారంభించిన వ్పుడు దెబ్బతింటారని అన్నారు. మామూలుగానే ఆరెస్సెస్ అధినేత కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తమ కేంద్ర కార్యాలయం నుంచి సూక్తులు, సుశబ్దాలు వినిపిస్తుంటారు. ఇవి ఎవరిని ఉద్దేశించినవి అన్నది స్పష్టం చేయరు. భగవత్ మాటలు మోడీపై అభిశంసనలాంటివేనని బడా మీడియా కథనాలు మొదలు పెట్టింది. నిజంగా చెప్పాలంటే సనాతన సంప్రదాయంలోనూ రాజును దైవ ప్రతినిధిగా మొదట చెప్పి ,తర్వాత నేరుగా దేవుడు గానే అభివర్ణించడం చూస్తాం. ఇదంతా ఒక రాజ్యాధిపత్యం వ్యూహం ప్రకారమే జరిగింది. అటు రాజ్యం ఇటు మతం కూడా రాజు చేతుల్లోనే ఉండటానికి అది మార్గం. కాకపోతే మతాధిపతులు సంధాన కర్తలుగా రాజ్య వ్యవస్థకు అనుగుణంగానే తమ పాత్ర నిర్వహించేవారు. ఇప్పుడు ఇప్పుడు మోడీ భగవత్‌ల సంభాషణ అచ్చంగా అదే చెపుతుంది. సంబంధం ఉందని లేదని రకరకాలుగా చెప్పడం నిరంతర తతంగమే. ప్రస్తుత పర్యటనలో కూడా మోడీ ఆరెస్సెస్ తమను ఎంతగా ఉత్తేజపరిచిందో సూటిగా చెప్పారు. ఇది సంస్థతో రాజీ వంటిదని కొందరు ఇస్తున్న వివరణ అర్థం లేనిది. ఎందుకంటే అసలు అవి ఎప్పుడు దూరంగా ఉన్నాయి?ఒకప్పుడు వాజపేయినే ఈ మాట అన్నారు- మేము విడిపోయిందెప్పుడు అని. వారి మధ్య ఈ అలుక కినుక దూరం రాయబారం కథలన్నీ ఒక క్రీడలో భాగం. మొన్న మెజార్టి రాలేదుగనక మోడీని మార్చాలని ఆరెస్సెస్ భావిస్తున్నందునే ఆయన సర్దుబాటు కోసం వచ్చారని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అంటే నాలుగోసారి కూడా ఆయనే ప్రధాని అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించడం అందులో భాగమే. ఆరెస్సెస్ కార్యకలాపాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం కొంతకాలం కిందటే ఉత్తర్వులు జారీ చేసింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి దానిపై నిషేదం చెల్లదని ప్రకటించడాన్ని అవకాశంగా తీసుకుని మోడీ సర్కార్ దాన్ని ఎత్తివేసింది.ఇప్పుడు అధికారికంగానే ఆరెస్సెస్‌తో చట్టపటాలు వేసుకొని తిరిగే అవకాశం తనకు తానే ఇచ్చుకుంది.

మోడీ పర్యటన విషయానికొస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆరెస్సెస్ మూల స్తంభాలైన హెగ్డేవార్, గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి. ఆరెస్సెస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ పదకొండేండ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘపరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆరెస్సెస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతో సం బంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆరెస్సెస్ ముందు సమీక్షకు హాజరైంది.

వాటినీ రగిలిస్తాం!!

ఇక హోసబులే ప్రకటనను బట్టి సంఘపరివార్ కాశి మధుర వివాదాలను ఎగదోయాలని నిర్ణయించుకున్నట్టు చాలా స్పష్టంగా అర్థమవుతుంది.స్థానిక భక్తులు లేదా విభిన్న పక్షాలకు పరిమితమైన ఈ తగాదాలు ఇప్పుడు అధికారికంగా పాలక పరివార్ స్వీకరిస్తుందన్నమాట.గతంలో మోహన్ భగవత్ ప్రతి మసీదును తవ్వడం మన పని కాదని సూక్తులు చెప్పినప్పుడే ఆంతర్యం ఇదేనని మనం చెప్పుకున్నాం. అయోధ్య, కాశీ, మధుర మూడు చోట్ల వివాదాలపై ఉద్యమించాలని తాము గతంలోనే అధికారికంగా నిర్ణయించామని హోసబులే గుర్తు చేస్తున్నారు. ఈ మూడు మాకిస్తే మిగిలిన విభాగాలను పక్కన పెడతామని ఎల్ కె అద్వానీ ఒక దశలో ప్రతిపాదన పెట్టడం కూడా గుర్తు చేసుకోవాలి. 1991 ప్రార్థన స్థలాలు చట్టం ప్రకారం అయోధ్య మినహా మరి ఎక్కడ ఇలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదు. 1947 ఆగస్టు15న ఆయా ప్రార్థన స్థలాల్లో ఉన్న యధాతథ స్థితిని కొనసాగించవలసి ఉంటుందని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. అయినా సుప్రీంకోర్టు ఇలాంటి పిటిషన్లను విచారణకు స్వీకరించి వివాదాలకు అవకాశం ఇస్తుంది. ప్రతి చోటా తగాదాలు రగిలించబడతాయి. ఇదేదో జాతీయ సమస్య తప్ప దక్షిణాన అందులో తెలుగు రాష్ట్రాల్లో అసలు ఆ పరిస్థితి లేదని చెప్పడానికి ఇప్పుడు ఎవరు సాహసించ బోరు. ఎందుకంటే ఆలయాల వివాదాలు మతమార్పిడులు వీటిని కీలకంగా మాట్లాడే సనాతన వాద నేతగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చారు. తమిళనాడులో అన్నాడీఎంకే మళ్లీ బీజేపీతో చర్చలు ప్రారంభించడం పవన్ కళ్యాణ్ తమిళంలో మాట్లాడుతూ ఇంటర్వ్యూలిస్తూ అక్కడ కూడా రాజకీయంగా రంగ ప్రవేశం చేస్తుండడం విస్మరించలేము.మీ కన్నా మేమే సనాతన ధర్మానికి ఎక్కువగా కట్టుబడి ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూడా ఒక ప్రకటన చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సందేహాలు సంవాదాలను కేవలం వైసీపీ, టీడీపీ తగాదాగా, ఘర్షణగా చూపించే ప్రయత్నాలు కూడా తీవ్రంగా జరుగుతున్నాయి ఇక తెలంగాణలో రాజాసింగ్ వంటి వారు బీజేపీకి దూరంగా ఉన్నట్టు మాట్లాడుతూనే ప్రతి సందర్భంలో మతాలు మధ్య చిచ్చు రాజేస్తున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ వివాదాలకు పేరు మోశారు. వక్ఫ్‌నుంచి టీటీడీ వ్యవహారాల వరకూ ప్రతిదీ వివాదాస్పదమై మత రాజకీయాలను మన ముంగిట్లోకి తెచ్చి నిలబెడుతున్నదని గుర్తించటం, అప్రమత్తం కావడం తప్పనిసరి. ■

నేను అడవితల్లిని...



'ఇక్కడేదో అడవిలాగుందే, పోతూ పోతూ ఉంటే చెట్లు ఎక్కువవుతున్నాయి. ఎప్పుడూ చూడలేదే ఈ ప్రదేశం, చూద్దాం..లోపల ఏముందో..' అనుకుంటూ సాగుతున్నాడు కిషన్. 'అరే ఏదో జంతువుల శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి' అని చుట్టూతా చూశాడు. తన దోస్తులు యాద్‌గిరిని, దస్తగిరిని కూడా పిలుచుకొచ్చింటే ఇంకా బాగుండేది అనుకున్నాడు లోపల. పోనుపోను అందంగా కనిపిస్తోంది, భయమూ వేస్తోంది, అందుకే మిత్రులు గుర్తొచ్చినట్టున్నారు.

నిజంగా మస్తుగా ఉంది వాతావరణం, ఇంత ఎండకాలంలో కూడా చల్లగా ఉందిక్కడ అని పొరపాటున బయటికే అనేశాడు. ఇంతలో



జంధ్యాల రఘుబాబు
9849753298

"అవును" అన్న శబ్దం వినిపించింది. చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు.

"నేను అడవిని మాట్లాడుతున్నా" అంటూ మళ్లీ మాటలు.

"వామ్మో నేను నిజంగా అడవిలోకే వచ్చినట్టున్నానే" అన్నాడు.

"నిజమే నీవు అడవికే వచ్చావు మానవా" అని అడవి పలికింది.

"నీకు మాటలు కూడా వచ్చా"

"వినాలే కాని ఎన్నో మాట్లాడతాను మానవా"

"సరే కాని ఇంతకుముందెప్పుడూ నీ గొంతు వినపడలేదే, నాకేమైనా కల పడిందా అన్న అనుమానమొస్తోంది"

"కల కాదు కిషన్, నిజమే ఇది"

"నా పేరు....?"

"నీ పేరే కాదు ఈ భూమిపై ఉన్న అందరి పేర్లూ తెలుసు నాకు"

"ఐతే నా దోస్తుల పేర్లు చెప్పు?"

"యాద్‌గిరి, నర్సింగ్, దస్తగిరి, దామోదర్ ......" అలా ఎన్నో పేర్లు చెప్పింది అడవి

"వామ్మో నీవు మామూలు దానివి కాదు!"

"అదేమో కాని మీరు మామూలుకంటే కూడా ఇంకా దిగజారిపోయారు"

"మేమా"

"మీరు అంటే మానవులు అని అర్థం"

"బతికించావు, అందరిలోకీ నన్నుకూడా కలిపావనుకున్నాను"

"కలిపే చెబుతున్నాను"

"????"

"మంచివాళ్లయినా ప్రశ్నించకుంటే నేను చెప్పిన మానవుల్లోకి కలిపేస్తానంతే"

ఇంతలో అటుగా నెమళ్ళు, జింకలు దౌడ్ తీశాయి.

"ఇప్పుడైనా నమ్ముతవా, ఇది అడవి అని ఇంకా ఏమైనా సాక్ష్యం కావాలా?"

"అడవే, నేను ఒప్పుకుంటున్నాను కాని నాది ఒక అనుమానం"

"ఏమిటది"

"ఇన్ని అడవులు కొట్టేస్తున్నారే మానవులు, నీకు బాధగా లేదా"

"హ్హ .. హ్హ.. హ్హ" అంటూ నవ్వింది అడవి

"ఏమిటమ్మా అలా నవ్వుతున్నావు, బాధగా లేదా"

"బాధగా ఉండాల్సింది నాకు కాదు, మీకు కిషన్ మానవా. అడవులు నాశనమైతే జంతుజాలం తగ్గిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, అకాల వర్షాలు, ఎండాకాలంలో విపరీతమైన ఎండలు, వడగాడ్పులు, సునామీలు ఒకటేమిటి మీరు అడవులను నరికేసి సంపాదించుకున్న ఆస్తులన్నీ నాశనమైపోతాయి. నీకు అర్థమైందా ఇప్పుడు ఎవరు నవ్వాలో ఎవరు ఏడ్వాలో?"

"అవునమ్మో నీవు చెప్పింది అక్షరాలా నిజం"

"అసలు అడవిలో కోతినుండి మెల్లగా మైదానాలకు పోయి నా ముద్దు బిడ్డడు డార్విన్ చెప్పినట్టు మనుషులుగా మారారే, కన్నతల్లినే మరచిపోతారా, మానవత్వం లేని మనుషులే మిగిలారా"

"మేమేమీ మరవలేదమ్మా, నేనసలు జింకలు, నెమళ్లు కనిపిస్తున్నాయంటే అదేపనిగా వచ్చాను, పర్యావరణ ప్రేమికులు మా మానవుల్లో కూడా చాలామంది ఉన్నారు"

సురుకు

"సెహభాష్ కిషన్ మానవా, మీరైనా కష్టపడి ఈ భూమితల్లిని కాపాడుకొండి, అందుకు అడవులను కాపాడుకోవడం చాలా చాలా ముఖ్యం.

"దీన్ని కూడా రాజకీయం చేసి మావోళ్ళు తాము పండగ చేసుకుంటున్నారు అడవితల్లీ. తాము ఉన్నప్పుడు ప్రాజెక్టులకని, రోడ్లకని చెట్లు కొట్టేసినోళ్లే ఇప్పుడు పర్యావరణ సంరక్షకుల్లా మాట్లాడుతున్నారు"

"వాళ్ళు చేయాలనుకున్నది పర్యావరణ పరిరక్షణ కాదు, తమ రాజకీయ పరిరక్షణ అని నాకెప్పుడో అర్థమయింది. పర్యావరణానికై అరుంధతీరాయ్ లాంటి వాళ్ళ ఉద్యమాలు చేస్తూనే ఉన్నా సామాన్య ప్రజలు ఒక జట్టుగా దిగితే కాని నన్ను, పర్యావరణాన్ని రక్షించలేరు. గంగా నదిలో శవాల గురించి కాకుండా ఇతర విషయాలను దేశభక్తులు మాట్లాడుతున్నారు. నీకవన్నీ ఎరుకేకద కిషనా"

"అవునమ్మా. కెనడాలో ఒక్కో మనిషికి తెమ్మిదివేల చెట్లు, రష్యాలో నాలుగువేల ఐదువందలు, ఆస్ట్రేలియాలో మూడు వేలపైన, బ్రెజిల్లో ఒక వేయి ఐదువందలు, అమెరికాలో ఏడువందలపైన ఇలా ఉంది పరిస్థితి. మనదేశంలో మనిషికి ఇరవై ఎనిమిది చెట్లే ఉన్నాయమ్మా. ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, ప్రజలు అందరూ కదిలి చెట్లు పెంచితే మనం కెనెడాను కూడా దాటచ్చు అంత స్థలముంది"

"స్థలాల కోసం, రాష్ట్రాల్లో అధికారాల కోసం నిత్యం పోట్లాడుకునే మీనాయకులకు అంత తెలివి ఉందంటావా?"

"అవునమ్మా అనుమానమే!!??"

"పొలాల్లోకి ఏనుగులు రావడం మామూలే, ఈమధ్య ఇంట్లోకి, వీధుల్లోకి సింహాలు, పులులు కూడా వస్తున్నాయి. ఎందుకిదంతా. వాటికున్న అడవి వాటికుంటే అవెందుకొస్తాయి చెప్పు?"

"బాగా చెప్పావు అడవి తల్లీ, బుద్ధొచ్చింది"

"బుద్ధి రావలసింది అందరికీ, పాలకులతో సహా, వాళ్ళ ఏ పార్టీ వాళ్లయినా సరే"

"అవును అడవి తల్లీ, ఈమాట వంద శాతం నిజం"

"అసలు భూమంటూ ఒకటుంటే కద మనుషులుండేది. మనుషులుంటేనే కద ప్రభుత్వాలు ఉండేది. ఈ చెట్లు, తరువాత నీళ్ల భూమి మీద లేకుండా పోతే మనుషుల మనుగడే ప్రశ్నార్థకమై పోతుంది. అందుకే కళ్లు తెరవండి".

"బాధగా ఉండాల్సింది నాకు కాదు, మీకు కిషన్ మానవా. అడవులు నాశనమైతే జంతుజాలం తగ్గిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, అకాల వర్షాలు, ఎండాకాలంలో విపరీతమైన ఎండలు, వడగాడ్పులు, సునామీలు ఒకటేమిటి మీరు అడవులను నరికేసి సంపాదించుకున్న ఆస్తులన్నీ నాశనమైపోతాయి. నీకు అర్థమైందా ఇప్పుడు ఎవరు నవ్వాలో ఎవరు ఏడ్వాలో?"
"అవునమ్మో, నీవు చెప్పింది అక్షరాలా నిజం"

అక్బరుద్దీన్ చెప్పిన సత్యం!

హైదరాబాద్ అంటే ముందుగా గుర్చొచేది చార్మినార్. ఆ తర్వాత ఎన్నో చారిత్రాత్మక కట్టాలు. వీటితోపాటు హైటెక్‌సిటీ. వీటిని చేసేందుకు దేశ, విదేశాల నుంచి పర్యటక ప్రేమికులు వస్తుంటారు. పోతుంటారు. అటువంటి పర్యటకులకు హైదరాబాద్ అనగానే మరొకటి గుర్తొస్తుంటుంది. వామ్మో హైదరాబాద్ ట్రాఫిక్ అని గుండెలు బాదు కుంటారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఆయా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలకు నగరానికి వస్తున్న నేపథ్యంలో పట్టణీకరణ కూడా పెరుగుతున్నది. అందుకే ట్రాఫిక్ సమస్య పెను సవాల్‌గా మారింది. మొన్నటికి మొన్న పెద్ద వాన పడితే దాదాపు మూడున్నర గంటలపాటు ట్రాఫిక్ జామ్‌తో జనం అల్లాడిపోయారు.ఇలాంటి పరిస్థితిని రోజు గమనిస్తున్న ఎంఐఎం నేత, చంద్రాయన్‌గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఇటీవల అసెంబ్లీలో ఓ సత్యం చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం ఉందని ఘంటా పదంగా చెప్పుకొచ్చారు. ఎక్కడైతే ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారో అక్కడ ట్రాఫిక్ నియంత్రణ బాగా జరుగుతుందని చెప్పారు. ఎక్కడైతే సెల్‌ఫోన్లో నిమగ్నమై ఉంటున్నారో అక్కడ ప్రయాణికులు హద్దులు దాటు తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సీసీ కెమెరాలను నమ్ముకుని తమ డ్యూటీలను మరచిపోతున్నారు. సెల్‌ఫోన్లో వీడియోలు చూస్తూ...కూర్చొంటున్నారని హాట్ కామెంట్ చేశారు. ఎందుకంటే ప్రతి చౌరస్తా పోలీసుల కంట్రోల్‌లో ఉంటే అక్కడ ప్రమాదాలు తక్కువగా ఉన్నాయి. ట్రాఫిక్ జామ్‌లు కావు. స్పీడ్ రైడర్స్ కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటారు. ప్రతిఒక్క ప్రయాణికుడి మనోగతం కూడా అదే.

-గుడిగ రఘు

గోషామహల్ గోడు

బీజేపీలో గోషామహల్ గోడు వినిపిస్తున్నది. ఎక్కడ చెడితో తెలియదు కానీ ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రం 'తగ్గేదెలే లే' అన్నట్టు సొంత పార్టీ నేతలపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆ పార్టీ నేతలపై హాట్ కామెంట్లు చేస్తున్నారు. దీంతో ఆయనకు సొంత పార్టీలో దారులు మూసుకుపోతున్నాయనే చర్చ జరుగుతున్నది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజాసింగ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అయినా సరే బీజేపీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయడం లేదు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా నేనేందుకు పోతా అన్నట్టు ఆయన వ్యవహరిస్తున్నారు. అన్ని దారులను మూసివేస్తే ఆయనే ఏదో దారి వెత్కుకుని పోతారనే ఉద్దేశంతో పార్టీ నేతలు ఉన్నారు. కానీ ఆయన బయట ఉండి నేతల తీరును ఎండగడుతున్నారు. ఆ పార్టీలో ఎప్పటివరకు ఈ పరిస్థితులు ఉంటాయో తెలియదు. ఇంకా ఎన్నీ మాటలు వినాల్సి వస్తుందో తెలియదు. అయితే ఆయన రాజకీయ ప్రస్తానం టీడీపీలో మొదలైంది. టీడీపీ, బీజేపీ పార్టీల్లో ఆయన కార్పొరేటర్‌గా గెలిచారు. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన మనస్త త్వానికి అనుకూలంగాఉన్న బీజేపీలో ఆయనకు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి.ఆయన ఇతర పార్టీల్లోకి పోతారా? లేదా అనేది చూడాల్సిందే.

- ఎస్.వెంకన్న

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
ఆదివారం ఏప్రిల్ 06, 2025 www.navatelangana.com

నేడు ముత్తారంలో రాములోరి కళ్యాణం



నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ముత్తారంలో శ్రీరామనవమి పండగ వేడుకల్లో భాగంగా చిన్న భద్రాచలంగా పేరుగాంచిన ముత్తారం సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం సాయం సంధ్య వేళలో రాములోరి కళ్యాణం జరగనున్నది. అంగరంగ వైభవంగా జరిపేందుకు ఆలయ కమిటీ, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రాచలంలో ఉదయం సీతారామ కళ్యాణం జరగగా, ఇక్కడ మాత్రం సాయంత్రం వేళలో సీతారాముల కళ్యాణం జరగటం విశేషం. భద్రాచలంలో జరిగిన కళ్యాణం అక్షింతలను ముత్తారంనకు తీసుకొచ్చి సీతారామచంద్రస్వామి కళ్యాణం నిర్వహిస్తారు. ఈ కళ్యాణంను తిలకించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటారు.

పాలస్తీనాకు మద్దతుగా మధురైలో నిర్వహించిన
సంఘీభావ సదస్సులో పాల్గొన్న ఖమ్మం జిల్లా ప్రతినిధులు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



పాలస్తీనాకు మద్దతుగా మధురైలో సీపీఐ(ఎం) అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘీభావ సదస్సులో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం పాల్గొని పాలస్తీనాకు సంఘీభావం తెలిపారు. పాల్గొన్నవారిలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగరాజులు వున్నారు.

భూ మాఫియా ఆటలు సాగవు

- చట్టాన్ని గౌరవిస్తూనే రైతుల పక్షాన పోరాటం
- రైతులను మోసం చేస్తే అనుభవించక తప్పదు
- పుట్టకోట సభలో కూనంనేని

నవతెలంగాణ-ఖమ్మం

సాగు చేసుకునే రైతులకే భూమి దక్కాలని చారిత్రిక పోరాటం నిర్వహించిన ఖమ్మంజిల్లా గడ్డ మీద భూ మాఫియా ఆటలు సాగవని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన -సభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. విలువైన భూములు కాజేసేందుకు దొడ్డిదారి ప్రయత్నాలు చేస్తే తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న రైతులు సహించబోరని ఆయన తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని పుట్టకోటలో ల్యాండ్ మాఫియా సుపారీ గ్యాంగులతో భూ ఆక్రమణలకు పాల్పడడాన్ని నిరసిస్తూ శనివారం భూ కబ్జా వ్యతిరేక సభను సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ రైతాంగాన్ని భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా విలువైన భూములను ఆక్రమించాలని ప్రయత్నిస్తే సిపిఐ -సహించబోదన్నారు. తనతో కొంత మందితో కలిసి ఫోటో దిగి దానిని చూపి ప్రజలను వంచించాలని చూస్తున్నా మాఫియా పద్ధతి మార్చుకోకపోతే తగినవిధంగా సమాధానం చెప్పక తప్పదన్నారు. తెలంగాణ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ చేయించుకోరని ఒప్పంద పత్రాలు, గ్రామపెద్దల సమక్షంలో రాసుకుని -అనుభవదారు కాలంలో పేరు చేర్చుకుంటారని సాంబశివరావు తెలిపారు. దీనిని సాకుగా చూపి కొందరు మాఫియాలా తయారై రాష్ట్ర వ్యాప్తంగా సమస్యాత్మక భూములపై కన్ను వేసి ఆక్రమించుకుంటున్నారని ఆ క్రమంలోనే పుట్టకోటకు ఓ గ్యాంగ్ మాఫియా వచ్చిందని భూ ఆక్రమణలకు పాల్పడుతుందని కూనంనేని తెలిపారు. వెలుగుమట్ల రెవెన్యూలో ఎస్కె జానిమియా కుటుంబానికి చెందాల్సిన భూమి చెందే వరకు సిపిఐ అండగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

కబ్జాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) నిలబడుతుంది : సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు





చట్టం వేరు- న్యాయం వేరు : పొన్నం

భూ చట్టాల విషయంలో చట్టం వేరు, న్యాయం వేరని అనేక దశాబ్దాలుగా భూమిపై ఆధారపడి జీవిస్తున్న వారికి భూమి దక్కేలా న్యాయం ఉండాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు కోరారు. తెలంగాణలో పాసుపుస్తకం కోసం మాత్రమే ఇటీవల ప్రయత్నం చేస్తున్నారని ఎప్పుడు ఎవరు భూమి కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ ఆలోచనే ఉండేది కాదన్నారు. 13 ఏళ్ల భూమి సాగు చేసుకుంటే సాగు చేసిన వారికే భూమి దక్కుతుందని, చట్టంలో ఉందని కానీ మూడు తరాలుగా వెలుగుమట్ల రెవెన్యూలోని సర్వే నెంబరు 205లో సాగు చేసుకుంటున్న రైతులు వద్ద నుంచి భూమి ఎలా తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. పోరాటాల గడ్డ మీద కబ్జాలు చల్లవని కబ్జాలకు వ్యతిరేకంగా సిపిఎం నిలబడుతుందని పుట్టకోట రైతుల న్యాయమైన పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తుందన్నారు.

తెలంగాణలో జమీందార్లు, జాగీర్ దార్లు

దశాబ్దాలు గడిచిన తర్వాత ఇప్పుడు పచ్చటి పల్లెల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. రౌడీయిజంతో రైతులపై గెలిచిన దాఖలాలు చరిత్రలో ఎక్కడ లేవన్నారు. భూమి కోసం నిలబడ్డ రైతులకు మద్దతుగా నిలబడాల్సిన అవసరం, ఆవశ్యకత రైతులుగా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పుట్టకోట భూ వివాదంలో ఉన్న ల్యాండ్ మాఫియా జిల్లాలో పలు చోట్ల భూ ఆక్రమణలకు పాల్పడిందని దీనిపై న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. దున్నే వానికే భూమి దక్కాలని చారిత్రక పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ ఇప్పుడు, ఎప్పుడు రైతుల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేశారు.నిజాం కాలంలో భూ సర్వే జరిగిందని ఇప్పుడు సమగ్ర భూ సర్వే నిర్వహిస్తే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనుభవదారులకు హక్కు కల్పించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్ జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు పాల్గొన్నారు.



మనం ఆశించే మార్పు
మన ఇంటి నుంచే ప్రారంభించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

మనం ఆశించే మార్పు మన ఇంటి నుంచే ప్రారంభించాలనే సూక్తిని బాబు జగ్జీవన్ రామ్ పాటించారని, తన కుమార్తెను ఉన్నత విద్య చదివించారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహనీయుల జీవితాల నుంచి మనం స్ఫూర్తి పొందేందుకు జయంతి వేడుకలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. ప్రస్తుతం మనకు విద్య, ఇతర రంగాలలో అవకాశాలు లభిస్తున్నాయంటే దానికి గతంలో మన పూర్వీకులు చేసిన శ్రమ ఎంతో ఉందని అన్నారు. 80 సంవత్సరాల క్రితం మనకు విద్య అవసరం లేదు, పరిపాలన చేత కాదు వంటి కారణాలు చెబుతూ అనేక రకాలుగా విభజించేందుకు ప్రయత్నం చేశారని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వంటి అనేక మంది మహనీయులు, పెద్దలు బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, కుటుంబాల గురించి ఆలోచించకుండా దేశం బాగు కోసమే పని చేశారని అన్నారు. ఎటువంటి పరిస్థితులలో జన్మించినా విద్య ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చుని మహనీయులు నిరూపించారని కలెక్టర్ తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రిగా పేదల ఆకలి తీర్చేందుకు హరిత విప్లవం తీసుకుని వచ్చారని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ కుమార్తె లోకసభ స్పీకర్ గా ఉన్న సమయంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడం జరిగిందని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల చరిత్ర ప్రతి ఒక్కరికి తెలియజేయాలని, జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఉప ప్రధానిగా చేశారని, 29 సంవత్సరాల చిన్న వయస్సులోనే శాసన మండలికి ఎంపికయ్యారని, 1937లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారని తెలిపారు. 1946లో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలలో పని చేశారని తెలిపారు.

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమిటీ కన్వీనర్ జమళ్ళముడి దాస్ మహారాజ్ మాట్లాడుతూకార్మికులకు కార్మిక చట్టాలు రక్షణ కల్పిస్తున్నాయంటే దానికి కారణం బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోనీ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, ఈడి ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. కళావతి బాయి, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమిటీ అధ్యక్షులు కొర్లపాటి చిరంజీవి, గౌరవ అధ్యక్షులు ముదుసు జాకబ్ ప్రతాప్, ఇటికల లత, కో కన్వీనర్‌లు, గౌరవ సలహాదారులు, కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే..

- బీవీకే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజారోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని బోడేపూడి విజ్ఞాన కేంద్రం జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని మంచికంటి భవనంలో నెలనెలా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపుకు విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం పట్ల, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ, బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. సీపీఐ(ఎం) టూ టౌన్ కమిటీ, బోడెపుడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపులో, నెలకు సరిపడా మందులను కేవలం వంద రూపాయలకే అందిస్తున్నామని ఆయన వివరించారు. మే నెల మొదటి శనివారం(3వ తేదీ) మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) టూ టౌన్ కార్యదర్శి బి. సుదర్శన్, డాక్టర్ భారవి, గుడిపూడి రాజేష్, ఎం.సుబ్బారావు, డాక్టర్ రేష్మ దుర్గ, జట్ల రంగారావు, నాయకులు అబ్జల్, శివ నారాయణ, నర్రా రమేష్, పి.వాసు, గుమ్మడి బిక్షం, పగడాల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



బీవీకే వైద్య సేవలు అభినందనీయం

బోడేపూడి విజ్ఞాన కేంద్రం, సీపీఐ(ఎం) ఖమ్మం 2 టౌన్ కమిటీల ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి శనివారం షుగరు, బీపీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా సేవలందించటం చాలా అభినందించదగ్గ విషయమని క్లౌడ్ హాస్పిటల్ వైద్యులు ప్రదీప్ సాగర్, సిపిఎం జిల్లా నాయకులు సుబ్బారావులు పేర్కొన్నారు. శనివారం ఉదయం మంచికంటి మీటింగ్ హాల్ లో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌లో వారు మాట్లాడుతూ కరోనా వచ్చినప్పుడు కూడా ప్రత్యేక క్యాంప్ నిర్వహించి బాధితులకు సహాయం చేయడంతో పాటు ఖమ్మం పట్టణంలో ఆహారం సరఫరా చేశామని చెప్పారు. ప్రభుత్వాలు మరింత సహకారం అందించి పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. బివికే జనరల్ మేనేజర్ వై. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భారవి, జట్ల రంగారావు, రావెళ్ల రంజిత్, పిల్లలమర్రి సుబ్బారావు, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జి ఎస్కే అఫ్జల్ మియా, సీపీఐ(ఎం) 2 టౌన్ కార్యదర్శి బి.సుదర్శన్, సభ్యులు టి. శివన్నారాయణ, ఎన్.గోవిందరావు, జి.రామారావు, ఎస్.నాగేశ్వరరావు, కే. నాగేశ్వరరావు, వెంకన్న, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి

- తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వమే కొనాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్

నవతెలంగాణ-ఖమ్మం



గురువారం జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు చేతికొచ్చిన పంటలు నేలమట్టం అయ్యాయని, దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పర్యావరణంలో జరుగుతున్న మార్పుల వల్ల వర్షాకాలం, యాసంగి పంటలు అతివృష్టి, అనావృష్టి వల్ల దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టాలను చవి చూస్తున్నారని అన్నారు. అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వర్షానికి జిల్లాలో ఇప్పటికే కోతకు వచ్చి కళ్లాలలో నిలిచిపోయిన వరి, మిర్చి, మొక్క జొన్న పంటలు నీటి పాలు అయ్యాయని, రైతులు సర్వస్వం కోల్పోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. నష్టపోయిన పంటలకు మిర్చికి క్వింటాకు 25 వేలు, వరి, మొక్క జొన్నలకు క్వింటాకు 30 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చే నష్ట పరిహారం విషయంలో నిబంధనలను సడలించాలని అన్నారు.

ఘనంగా సెంచరీ స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని సెంచరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనితరుడుగా అనేక కావ్యకండాలు రచించిన మువ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి తల్లి తండ్రులు విశేషమైన కృషి చేయవలసిన అవశ్యకతను వివరించారు. ట్రస్మా అధ్యక్షులు గుర్రం కాంత రావు మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడంలో ప్రయివేట్ స్కూళ్ళు నిరంతరం శ్రమిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నాయని పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ సంచాలకులు కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్నా ఎస్సీ విద్యార్థుల ప్రతిభను నేను స్వయంగా వారు నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల నేరుగా వారి ప్రతిభను గుర్తించగలుగుతున్నాని తెలిపారు. డాక్టర్ మనోజ్, గౌతమ్ మాట్లాడుతూ.. మేము ఈ స్కూల్ లో చదవడం వలనే ఈ స్థాయికి రాగలిగామని మీరందరూ ముఖ్యంగా డిఏఎస్ ప్రభాకర్ రావు సలహాలు పాటించనట్టైతే మీ లక్ష్యాలను చేరుకుంటారని వివరించారు. డాక్టర్ గుమ్మడి రాఘవేంద్ర సాధారణ స్థాయి నుండి ఈ స్థాయికి చేరగలిగింది విద్యను గౌరవించి ఆచరించడమే ఏకైక మార్గమని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డి.ఏఎస్ ప్రభాకర్, డైరెక్టర్ వంశీ కృష్ణ, విజయలక్ష్మి, డాక్టర్ గౌతమ్ యలమూడి, డాక్టర్ మనోజ్ యలమూడి తదితరులు పాల్గొన్నారు.





బాబు జగజ్జీవన్ రామ్‌కు యూటీఎఫ్ నివాళి

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మాజీ ఉప ప్రధాని, మానవతావాది, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన చైతన్య మూర్తి బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఘన నివాళులు అర్పించింది. స్థానిక బైపాస్ రోడ్‌లోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. బాబు జగజ్జీవన్ రామ్ దళిత హక్కుల పోరాట యోధుడని, అంటరానితనాన్ని రూపుమాపడం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. జగజ్జీవన్ రామ్ నడిచిన బాట, అనుసరించిన ఆదర్శాలు స్ఫూర్తిగా తీసుకొని పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్. రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, జిల్లా నాయకులు డి.నాగేశ్వరరావు, జిడిఎస్వీ రమణ, శ్రీనివాసరావు, మంగీలాల్, రాంబాబు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, శ్రీనివాసరావు, గురవయ్య, రంగారావు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, వెంకట నరసయ్య, ప్రసాద్, రవి బాబు, జెట్టి రాంబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, గ్రామీణ వైద్యులు ప్రకాశరావు మృతి

నవతెలంగాణ-కొణిజర్ల



సీనియర్ కాంగ్రెస్ నేత, గ్రామీణ సీనియర్ వైద్యులు ముగిత్యాల ప్రకాశరావు(90) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మండలంలోని రత్నాపురం గ్రామానికి చెందిన ప్రకాశరావు కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కొనసాగుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలు పట్ల ఆకర్షితులై ఎన్ని ఆటుపోట్లు, పలు పార్టీలు ప్రలోభాలకు గురిచేసిన నమ్మిన సిద్ధాంతం కోసం తన చివర శాస వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. ఒకపక్క కాంగ్రెస్ పార్టీ కరుడుగట్టిన నిఖార్సయిన నాయకుడిగా కొనసాగుతూ మరోపక్క సీనియర్ గ్రామీణ వైద్యుడిగా వైద్య సేవలందిస్తూ మంచి వైద్యుడిగా ప్రకాశరావు గుర్తింపు పొందారు. ప్రకాశరావు మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అభిమానులు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రకాశరావు భౌతికకాయాన్ని సందర్శించి ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుప్రీంకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం

- హెచ్‌సీయు భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు
- ఇది యూనివర్శిటీ విద్యార్థుల విజయం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రయత్నంలో భాగంగా బుల్డోజర్లతో అక్కడి చెట్లను తొలగించి, భూమిని చదును చేసి, జంతువులకు తీవ్ర ఇబ్బంది కల్గించే చర్యలకు పాల్పడుతున్నది. దీన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై లాఠీఛార్జీ, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపింది. ఈ నేపథ్యంలో ఇట్టి భూమిలో చెట్ల తొలగింపు, చదును చేయడం వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ స్వాగతిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ విజయం హెచ్‌సీయూ విద్యార్థుల విజయమని అన్నారు. హెచ్‌సియు భూముల మీద రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ చేసిందని, సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో బేషరత్‌గా దానిని రద్దు చేసి హెచ్‌సియుకు భూములు వదిలేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ చేసి అమ్మడం ఆలోచన విరమించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంపైన రాజకీయ పార్టీలు, విద్యార్థులు జోక్యం చేసుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు స్టే ఇవ్వటం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి భేషజాలు పోకుండా హెచ్‌సియు భూములను వారికే ఇవ్వాలని కోరారు. ఈ స్టేను దృష్టిలో పెట్టుకుని ఈ భూములను వేలం వేసే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. ఇలాంటి చర్యలకు పూనుకుంటే భవిష్యత్‌లో రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారని తన ప్రకటనలో హెచ్చరించారు.



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, అర్చనా కుమారి హాజరై నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ... స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించినారని కోరారు. తన జీవితమంతా సమసమాజ స్థాపన కోసం కృషిచేసినారని, బాబూజీ స్ఫూర్తిగా మనందరం బడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చేద్దామని, జగ్జీవన్ రామ్ ఆశించిన సమాజాన్ని నిర్మిద్దామని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గద్దల్ దిలీప్ కుమార్, కార్యవర్గం సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణను వ్యతిరేకించండి

నవతెలంగాణ-ఖమ్మం

వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్.కే నాగుల్ మీరా అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, ఎంఏ ఖయ్యూం మాట్లాడుతూ పార్లమెంటు ఆమోదించిన చట్ట సవరణ బిల్లును దేశవ్యాప్తంగా ఉన్న సెక్యులర్ సంస్థలు, ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. ఈ చర్య ద్వారా విభేదాలు పెంచుతుందని దేశ సెక్యులర్ తత్వానికి చేటు చేస్తుందని వారు అన్నారు. ఇంతకు ముందు ఉన్న వక్ఫ్ చట్టం సక్రమ పరిపాలన, అక్రమల నుంచి రక్షణతో పాటు, ముస్లిం సమాజ ప్రయోజనాలను కాపాడిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం మంద బలంతో ఈ చట్టాన్ని పార్లమెంటు ద్వారా ముందుకు తీసుకెళుతుందని, తద్వారా రాజ్యాంగంలోని హామీలను అల్పసంఖ్యాక హక్కులను అడ్డుకుంటూ హిందుత్వ ఎజెండాను మరింత ప్రోత్సహించే లక్ష్యంగా పెట్టుకుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు భూక్య శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, వజినేపల్లి శ్రీనివాసరావు, నర్రా రమేష్, ఎర్ర రంజిత్, ఎస్.కే.ఇమామ్, కూరపాటి శ్రీనివాస్, ఎస్.కె బేగం, ఎస్.కే. బాబు, రజిత, ఎస్.కె సైదులు, ఎర్ర మల్లికార్జునరావు, దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.





కిష్టారం రామాలయ 60వ వార్షికోత్సవ వేడుకలు

- పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి దయానంద్
- ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాల స్వీకరణ

నవతెలంగాణ-సత్తుపల్లి



మండలంలోని కిష్టారం గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయ 60వ వార్షికోత్సవ వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మట్టా పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తాను చిన్నతనంలో కిష్టారం గ్రామంలోని అక్కయ్య ఇంట్లో ఉండే వాడినన్నారు. రామాలయం ప్రతిష్ట కార్యక్రమం కూడా గుర్తుందన్నారు. గ్రామంలోనే పదో తరగతి వరకు చదివానన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉడతనేని అప్పారావు, జేష్ట అప్పారావు, రావి నాగేశ్వరరావు, ములకలపాటి విష్ణువర్ధనరావు, కొలపనేని ధనుంజయరావు పాల్గొన్నారు.

కుప్పెనకుంటలో చోరీ

- రూ.10 లక్షల విలువ గల బంగారం అపహరణ

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని కుప్పెనకుంట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డ ఘటన జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన వేమిరెడ్డి నారాయణరెడ్డి ఇంట్లో పది లక్షల రూపాయలు విలువ చేసే బంగారాన్ని దొంగిలించారు. సమంత కుటుంబ సభ్యులు ఆరు బయట నిద్రించడం వల్ల వెనక నుండి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి, ఇంట్లో ఉన్న ఇనుప బీరువా పగలగొట్టి 12 తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. రెండు ఎకరాల భూమి కలిగిన నారాయణరెడ్డి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. కుమారుడు తిరువూరులోని ఆటోమొబైల్‌లో గుమస్తాగా పనిచేస్తున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న సొత్తు దొంగల పాలు కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

ఐఎంఏ సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో...
7న 'ప్రపంచ ఆరోగ్య' దినోత్సవ వేడుకలు

- పాత బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు 2కే-రన్

నవతెలంగాణ-సత్తుపల్లి

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న (సోమవారం) ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ సత్తుపల్లి శాఖ బాధ్యులు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు స్థానిక పాత బస్టాండు సెంటరు నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు 2కే-రన్ కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు. 2కే-రన్‌లో పాల్గొనే వారు తెలుపు టీ-షర్ట్‌ను తప్పని సరిగా ధరించాల్సి ఉంటుందన్నారు. రన్‌లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ వరుసగా నగదు పారితోషికం రూ. 1000, రూ.800, రూ.600 చొప్పున అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, విశిష్ట అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు సత్తుపల్లి (ఏసీపీ) అనిశెట్టి రఘు, మున్సిపల్ కమిషనర్ కోంద్ర నర్సింహ పాల్గొంటారని ఐఎంఏ బాధ్యులు తెలిపారు. పట్టణంలోని ఐఎంఏ సభ్యులందరు పైన తెలిపిన సమయానికి కల్లా చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఐఎంఏ సత్తుపల్లి శాఖ బాధ్యులు కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8333911345 ను సంప్రదించవచ్చని తెలిపారు.

'త్రివేణి'లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. శనివారం ఖమ్మంలోని సూర్య తేజ ప్రైమ్ హోటల్‌లో జరిగిన ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి మాధవరావు 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ప్రముఖ ప్రొఫెసర్ ఎస్ఆర్ ఎండ్ బిజిఎన్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వరరావు మాట్లాడుతూ చిన్నపిల్లల మనసు ఎంతో సున్నితమైందని ఆ మనసును కష్టపెట్టకుండా మానసిక ఒత్తిడికి దూరంగా ఆడుతూ పాడుతూ నేర్చుకునే లాగా ఒత్తిడి లేని విద్యను అందించాలని సూచించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్ ,క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'త్రివేణి'లో శ్రీరామనవమి ఉత్సవాలు

నవతెలంగాణ-ఖమ్మం

శ్రీరామనవమి సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో శ్రీరామనవమి వేడుకలను హాస్టల్ విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది అందరూ కలిసి విద్యార్థుల చేత శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూర్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు వడపప్పు పానకం పులిహోరలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరెలు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు



పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఎస్కే అబ్దుల్ లతిఫ్ రూ.35,000 విలువ గల చీరలను నిరుపేద ముస్లింలకు ఎస్ఐ హరిత, ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వేలు కృష్ణయ్య ఎస్ కె లతీఫ్, రిటైర్డ్ హెచ్ఎం కావేరి కృష్ణయ్య, విజ్ఞాన్ విద్యాలయం కరస్పాండెంట్ ఎస్కే.ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

- అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగించుకోవాలి
- బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించి, అభ్యర్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



పోటీ పరీక్షలలో అభ్యర్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధన దిశగా పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్, ఖమ్మం బైపాస్-రోడ్‌లోని జలగం వెంగళరావు తెలంగాణ బిసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. గ్రూప్ డి, న్యాయ విభాగం, జూనియర్ లెక్చరర్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు, ఐడీబిసి వంటి వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులతో జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలి, ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారు అడిగిన వాటర్ కూలర్స్, స్టడీ చైర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీ పరీక్షలకు సంబంధించి అప్ డేట్ అయిన పుస్తకాలను ఉంచాలని, అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభ్యర్థులతో సముహంగా కూర్చుని మాట్లాడుతూ మన జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేలా లక్ష్యాలను పెట్టుకోవాలని, దాని సాధనకు నిజాయితీగా శ్రమ చేయాలని అన్నారు. మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సాకులు వెతకకుండా ఉన్న సదుపాయాలను వినియోగించుకుంటే గొప్ప స్థాయికి ఎదిగేందుకు ఆస్కారం ఉందన్నారు. ఆలోచనతో పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ప్రతి ప్రయత్నంలో గొప్ప స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మన బాధ్యతలో అనేక ఇబ్బందులు, కష్టాలు వస్తాయని వాటిని తట్టుకుని మళ్ళీ నిలబడితే విజయం వరిస్తుందని తెలిపారు. సులభమైన జీవితం ఎవరికి ఉండదని, తేలికగా లభిస్తే దాని విలువ మనకు తెలియదని అన్నారు. సమాజంలో మనకు అనేక మంది స్ఫూర్తి ఇచ్చేవారు ఉన్నారని అన్నారు. తాను చేరుకోని ఉన్నత స్థితిని బిడ్డలు, తన సాధించాలనే కష్టపడి చదువిస్తున్న తల్లిదండ్రులు మనకు స్ఫూర్తిగా ఉంటారని ఉద్బోధించారు. చిన్నతనంలో తాను సాధారణ విద్యార్థి మాత్రమేనని, 10వ తరగతి నుంచి తండ్రి తీసుకున్న శ్రద్ధ కారణంగా బాగా చదివానని అన్నారు. డిగ్రీ తర్వాత జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని సివిల్స్ పాస్ అయ్యానని , మనకు ఉన్న సామర్థ్యంతో పాటు సరైన సమయంలో కష్టపడి పని చేయడం చాలా అవసరమని అన్నారు. మనం గొప్ప స్థాయికి ఎదిగిన తర్వాత సమాజంలోని పదిమందిని ఆదుకొని వారు కూడా ఉన్నతస్థాయికి చేరుకునేలా కృషి చేయాలని అన్నారు మనతో మనం పోటీపడుతూ మన ఉన్నతికి మనమే ముందుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'మరో లగచర్ల కాకుండా చూడండి'

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మరో లగచర కాకుండా పోలేపల్లి దళిత, బిసి రైతులను చూడాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పోలేపల్లి, గొల్లపాడు గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులను పరామర్శించేందుకు ప్రతినిధి బృందం పోలేపల్లి వచ్చిన సందర్భంగా పొలాలు సందర్శించింది. పోలేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నాగార్జునసాగర్ కాల్వ కింద మిగిలిన భూములలో గత 50 సంవత్సరాల కాలం నుండి పోలేపల్లి, గొల్లపాడు గ్రామానికి సంబంధించిన దళితులు, బీసీలు, చిన్న, సన్నకారు రైతులు ఆనాడు ఎన్ఎస్పీ కాలవకు మట్టి కొరకు భూములు ఇచ్చారని, తర్వాత ఆ భూములను ఆనాటి యజమానులుగా ఉన్న వారు పోలేపల్లి గొల్లపాడు గ్రామానికి సంబంధించిన వారికి విక్రయించారు. వారు 150 మందికి పైగా రైతులు 275 ఎకరాలలో వ్యవసాయం సాగు చేసుకుంటున్నారని, ఆ భూములను కరకట్ట క్రింద వివిధ గ్రామాలలో భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాలని చెప్పి ఇప్పటికే భూమి మీద ఉన్న రైతులను అక్కడ నుండి పంపి వేయాలని కుట్ర జరుగుతున్నారు. అందులో భాగంగానే గత నెల రోజుల నుండి సర్వే నిర్వహించి హద్దులు ఫైనల్ చేశారని, త్వరలో వీరందరినీ కూడా భూమి మీద నుండి పంపించి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అట్లాంటి ప్రయత్నాలను మానుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గ కొడంగల్‌లో లగ చర్లలో జరిగినటువంటి ఘటన మరువక ముందే పోలేపల్లి దళిత, బీసీ రైతులను అధికారులు ప్రేరేపిస్తున్నారని అన్నారు. ఇది విరమించుకోవాలని లేని పక్షంలో మొత్తం మండలంలో రైతాంగాలని వివిధ ప్రజా సంఘాలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎక్కడో భూములు నష్టపోయిన రైతులకు పోలేపల్లి, గొల్లపాడు రైతులు సేద్యం చేసుకుంటున్న భూమిని ఇవ్వమనటం చాలా దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, సీపీఐ(ఎం) పోలేపల్లి గ్రామ శాఖ కార్యదర్శి దండగల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్ది వెంకటరెడ్డి, గీత కార్మిక సంఘం సొసైటీ చైర్మెన్ కొండం కరుణాకర్, రైతులు గూడా రాంబ్రహ్మంగౌడ్, మాజీ సర్పంచ్ అక్కడిపల్లి వెంకన్న, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకన్న, దండగ నాగేశ్వరరావు, రాములు, కనకయ్య, లక్ష్మణ్, కృష్ణ, కోటయ్య, రాంబాబు, వెంకన్న, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, చామకూరి రత్నం తదితరులు పాల్గొన్నారు.

రూ.2500 మహిళలకు జమ ఎప్పుడు?



- ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలలో మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 మహిళలకు ఎప్పుడు అందచేస్తారని ఐద్వా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి బండి పద్మ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల అమలు తీరుపై మండలపరిధిలో మల్లన్నపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేయటంలో విఫలం చెందిందన్నారు. ఆచరణలో అమలకు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవాళ్లకు రేషన్ కార్డుతోపాటు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్స్ పెంచి ఇవ్వాలని బండి పద్మ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా ఉపాధి హామీతో పని లేకుండా వర్తింప చేయాలన్నారు. మహిళా సమస్యలపై ఐద్వా అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వము 6 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేసేంతవరకు, ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాలలో స్థానిక సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ప్రజా సంఘాలు పాటుపడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్న హామీలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమాల్లో మమేకం కావాలని బండి పద్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, ఐద్వా మధిర డివిజన్ కార్యదర్శి పయ్యావుల ప్రభావతి, మండల అధ్యక్ష కార్యదర్శి మందరపు పద్మ, కోలేటి అరుణ, సిఐటియు మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య, సిపిఐ(ఎం) గ్రామ శాఖ సభ్యులు తోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

నవతెలంగాణ-సత్తుపల్లి

భారత మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నకేశవరావు, మొహమ్మద్ కమల్‌పాషా, గొర్లమారి రామ్మోహనరెడ్డి, దొడ్డాకుల గోపాలరావు, పింగుల సామేలు, షరీఫుద్దీన్, రామారావు, వినుకొండ కృష్ణ, టోపీ శ్రీను, నాగళ్ల ప్రసాదరావు, కంభంపాటి కాంతారావు, జమలయ్య, ఆజ్మీర ప్రసాద్, సందీప్, నాగుల్‌మీరా, మాజీ కౌన్సిలరు కంటె నాగలక్ష్మి, కనపర్తి కుమారి పాల్గొన్నారు.

ఖమ్మం : గొప్ప సంఘసంస్కర్త, రాజకీయవేత్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి దుర్గాప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఐఎన్టీయుసీ అధ్యక్షులు కొత్తా సీతారాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కమిటి అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో..

నగరంలోని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఖమ్మం విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి.శ్రీనివాసా చారి అయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఈటి బాబు రావు, డిపిఈ విజిలెన్స్ డిఇ వెంకటేశ్వరరావు, ఎస్ఏఓ శ్రీధర్, ఏవో మురళి, ఖాదర్ బాబా, ఏడిఈ, సాంస్కృతిక కార్యదర్శి ఎం.ప్రసాద్, ఏఈ లు, నరేష్, జెఏవో సత్యనారాయణ, రమేష్, హెచ్‌సి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రవీందర్ రెడ్డి, సిఐలు స్వామి, రమేష్, ఆర్ఐ కామరాజు ,సెక్షన్ సూపరిండెట్ జానకి రామ్, ఐటి కోర్ టీమ్ ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌కళాశాలలో ....

పేదల పెన్నిధి, కుల రహిత సమాజం కోసం పాటు పడిన బడుగు బలహీన వర్గాల నేత , దేశ మాజీ ఉప ప్రధాని, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత డాక్టర్. బాబూజగ్జీవన్ రాం అని ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .మొహ్మద్ జాకిరుల్లా అన్నారు. శనివారం ఖమ్మంలోని ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల ఐక్యూఏసి-ఎన్.ఎస్.ఎస్.విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బాబూజీ 117వ జయంతిని నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్.శాస్త్రి, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ ఎం.సునంద, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమాసత్యవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం.పిచ్చయ్య, సుజిత్‌రెడ్డి, అధ్యాపకులు పి.నరసింహారావు, బంగారి, విద్యార్థులు పాల్గొన్నారు.

హార్వెస్ట్ పాఠశాలలో...

జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని హార్వెస్ట్ పాఠశాలలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో...

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని త్రివేణి పాఠశాలలో హాస్టల్ విద్యార్థులు సమక్షంలో వేడుకగా జరుపుకున్నారు. తొలుత జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి : మండలంలోని బోదులబండ గ్రామంలో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రావు జయంతి వేడుకలను కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు పగిడికత్తుల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు పొట్టపింజర స్టాలిన్, మండల నాయకులు పెదపాక భాస్కర్, కట్టెకోల వెంకన్న, రాజేష్, యేసు, ఆంజనేయులు, రాము, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి : మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడాల ఉపేందర్, గోపి జానకి రాములు, డివిజన్ నాయకులు ఉష్కల నాగరాజు, మునగాల నవీన్ ,రజక సంఘం నాయకులు కొక్కిరేణి వెంకన్న, పొట్ట పెంజర ప్రసాద్ ,గుంజులూరి ఉపేందర్, శ్రీను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధిర : మాన్యశ్రీ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మధిర ఎంపిడిఓ కార్యాలయం వద్ద బాపూజీ విగ్రహానికి టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగరాజు, ఈ.వీరయ్య, సీనియర్ నాయకులు తాళ్లూరి ఆంజనేయులు, మీరా ఖాన్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు ఎస్కే ఇబ్రహీం, మండల ట్రెజరర్ బి చెన్నయ్య, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ మల్ల రాజు, మండల కార్యదర్శులు ధనిశెట్టి భాస్కరరావు, ఊట్ల కొండలరావు, కంచిపోగు ఆదాము, బొబ్బిళ్ళపాటి రమేష్, టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల బాధ్యులు దొండపాటి రమేష్, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


బోనకల్ : డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త అని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కొనియాడారు. మండలంలోని రాయన్నపేట ఎస్సి కాలనీలో భారత తొలి దళిత ఉప ప్రధానమంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ఆనందరావు, తోటపల్లి తిరుపతిరావు, యంగల వెంకటి, కిన్నెర పాపారావు, తోటపల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ 117వ జయంతి వేడుకలు పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, డాక్టర్ బాబు జగ్జీవన్ రాయ్ చిత్రపటానికి కల్లూరు ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజాదేవి, పలువురు దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పసుమర్తి చందర్‌రావు, రిటైర్డ్ ఆర్‌సిఓ పుల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు లక్కనేని రఘు, మాజీ ఎంపీటీసీలు కొండూరి కిరణ్ కుమార్, ఖమ్మంపాటి పుల్లారావు, దామాల రాజు, పంచాయతీ మాజీ వార్డు సభ్యులు బొల్లం రామారావు, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాజీ సర్పంచ్ నందిగాం ప్రసాద్, దళిత సంఘాల నాయకులు పరిగడుపు రాము, సంగెపు రామకృష్ణ, వెంగళ వెంకటేశ్వర్ల బైర్లకాంతారావు, గుర్రాల సత్యానందం,తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, ఎర్రమల పూర్ణ చంద్రరెడ్డి, కడియం శ్రీనివాసరావు, పంబి సాంబశివరావు, షేక్ ఇస్మాయిల్, పసుపులేటి వెంకటనారాయణ, శీలం వెంకటరామిరెడ్డి,రాజీవ్ గాంధీ,బాబురావు, దేవరకొండ శ్రీను,నా గేశ్వరరావు, రవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి



ఎర్రుపాలెం

వైరాటౌన్ : మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బాబు జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, పాలేటి నరసింహారావు, మాజీ మున్సిపాలిటీ ఛైర్మెన్ సూతకాని జైపాల్, పొదిల హరినాథ్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, ధర్నా రాజశేఖర్, చప్పిడి వెంకటేశ్వరరావు, కన్నెగంటి నాగేశ్వరరావు, గుగులోతు రాము, కంభంపాటి సత్యనారాయణ, ఉబ్బనపల్లి నాగరాజు, మరికంటి గోపి, షేక్ పండు, గుడిపూడి రామకృష్ణ, మాడపాటి కిషోర్, బండారు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి : ఎమ్మార్పీఎస్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని సంఘసంస్కర్త స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కారేపల్లి సినిమా హాల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆదేర్ల అంజయ్య, మండల అధ్యక్షులు పాటమ్మ నాగేంద్రబాబు, గద్దర్ గాన కోకిల అవార్డు, మదర్ థెరిసా గోల్డ్ మెడలిస్ట్ అవార్డు గ్రహీత ఆదర్ల శంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేసగాని బాలకృష్ణ, ఆదేర్ల బాలకృష్ణ, ఎలగాడి ఉపేందర్ ఆదేర్ల సామ్యూల్, ఆదేర్ల నాగరాజు, మిట్టగనుపుల సాంబ, ఆదేర్ల వీరయ్య రాయల శ్రీనివ్వాస్, అదెర్ల వెంకటేష్, కొమ్ము జ్ఞానయ్య, మైనార్టీ సెల్ జిల్లా సెక్రెటరీ షేర్ భాష, కాకాటి వినీత్, దానబోయిన సమ్మయ్య, దామెర్ల నాగరాజు, గద్దల గణేష్, కొమ్ము ఉపేందర్ ఆదెర్ల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com

8న ఆయిల్ ఫెడ్ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా

- తెలంగాణ ఆయిల్ ఫాం రాష్ట్ర కన్వీనర్ పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 8వ తేదీ, మంగళవారం ఉదయం 11 గంటలకు అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం ఆయిల్ పామ్ డివిజనల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని సకల ఆయిల్ ఫాం సాగు దారులకు తెలంగాణ ఆయిల్ పామ్ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ధర్నా ఉద్దేశ్యాన్ని వరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారుగా 60 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తి అవుతున్న నేపధ్యంలో అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల పరిధిలోనే ముడి ఫాం ఆయిల్ శుద్ధి కర్మాగారం (రిఫైనరీ) ఏర్పాటు చేయడం, ఐఐఓపీఆర్ ఆధ్వర్యంలో పరిశోధన కేంద్రం ఏర్పాటు, ఆయిల్ పామ్ బోర్డు ఏర్పాటు, ఆఫ్ టైప్ మొక్కల బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించడం ప్రధాన సమస్యలు పరిష్కారించాలంటే ఆయిల్ ఫెడ్‌పై శాంతియుత పోరాటమే శరణ్యంగా భావించడంతో ఆ సంస్థ డివిజనల్ కార్యాలయం వద్ద జరుగనున్న ధర్నా చేపట్టడం జరుగుతుందని అయిన తెలిపారు. ఈ ధర్నా పోరాటానికి ముందడుగు మాత్రమేనని రీఫైనరీ ఏర్పాటు, పరిశోధనా కేంద్రం నిర్వహించే వరకూ సాగు దారులను సమీకరించి దఫదఫాలుగా పోరాట కార్యాచరణను రూపొందిస్తున్నామని అన్నారు.



నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం..!

హాజరుకానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

- శోభాయమానంగా ముస్తాబైన భద్రగిరి
- వేలాదిగా తరలివస్తున్న సందర్శకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ సీతారాముల తిరు కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఎదుర్కోలు ఉత్సవం గరుడసేవ ముగించుకున్న సీతారాములు కల్యాణానికి వధువు వరులుగా సిద్ధమయ్యారు. ఈ అద్భుతమైన ఆధ్యాత్మిక పరిణయ వేడుకను తిలకించేందుకు దేశ నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు భద్ర గిరికి తరలి వస్తుండగా ఆతిథ్యం ఇచ్చేందుకు భద్రాచలం అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు భక్తుల సేవలో తరిస్తున్నారు.



తెల్లవారుజామున రెండు గంటలకే పెళ్లి పనులు ప్రారంభం

తెలవజామున రెండు గంటలకే ఆలయ తలుపులను తెరిచి రెండు గంటల 30 నిమిషాల వరకు సుప్రభాత సేవను నిర్వహిస్తారు. అనంతరం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు ప్రధాన ఆలయంలోని మూలవరులకు అభిషేకం అనంతరం అలంకరణ చేస్తారు. ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు మూలమూర్తులకు తిరుకళ్యాణం ఏకాంతంగా కళ్యాణబ్రహ్మ అర్చక స్వాములు నిర్వహిస్తారు. అనంతరం కల్యాణ మహోత్సవ తంతులో భాగంగా 9 గంటల నుండి తొమ్మిది గంటల 30 నిమిషాల వరకు ఉత్సవమూర్తులకు అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తొమ్మిది గంటల నుండి 10 గంటల 30 నిమిషాల వరకు సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయం నుండి ఊరేగింపుగా మిథిలాపురి కల్యాణ మండపం వద్దకు మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో తీసుకోవస్తారు. 10:30 నుండి 12 గంటల 30 నిమిషాల వరకు సీతారాముల తిరు కల్యాణ మహోత్సవాన్ని వైష్ణవ సంప్రదాయంలో రామదాసు చేపించిన మంగళసూత్రాలతో రాష్ట్ర ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి సమర్పించిన పట్టు వస్త్రాలతో అభిజిత్తు లగ్నములో జిలకర బెల్లం పెట్టి 12:39 నిమిషాలకు మాంగల్య ధారణ కార్యక్రమాన్ని అశేష జనవాహిని సమక్షంలో అటాహసంగా నిర్వహించనున్నారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ మండపం నుండి ఆలయానికి తిరిగి తీసుకువెళ్లి ఆరాధన రాజభోగం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.

శ్రీరామ పునర్వసు దీక్ష

కల్యాణ మహోత్సవ అనంతరం శ్రీరామ భక్తులచే పునర్ సుదీక్ష ఆదరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహిస్తారు. స్వామివారి మాల ధారణ కార్యక్రమాన్ని చేపట్టిన భక్తులు తిరువీధి సేవలో పాల్గొనున్నారు.

1800 పోలీసులతో ప్రతిష్ట భద్రత

భద్రగిరి చరిత్రలోనే అతిపెద్ద ఉత్సవమైన సీతారాముల కల్యాణ మహోత్సవానికి 18,00 మందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నారు. ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులు న్యాయమూర్తులు ఇతర ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరవుతున్న నేపథ్యంలో పోలీస్ సీఆర్పీఎఫ్ భామ్ స్క్వాడ్ ఇతర విభాగాల సిబ్బంది శనివారం ఉదయం నుండి వారి వారికి కేటాయించిన ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రమ్ కుమార్ ఎప్పటికప్పుడు భద్రత ఏర్పాట్లు సమీక్షిస్తుండగా ఎస్పీతో పాటు ఎడిషనల్ ఎస్పీ ఒకరు, 16 మంది డీఎస్పీలు, 66 మంది సీఐలు, 185 మంది ఎస్సైలు, 304 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 555, సాధారణ కానిస్టేబుళ్లు, మహిళ పోలీస్ సిబ్బంది 208 మంది 404 మంది, హెూంగార్డులు విధులు నిర్వహిస్తుండగా ఆర్ 3 రిజర్వ్ సెక్షన్లు బాంబ్ డిస్పోజబుల్ బృందాలు 40 గంటల ముందు నుండే భద్రాచలంకి చేరుకొని నిరంతర తనిఖీలను నిర్వహిస్తూ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నేతృత్వంలో ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.



నేడే పర్ణశాల రాములోరి కల్యాణం

దుమ్ముగూడెం : భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాలలో నేడు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. శ్రీరామనవమి తిరు కళ్యాణ మహోత్సవంలో భాగంగా చాంద్రమాన విశ్వాసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి సందర్భంగా అభిజిత్ లగ్నమందు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వేడుకగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రాచలం తరహాలోనే పర్ణశాలలో కూడా శ్రీ సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. కళ్యాణాన్ని కనులారా వీక్షించేలా కళ్యాణ కట్ట వద్ద క్లాత్ పెండ్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

దీంతోపాటు ఎండ తీవ్రత దృశ్య కూలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్ తెలిపారు. దీంతోపాటు కళ్యాణ తలంబ్రాలను భక్తులకు అందజేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తుల స్వామివారిని దర్శించుకోవడం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం



శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య అన్నారు. శనివారం ఆయన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శించుకున్నారు. అనంతరం ఆయన కళ్యాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆలయ అధికారులు, తహసీల్దార్ ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి, సౌకర్యం విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పార్కింగ్ ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని, చలవ పందిల్లు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహించాలని అన్ని శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఆలయ ఏఈవో భవాని కృష్ణ ఇన్‌చార్జి అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సి సెల్ చైర్మెన్ చింతిరేలా రవికుమార్, దుమ్ముగూడెం, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినీల్, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, చర్ల మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాసరావు ఇందల బుచ్చిబాబు, శేషు, టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వినర్ కనుబుద్ది దేవా, మండల ఉపాధ్యక్షులు, స్వామి, హరికృష్ణ, మండల యూత్ అధ్యక్షులు సిద్ది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొనియాడారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పేదరికంలో జన్మించిన బాబూజీ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని ఆయన పేర్కొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్న బాబూజీ రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా సేవలందించారని, స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన బాబూజీ రెండు దఫాలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందించారని కలెక్టర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కరవు తాండవిస్తున్నప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతంలో కీలక పాత్ర పోషించారని, రైల్వే, జాతీయ రవాణా శాఖ మంత్రిగా బాబూజీ తనదైన ముద్ర వేశారని, అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారని, దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని కలెక్టర్ పేర్కొన్నారు. జగ్జీవన్ రావు జీవితాన్ని ప్రజలు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనప కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూర్య, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారి సంజీవరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రమాదేవి, వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా అధికారులు, అన్ని శాఖల సిబ్బంది, కాకెల్లి సైమస్, కమిటీ కన్వీనర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికులను 'ఆర్టీజన్' గా ఇవ్వాల్సిందే

- వనమా రాఘవ, కిలారు డిమాండ్

నవతెలంగాణ-పాల్వంచ



కొత్తగూడెం ధర్మల్ పవర్ స్టేషన్ ఆరవ దశ నిర్మాణ కార్మికులను ఆర్టిజెన్స్‌గా ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కిలారు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్లో 11 రోజులుగా నిర్మాణ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి, వారికి సంఘీభావం తెలిపి మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6వ దశ నిర్మాణ కార్మికులు చేస్తున్న ఆందోళనలో బీఆర్ఎస్ పార్టీ పాల్గొంటుందని, కేటీపీఎస్ సంస్థతో వనమా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం గతంలో ఎన్నో ఉద్యమాలు ఆందోళనలు చేశామని చెప్పారు. 2012-2013లో కేటీపీఎస్ నిర్మాణ కార్మికుల కోసం 4 రోజుల కేటీపీఎస్ 6వ దశ ముందు ఆమరణ నిరాహార దీక్ష చేశానని చెప్పారు. ఆనాడు నా నిరాహార దీక్షకు కెటిపిఎస్‌లోని యూనియన్‌లకు, అతీతంగా నాకు మద్దతు ఇవ్వడం చరిత్రలోనే ఒక కీలక సంఘటన అన్నారు. ఆనాడు నాకు మద్దతుగా కెటిపిఎస్ బంద్ విషయంలో అన్ని యూనియన్స్ నాకు మద్దతు ఇవ్వడం నేను ఎన్నటికీ మరువను అన్నారు. కార్మికుల కోసం వెనుకడుగు వేసేది లేదు చెప్పారు. హైదరాబాద్‌లో కేసీఆర్‌ను వనమా కలుస్తున్నారు. నిర్మాణ కార్మికుల సమస్యను ఆయనకు వివరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిలారి నాగేశ్వరరావు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు పూసల విశ్వనాథం, డిష్ నాయుడు, మల్లెల రవి చందర్, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాష్, భూక్య చందు నాయక్, సమ్మయ్య గౌడ్, పట్టణ అధ్యక్షులు దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ కంచర్ల రామారావు, బేతంచెట్టి విజయ్, తెలంగాణ కేటీపీఎస్ సురేష్, గురవయ్య, పునుగుల ఉదయ్, కుంపటి శివ, వెంకట్ నారాయణ, కాపు సంఘం ప్రెసిడెంట్ రంగయ్య, పత్తిపాటి శ్రీను, బొల్లేరిగూడెం కోదండరావు, డాక్టర్ మధు, తెలంగాణ నగర్ గిరి, జక్కుల వెంకటేశ్వర్లు, తెలంగాణ రవి, మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల, నవభారత్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వండి...సమస్యలు తీర్చండి

- నానాటికీ పేరుకుపోతున్న జీపీ సమస్యలు
- సీపీఐ(ఎం) మండల కమిటీ

నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలో ఉన్న 26 పంచాయతీలకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి నానాటికీ పేరుకుపోతున్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పూసగుప్ప, చెర్ల, కొత్తపల్లి, మొగలపల్లి గ్రామ పంచాయతీలలో పార్టీ మండల కమిటీ తిరిగి ఆయా పంచాయతీలలో ఉన్న సమస్యలను శనివారం వెలికి తీశారు. మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు పొడుపు కంటి సమ్మక్క, దొడ్డి హరినాగ వర్మ ఊడుగుల సారోనిలు ఆయా గ్రామ పంచాయతీలు సందర్శించారు. ముందుగా కొత్త పల్లి గ్రామంలో మంచి నీళ్ల, అంతర్గత రోడ్, డ్రైనేజీ, అనంధకాలనీ డ్రైనేజీ సమస్య, విజయకాలనీలో విద్యుత్ పోల్స్, అర్హత కలిగిన వారికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పూసుగుప్పలో జటిలంగా ఉన్న తాగునీటి సమస్య, పక్కనే తాలిపేరు నది ఉన్నప్పటికిని సాగునీరు లేక సేద్యం కష్టతరమవుతుందని, మండల కేంద్రంలో ఉన్న సాయి నగర్ ఆనుకొని నిర్మించిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. ఈ ప్రధానమైన సమస్యలు తక్షణమే చెపవట్టాలని అదే విధంగా వేసవి కాలం కాబట్టి ప్రతి గ్రామాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకొని తాగునీరు అందించాలని మండల కార్యదర్శి రామారావు కోరారు. సమస్యలు పరిస్కారం కానీ యడల దశలవారీగా పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆయా కార్యక్రమంలో మాలారం వరలక్ష్మి, రమేష్, రాంబాబు, వెంకటేశ్వర్లు, కూసుమంచి వెంకటేశ్వర్లు, గంగయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.







అర్చకుడి కుటుంబానికి రూ.30 వేలు అందజేత

- పలు కుటుంబాలను పరామర్శించిన పొదెం వీరయ్యకు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని లక్ష్మీనగరం అభయాంజనేయ స్వామి ఆలయంలో పురోహితుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుట్ల రాజగోపాల చారి కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడకు చెందిన పీవీ చారిటబుల్ ట్రస్ట్ వారు అందజేసిన రూ.30 వేలను బాధిత కుటుంబానికి ఆయన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఉప్పాడ నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నర్సాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూజారి సూర్యచంద్రరావు తండ్రి పూజారి వీరభద్రరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా నరసాపురం గ్రామం వెళ్లి వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పడిగపాటి వెంకటకృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరమాచినేని వినిల్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ చింతిర్యాల రవికుమార్, మండల ఉపాధ్యక్షులు తెల్లం హరికృష్ణ, నటరాజస్వామి, చర్ల మండలం మార్కెట్ కమిటీ చైర్మెన్ ఇర్ప శ్రీను, జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ కను బుద్ధి దేవ, కిసాన్ సెల్ నాయకులు ఇందల బుచ్చిబాబు, రాంబాబు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధి ప్రవీణ్, డింగి సందీప్ రెడ్డి,అరుణ్ రాజ్, వీరభద్ర రాజు, వరుణ్, సాంబశివరావు, కొర్సా జంపన్న, ఆకారపు శ్రీనివాసచారి, కాంగ్రెస్ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-చంద్రుగొండ

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మపేట మండలం, ముత్తాయిగూడెం గ్రామానికి చెందిన దారబోయిన హరిబాబు (26) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఏలూరు పట్టణానికి చెందిన తన సమీప బంధువు శెట్టిపల్లి నరసింహరావుతో కలిసి నరసింహరావు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సుజాతనగర్ నుండి తిప్పనపల్లి గ్రామం వద్ద జాతీయరహదారిపై చంద్రుగొండకు వెళ్తుండగా సత్తుపల్లి ఓపెన్కాస్టు నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్ అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దారబోయిన హరిబాబు అక్కడికక్కడే చనిపోగా, శెట్టిపల్లి నరసింహరావుకు తీవ్రగాయాలైనాయి. గాయాలైన నరసింహరావును కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్సను అందిస్తున్నారు. మృతుడు హరిబాబుకు భార్య జ్యోతి, పది నెలల కుమారుడు కలడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై పాపారావు సంఘటన స్థలాన్ని సందర్శించి, దర్యాప్తును చేపట్టారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రక్తం వరదలా కారడం, మృతుడి నాలుక తెగిపడి ఉండటం భయానక వాతావరణం నెలకొంది.

రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలి

- ఫ్లెక్సీల ఏర్పాటుకు కలెక్టర్ పర్మిషన్ ఎలా ఇచ్చారు
- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దక్షిణ భారత అయోధ్యగా పిలవబడుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా భద్రాచలం వస్తున్నారని, భద్రాచలం రాములవారి కళ్యాణ శోభను అలరించేలా ఊరంతా అలంకరణను తిలకించి పులకరించి పోతారని, కానీ నేడు భద్రాచలం పట్టణంలో భక్తుల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఎటు చూసినా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు వెలిశాయని, ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి కలెక్టర్, ఉన్నత అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ప్రజా సంఘాల ఐక్యవేదిక భద్రాచలం పట్టణ కమిటీ ప్రశ్నించింది.

గతంలో శ్రీరాముల వారి కళ్యాణానికి అనేకమంది ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ ఇంత పెద్ద ఎత్తున రాజకీయ ప్రచారం లేదని ఈ విధంగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు తమ స్వలాభం కోసం పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మిగతా రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు కూడా ఆ దారిలోనే వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది భద్రాచలం శ్రీరాముల వారి కళ్యాణ శోభను దెబ్బతీస్తుందని అన్నారు. తక్షణమే భద్రాచలం పట్టణంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేశారు.

జగమంతా మెచ్చిన జగదానందుడు మా రాముడు

అన్ని సుగుణాలు కలిగిన అతిలోకసుందరి మా సీతమ్మ

కన్నుల పండగల ఎదుర్కోలు ఉత్సవం

- సీతారాముల వంశ కీర్తి ప్రతిష్టలను ఉచ్చరించిన అర్చక స్వాములు
- ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- సీతారాముల పరిణయ వేడుకకు ముస్తాబైన మిథిలాపురి
- ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి
- పోలీసుల వలయంలో భద్రాచలం





నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జగమంతా మెచ్చిన ఆదర్శప్రాయుడు మా రామచంద్ర మూర్తి అని రాముడు తరపు పెద్ద మనుషులు పొగడగా జగత్‌లోనే అన్ని సుగుణాలు కలిగిన అతిలోకసుందరి మా సీతమ్మ.... అంటూ సీతమ్మ తరుపు పెద్ద మనుషులు ఉచ్చరించగా అధ్యంతం అద్భుతంగా కొనసాగింది భద్రాచలం శ్రీ సీతారాముల ఎదుర్కోలు ఉత్సవం. సీతారాముల కళ్యాణ మహెూత్సవ సందర్భంగా ఒక్కరోజు ముందు నిర్వహించే ఎదుర్కోలు ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలిరాగా ఆలయ అర్చక స్వాములు వేదమంత్రాలను ఉచ్చరిస్తూ సీతారాముల వంశీల కీర్తి ప్రతిష్టలను తెలియజేస్తూ ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. సీతారాములను సుందరంగా అలంకరించి మాడ వీధుల్లో గిరి ప్రదర్శన నిర్వహించి మిథిలా స్టేడీయానికి అతి సమీపంలో ఉత్తర ద్వారం ముందు శ్రీరాముడి తరపు పెద్దమనుషులు అర్చక స్వాములు ఒకవైపు సీతమ్మ తల్లి వైపు పెద్ద మనుషులు, అర్చక స్వాములు, మరోవైపు ఆసీనులై విరుపక్షాలు పోటాపోటీగా వారి వారి వంశ ప్రతిష్టలను కీర్తించడమే కాకుండా హాస్య భరితమైన చురకలను అంటిస్తూ ఒకరిపై ఒకరు పై చేయి సాధించేందుకు వారిలోని సుగుణాలను తెలియజేస్తూ ఆధ్యాత్మికంగా ఎదుర్కోలు ఉత్సాహంగ కొనసాగింది. సూర్య వంశానికి చెందిన రామచంద్ర మూర్తి బలబలాలతోపాటు వంశ కీర్తి ప్రతిష్టలను రామయ్య తరపు అర్చక స్వాములు కీర్తించగా అతిలోక సుందరి సీతమ్మ సుగుణాలను ఆమె తరపు అర్చక స్వాములు కీర్తిస్తూ కొనసాగించారు. సరదా సంభాషణలతో ఆధ్యాత్మిక చింతతో కొనసాగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరుకాగా గోటితో వలిచిన తలంబ్రాలను స్వామివారి కల్యాణానికి వినియోగించేందుకు భక్తులు సమర్పించుకున్నారు.

పరిణయ వేడుకకు ముస్తాబైన మిథిలాపురి

యావత్తు ధరణిపై జరిగే అత్యంత అద్భుతమైన పరిణయ వేడుకైన సీతారాముల కల్యాణ మహెూత్సవానికి మిథిలాపురి సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. భద్రగిరి అంతా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా స్వాగత ద్వారాలు చలవ పందిళ్ల ఏర్పాటు చేయగా ఆలయం ఆవంతం విద్యుత్ కాంతులతో దివ్యాంగమానంగా వెలుగుతుంది.

కళ్యాణ వేడుక జరిగే మిథిలా స్టేడియం చుట్టూ 26 సెక్టార్లను ఏర్పాటు చేయగా మొదటి రెండు సెటార్లు ప్రభుత్వ పెద్దలకు కేటాయించిన విషయం తెలిసిందే. మిగతా 24 సెక్టార్లలో సుమారు 16 వేల మంది ఆసీనులై స్వామి వారి కల్యాణ మహెూత్సవాన్ని తిలకించే అవకాశం ఉండగా చుట్టూ ఉన్న స్టేడియాలపైన మరో 15 వేల మందికి ప్రత్యక్షంగా సీతారాముల కల్యాణ మహెూత్సవం తిలకించే అవకాశాన్ని కల్పించారు. సెక్టార్లో ఇప్పటికే పూర్తిస్థాయి లో 16 వేల టికెట్లు అమ్ముడుపోగా స్టేడియాలపై ఉచిత దర్శన అవకాశాన్ని దేవాదాయ శాఖ వారు కల్పిస్తున్నారు. పరిణయ వేడుక జరిగే మిథిలా పూరి కళ్యాణ వేదిక అందమైన పూలతో అలంకరించి కళ్యాణ శోభ ఉట్టిపడేలా సిద్ధం చేసిన అధికారులు కల్యాణ మహెూత్సవాన్ని తిలకించే భక్తులకు చల్లని వాతావరణాన్ని కల్పించేందుకు పొగ మంచు యంత్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే దేశ నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు భద్రాచలానికి చేరుకొని మిథిలా స్టేడియం వద్ద సేద తీరుతున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నేడు జరిగే సీతారాముల కళ్యాణ మహెూత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. రామదాసు కాలం నుండి భద్రాచలం జరిగే సీతారాముల కల్యాణ మహెూత్సవానికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వయానా ముఖ్యమంత్రి తీసుకువచ్చే ఆచారాన్ని కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ వేడుకలలో పాల్గొంటుండగా గత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఈ సంప్రదాయాన్ని విస్మరిస్తూ గడిచిని 8 సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పాల్గొనని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ముఖ్యమంత్రి రానుండడంతో అధికారులు అందుకు దగ్గర ఏర్పాట్లు చేయడంతో పాటు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను నిర్వహిస్తు న్నారు. ముఖ్యమంత్రి తో పాటు క్యాబినెట్ మంత్రులు పదుల సంఖ్యలో ఉన్నత అధికారులు ప్రధాన న్యాయమూర్తులు ఎమ్మెల్యేలు ఎంపీలు పెద్ద సంఖ్యలో హాజరుకానుడంతో భద్రగిరి మొత్తం పోలీస్‌ల హయాంలోకి వెళ్ళింది. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రత్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ కళ్యాణ వేడుకలకు ఎటువంటి అవాంతరాలు కలగకుండా చర్యలు చేపట్టారు. సీతారాముల కళ్యాణం పట్టాభిషేక మహెూత్సవాల నిమిత్తం 18 వందల మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లను చేయగా వీరితోపాటు బాంబ్ స్క్వాడ్ ఇతర విభాగాల పోలీస్ సిబ్బంది కూడా విధుల్లో పాల్గొంటున్నారు.



సామాజిక వివక్షత, అసమానతలపై పోరాటం చేయాలి

- బీటీ రణదీవే వర్ధంతి సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-కొత్తగూడెం

సమాజంలో కులం, మతం, లింగభేదాల పేరుతో సాగుతున్న సామాజిక వివక్షత, అసమానతలపై కార్మికవర్గం, సీఐటీయూ కార్యకర్తలు పోరాటం చేయాలని రాష్ట్ర కార్సదర్శి బి.మధు పిలుపు నిచ్చారు. ఏఫ్రిల్ 6 నుండి 14వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, స్వాతంత్య పోరాట నాయకుడు అమరజీవి బిటి రణదీవె 35 వర్ధంతి సందర్భంగా సిఐటియు జిల్లా కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దేశంలో రాష్ట్రంలో దళితులు ఆదివాసీలు బలహీన వర్గాలు మహిళలు పిల్లలపై తీవ్రమైన హింస జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న ఈ హింస వెనక కులతత్వం మతోన్మాదం ప్రధానమైన అంశాలుగా ఉన్నాయని వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం సామాజిక చైతన్యం కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. బి.టి రణదీవే మాత్మ జ్యోతిరావు పూలే విమల రణదీవే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ వర్ధంతి సభ ప్రారంభానికి ముందు బిటి.ఆర్ చిత్రపటానికి సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ పూలమాలవేసి నివాళు లర్పించారు. సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్, సిఐటియు జిల్లా నాయకులు ఈసం వెంకటమ్మ, పిట్టల అర్జున్, గద్దల శ్రీను, దొడ్డా రవి, డి.వీరన్న, ఎస్ఏ. నబీ, కె.సత్య, డి.ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, తాళ్లూరు కృష్ణ, సుల్తానా, మొగిలి, హేమలత, గుర్రం రాములు, వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తితో కూడిన ఆహ్లాద భరితం 'గుబ్బల మంగమ్మ' ఆలయం ప్రాంగణం

- ఆలయంపై జాలువారే జలపాతం
- పర్యాటక కేంద్రంగా దినదినాభివృద్ధి
- పూజారులుగా గోగులపూడి కొండ రెడ్ల సేవలు
- ఐటీడీఏ ద్వారా గిరిజనులకు దుకాణాలు ఏర్పాటు



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా దట్టమైన అటవీ ప్రాంతంలో స్వయంభూ గా రూపొందిన గుబ్బల మంగమ్మ ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందింది. ఎటువంటి కట్టడం కాని ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఒక రాతిపై నుండి జాలువారే జలపాతం ఆధారంగా ఏర్పడినదే ఈ ఆలయం. దీంతో ఇది భక్తులకు, సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పక్షుల కిలకిలా రావాలు, కీటకాల కిచకిచ ధ్వనులు, ప్రకృతి సోయగాల మధ్య ఈ పచ్చని వాతావరణం భక్తులను పారవశ్యంతో పాటు ఆహ్లాదానిస్తుంది. అమ్మవారి సేవలో కొండ రెడ్ల గిరిజనులు పూజలు చేయటం మే కాకుండా భక్తులకు సేవలు అందిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా స్వయంభువుగా వెలిసిన గూబ్బల మంగమ్మ తల్లి ఆలయం పర్యాటక కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీసుకుంటారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలాల సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో గుబ్బుల మంగమ్మ తల్లి శతాబ్దాల క్రితం స్వయంభువుగా వెలిసి భక్తులకు దర్శనమిస్తుంది. నిత్యం దర్శనమిచ్చే అమ్మవారికి ప్రతి ఆదివారం, బుధవారం రోజు భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తారు.

ఆకర్షణీయంగా ప్రకృతి అందాలు :

దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బుల మంగమ్మ ఆలయం అంతా ప్రకృతి అందాలతో భక్తులను ఆకర్షిస్తుంది. ఆలయంలోకి ప్రవేశించేందుకు సుమారు 5 కిలో మీటర్ల ముందే అటవీ మార్గం ప్రారంభమవుతోంది. పచ్చని ప్రకృతి అందాలు భక్తులకు స్వాగతం పలుకుతాయి. మట్టి రోడ్డు గుండా ఆలయం వద్దకు భక్తులు చేరుకుంటారు. భారీ వృక్షాలు, పక్షుల కిలకిలలు, పెద్ద పెద్ద రాళ్లు, ఎత్తైన కొండలు, కాలిబాట పక్కనే పారే వాగు, ప్రశాంతమైన వాతావరణం భక్తులను కనువిందు చేస్తాయి. వేసవి కాలంతో పాటు ఏడాది పొడవునా ఆలయంపై జాలువారే జలపాతం భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. ఆలయంపై పారే జలపాతం ఎక్కడ నుండి వస్తుందో నేటికీ అంతుపట్టని రహస్యంగానే ఉంది.

రాష్ట్ర విభజనతో ఆంధ్రాకు

గుబ్బుల మంగమ్మ తల్లి ఆలయం రాష్ట్ర విభజనకు ముందు పూర్తిగా తెలంగాణ ప్రాంతం అశ్వారావుపేట మండలానికి చెందిన గిరిజనుల ఆదీనంలో భక్తులకు పూజలు అందేవి. 2014 తర్వాత రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వివాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం దేవాదాయ శాఖ ఆలయాన్ని స్వాదీనం చేసుకుంది. సరిహద్దు వివాదం తీవ్ర స్థాయికి చేరటంతో భద్రాచలం ఐటీడీఏ, ఏలూరు జిల్లా ఐటీడీఏ అధికారులు సమాలోచనలు తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించబడింది. అప్పటి నుండి జంగా రెడ్డిగూడెం దేవాదాయ శాఖ ఆలయ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది.

కొండరెడ్లే పూజారులు

గుబ్బుల మంగమ్మ ఆలయ సమీపంలోని గోగులపూడి గ్రామానికి చెందిన కొండ రెడ్లే పూజారులు. అమ్మవారికి సేవలు అందిస్తున్నారు. వారి ఆధీనంలోనే భక్తులకు పూజలు అందుతాయి. అమ్మవారి ఆలయాన్ని ఎండోమెంట్ శాఖ స్వాదీనం చేసుకుంది. కొండ రెడ్లకు దేవాదాయ శాఖ వేతనాలు చెల్లిస్తుంది. వీరు భక్తులకు నిత్యం అందుబాటులో ఉంటారు.

ఐటీడీఏ ద్వారా గిరిజనులకు దుకాణాలు ఏర్పాటు

దట్టమైన అటవీ ప్రాంతంలో ఆలయం ఉండటం వల్ల గిరిజనులే పర్యవేక్షించారు. పలు విజ్ఞప్తుల అనంతరం ఐటీడీఏ అధికారులు అటవీ శాఖతో సమన్వయం చేసుకొని గిరిజనులకు ఉపాధి కల్పించే విధంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు, సరుకులు అందుబాటులోకి వచ్చాయి. దుకాణాలు ఏర్పాటుతో గిరిజనులకు ఆర్థిక భరోసా కలిగింది. కొన్ని దుకాణాలను భద్రాచలం ఐటీడీఏ ఏర్పాటు చేయగా మరికొన్ని దుకాణాలను కన్నాపురం ఐటీడీఏ అధికారులు ఆ ప్రాంత గిరిజనుల కోసం నిర్మించింది. దీనితో ఇరు ప్రాంతాల గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభించాయి.

పర్యటక కేంద్రంగా అభివృద్ధి

తెలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న గుబ్బుల మంగమ్మ తల్లి ఆలయం పర్యటక కేంద్రంగానూ దినదినాభివృద్ధి చెందుతుంది. ఈ ఆలయం పచ్చని ప్రకృతి అందాలతో భక్తులకు దర్శనమిస్తుంది. పర్యటన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ అధికారులు అటవీ శాఖ సహకారం కూడా తీసుకోవాలి.



అకాల వర్షానికి నీళ్ల పాలైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి జిల్లాలో మొక్కజొన్న, వరి, మిర్చి పంట రైతులను ఎంత నష్టం జరిగిందో పరిశీలించి సత్వరమే రైతులను ఆదుకోవాలని, పరిహారాన్ని వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రకటన విడుదల చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి ఎండనక, వాన అనక కష్టపడి పండించి, చేతికి వచ్చిన పంట చేజారిందని బాధల్లో ఉన్న రైతులకు, తీవ్ర నష్టం వల్ల మనస్థాపానికి గురై అనేక సమస్యలకు లోనవుతున్న రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే నష్టపరిహారాన్ని ఎంతవరకు నష్టం జరిగిందో అంచనావేయాలని, నష్టపరిహారం వెంటనే ప్రభుత్వం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులు సమయానికి కరెంటు లేకపోయినా అందుబాటులో రైతులకు బోరు ద్వారా నీరు అందకపోయినా కష్టపడి పంటలను పండించి వారి కుటుంబంతో పాటు ప్రజలకు కూడా పంటలను అందించే విధంగా కృషి చేస్తున్న రైతులకు ప్రభుత్వం ఆసరాగా నిలబడాలన్నారు. పంట నష్టపరిహారం చెల్లించే విధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పంట నష్టం అంత వాటిలిందో పార్టీ ఆధ్వర్యంలో నాయకులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని ఆయన అన్నారు. జిల్లాలో నష్టపోయిన పంటలకు ప్రత్యక్షంగా పర్యటనలు చేసి, పరిశీలించి, నష్ట పరిహారం చెల్లించే విధంగా కలెక్టర్ చొరవ తీసుకొని రైతులతో మాట్లాడి పంట నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.

రామాలయానికి శంకు చక్రం బహూకరణ



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

శ్రీరామ నవమి సందర్భంగా మండల పరిధిలోని రాజపురం గ్రామంలో గల రామాలయానికి ఆలయ చైర్మెన్ చిలుకూరు ఉపేందర్ రెడ్డి, సరోజిని దంపతులు రూ.18 వేలు విలువ గల శంకు చక్రాన్ని ఆలయ అర్చకులు ముదువర్తి వెంకట నరసింహా చార్యలు సమక్షంలో ఆలయానికి బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ మాట్లాడుతూ రామాలయ అభివృద్ధి కోసం గతంలో ఎన్నో వస్తువులను బహూరించడం జరిగిందని ఇప్పుడు గ్రామంలో శ్రీరామ నవమి జరుగుతున్న సందర్భంగా ఊరేగింపు చేసేటప్పుడు కావాలసిన ఇత్తడి శంకు, చక్రం బహుకరించడం చాల సంతోషంగా వుందని అన్నారు.ఆలయ చైర్మన్ గా ఉంటూ ప్రతి సంవత్సరం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు రామాలయానికి ఏదో ఒక రూపంలో ఆర్థిక సహాయం చేస్తున్నారని, గ్రామ ప్రజలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

వీకే-7 ఓసీ, సత్తుపల్లి ఓసీ-3 బ్లాకులను సింగరేణికే కేటాయించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-కొత్తగూడెం

వికే-7, కోయగూడం ఓసి-3 బ్లాకులను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నడిపించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న బ్లాకులను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వకూడదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీవాస్ అధ్యక్షన శనివారం ఉదయం పివికే గని పిట్ మీటింగ్‌లో నరసింహారావు సింగరేణి సంస్థకు కొత్త బ్లాకులు కేటాయిస్తేనే సంస్థ మనుగడ కోనసాగుతదన్నారు. సత్తుపల్లి ఓసి-3 ప్రాజెక్టును టెండర్లలో అవంతిక అనే ప్రైవేటు వారికి పోయిన విషయం విధితమే. దానిని వారు చేపట్టడానికి ఉన్న ఆటంకం, తీసిన ఓబీని పోయటానికి స్థలం లేదు.చుట్టూ సింగరేణి స్థలం మాత్రమే ఉన్నది. ఆ స్థలాన్ని కాజేయటానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. కాబట్టి సింగరేణి స్థలం ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు వారికి ఇవ్వకుండా ఉంటే ఆ బ్లాకు మనకే వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో సింగరేణి స్థలాన్ని ప్రైవేటు వారికి అప్పగించవద్దు అని కోరారు. జెన్కో ట్రాన్స్‌కో వారు బకాయి పడ్డ రూ.35 వేల కోట్లు రాబట్టి సింగరేణి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి వెంటనే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి రమేష్ బాబు, బ్రాంచి నాయకులు నాజర్, పి.వి.లక్ష్మీనారాయణ, బి.మధు, బాలాజీ, హరీష్ పాల్గొన్నారు.



సాంకేతిక నైపుణ్యతపై వెదురు వృత్తి కళాకారులకు శిక్షణ

నవతెలంగాణ-చంద్రుగొండ

కళాకారులకు సాంకేతిక నైపుణ్యతపై శిక్షణ అవసరం ఉందని అయోగ్ సమస్త డైరెక్టర్ దేవి ప్రసాద్ అన్నారు. శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచన మేరకు నీతి అయోగ్ సంస్థ, న్యూ ఢిల్లీ నుండి డా.దేవి ప్రసాద్, చంద్రుగొండ మండలం బెండాలపాడు బ్యాంబో క్లస్టర్‌కు వచ్చి సందర్శించారు. బ్యాంబో క్లస్టర్‌లో గల యంత్రాలను వాటితో తయారు చేసిన కొన్ని వెదురు ప్రొడక్ట్సను సందర్శించి బ్యాంబో క్లస్టర్ సభ్యులను మెచ్చుకొని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరువాత బ్యాంబో క్లస్టర్ సభ్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రొడక్ట్స్ ఫినిషింగ్ వర్క్ పొందవలసి ఉంది అన్నారు. వెదురు ప్రొడక్ట్స్ మార్కెటింగ్ తప్పని సరి ఉండాలన్నారు. వారితో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి విద్యా చందన పాల్గొని క్లస్టర్ ప్రక్కన ఉన్న వెదురు నర్సరీను సందర్శించారు. క్లస్టర్ అభివృద్ధిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, జిల్లా అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, బెండాలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి రోహిత్, బ్యాంబో క్లస్టర్ చైర్మెన్ వీసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, వర్స శ్రీను, మల్లం వెంకటేష్, పద్దం రమేష్, రవి, సైదులు, మల్లయ్య, పోడియం నర్సింహారావు, శ్రీను, రామన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జారే



నవతెలంగాణ-దమ్మపేట

రోడ్డుప్రమాదంలో కాలు కోల్పోయిన బాధితునికి శాసనసభ్యులు జారే ఆదినారాయణ కృత్రిమ కాలు ఏర్పాటు చేసి శనివారం అందజేశారు. మండల పరిధిలోని చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన జోనుబోయిన మల్లయ్య రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయి నడవలేని స్థితిలో ఉన్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. దీంతో జర్మన్ టెక్నాలజీతో నడవడానికి అనుకూలంగా ఉండే కృత్రిమ కాలు ఏర్పాటు చేసి స్వయంగా బాధితునికి ఎమ్మెల్యే ధరింపజేశారు. అనంతరం అదే గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో మరణించిన తాళ్ళ వెంకటస్వామి దశదిన కార్యక్రమంలో జారె పాల్గొని వెంకటస్వామి చిత్రానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ రెమినేషన్ అమౌంట్ పెంచాలి

- టిజిజెఎల్ఏబి 475 అసోసియేషన్ వినతి

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ, స్పాట్ విధులు నిర్వహిస్తున్న అధికారులు, అధ్యాపకులు, ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్ పెంచాలని ఇంటర్ విద్యా కార్యదర్శికి ఆన్‌లైన్‌లో వినతి పత్రం పంపించినట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వి. శ్రీనివాస్, డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 19 ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అయితే గత మూడు సంవత్సరాల నుంచి ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు స్పాట్ రెమ్యునరేషన్ పెంచలేదని, ప్రస్తుతం చెల్లిస్తున్న స్పాట్ రెమ్యునరేషన్ మూడు సంవత్సరాలు కితం నిర్ణయం జరిగిందని, ప్రస్తుతం వాటిని చెల్లిస్తున్నారని, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెమ్యునరేషన్ పెంచే ఆనవాయితీ ఇంటర్ బోర్డు కొనసాగిస్తుందని తెలుపుతూ పెరిగిన రవాణా, ఇతర ఖర్చులను పరిశీలించి రెమ్యునరేషన్ పెంచవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రెమ్యునరేషన్ ఎటువంటి తగ్గింపు లేకుండా పూర్తి రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ముస్తాబైన ఆలయాలు

నవతెలంగాణ-కారేపల్లి

దేవుడి పెళ్లికి కారేపల్లి మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రతి గ్రామంలో సీతారాముల స్వాముల కళ్యాణాన్ని నిర్వహించడానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. మండలంలో ఎర్రబోడు మాణిక్యారం గ్రామాలలో గ్రామస్తులు దేవుడి పెండ్లిని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఎర్రబోడులోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని గ్రామస్తులు ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేశారు ఆలయ అభివృద్ధికి అనేకమంది ఎన్నారైలు వివిధ ప్రాంతాలకు చెందిన వారు నవ్వుతూ వస్తురూపమైన విరాళాలు అందజేశారు.

శ్రీవారికి వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం సేవ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన జమలాపురం దివ్య క్షేత్రం నందు శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారుజాము నుండి ప్రాత:కాల అర్చనలు అనుష్టానములు, నవగ్రహ హోమము నిర్వహించారు. అనంతరం వేడుకగా శ్రీ పద్మావతి అలి వేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విశేషముగా 11 వివిధ రకాల పుష్పాలతో వేద మంత్రోచ్చారణతో పుష్పయాగం సేవా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములను స్వీకరించినారు. శనివారం కావడంతో ఆల యానికి భక్తులు అధికంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు కె.విజయ కుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు మురళి మోహన్ శర్మ అర్చకులు రాజీవ్ శర్మ, ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



దేశంలో ఎక్కడలేని విధంగా సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ-కూసుమంచి

ప్రతి ఒక్కరి కడుపు నింపాలనే లక్ష్యంగా దేశంలోనే ఎక్కడ లేని విధంగా ప్రజా పంపిణీలో గోప్ప పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని జుజ్జులరావుపేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా కనతల ఉమ 18 కేజీలు సన్న బియ్యం పోందారు. ఈ సందర్భంగా కనతల ఉమ తమ ఇంట్లో సన్న బియ్యంతో వంట చేయగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ స్వయంగా భోజనం చేశారు. అనంతరం రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సందర్భంగా కనతల ఉమ వారి కుటుంబానికి ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న ధాన్యానికి రూపాయలు 500 బోనస్, ఉచిత సన్న బియ్యం, 500 రూపాయలకే గ్యాస్ ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేశారు.



ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-బోనకల్

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మండల అధికారులు శనివారం ఘనంగా నిర్వహించారు. బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, బోనకల్ గ్రామపంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ పేద ప్రజల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, బోనకల్ మాజీ సర్పంచ్ భూక్య సైదా నాయక్, కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్, గిర్ధవర్ - 1 మఠం నవీన్ కుమార్, బీజేపీ నాయకులు గుగులోత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, గిర్ధవర్ -1 మఠం నవీన్ కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రురావత్ రమాదేవి ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి సూపరిండెండెంట్ మిట్టపల్లి రవికుమార్, యుడిసి దన్నారపు శైలజ, టైపిస్టు అయిల సత్యనారాయణ చారి నివాళులర్పించారు.

జగ్జీవన్ రామ్‌కు ఎమ్మెల్యే తెల్లం నివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భారత స్వాతంత్ర్య సమరయోధుడు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం స్థానిక అంబేద్కర్ సెంటర్లో తెలంగాణ మాదిగ దండోరా దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై ముందుగా అంబేద్కర్ విగ్రహానికి తరువాత బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం నాయకులు వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురిజాల వెంకటేశ్వర్లు, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా దేవదానం, ఉపాధ్యక్షులు సున్నం రమేష్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆర్ నారాయణరావు, ఈటె రాజేశ్వరరావు, టిఎన్ జీవో మాజీ అధ్యక్షులు చల్లగుండ్ల నాగేశ్వరరావు, సీనియర్ దళిత నాయకులు అరికెళ్ల తిరుపతిరావు, చాట్ల రవికుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు లక్కావత్ వెంకటేశ్వర్లు, రత్నం రమాకాంత్, పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకై ఉద్యమిద్దాం

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం బై పాస్ రోడ్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పూల మాలను వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకై ఉద్యమిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్, సంఘం జిల్లా నాయకులు బొట్ల సాగర్, నకరికంటి చిరంజీవి, కర్లకుంట నరేష్, చెరుకుపల్లి వీరభద్రం జర్రిపోతుల కిరణ్, గుమ్మడి నర్సయ్య, ఎస్కె సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

ముఖ్యమంత్రి ఆమోదం

- మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్‌గా అప్ గ్రేడ్
- అభివృద్ధి దిశగా భద్రాద్రి జిల్లా
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి
- జిల్లాకు మహర్దశ
- దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం
- జాతీయస్థాయిలో కొత్తగూడానికి ఖ్యాతి
- సీఎం రేవంత్‌కు తుమ్మల ధన్యవాదాలు

నవతెలంగాణ-పాల్వంచ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటనతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు శ్రమ ఫలించింది. అన్ని సహజ వనరులు మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు అందచేసిన విషయం తెలిసిందే. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించి యూనివర్సిటీని మంజూరు చేస్తూ ప్రకటన జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెం జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి జిల్లాకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పవచ్చు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాదిమందికి విద్య ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్తుకు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషిస్తాయి. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది.

ఫలించిన మంత్రి తుమ్మల కృషి...

భద్రాద్రి కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్గ్రేడ్ చేసి ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా మార్చాలని పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి వినతి పత్రాలు లేఖలు అందించి తన పంతం నెగ్గించుకున్నారు. జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేలా, దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తన అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని ప్రతి అంశాన్ని ప్రతి పనిలో సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భద్రాద్రికి మహర్దశ... యువతకు ఉద్యోగం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మహర్దశ పట్టనుంది. మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మార్చి మంజూరు చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వేలాదిమంది విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రస్థాయిలో ప్రవేశాలు కల్పించే అరుదైన అవకాశం లభించనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నలుమూలల నుంచి విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు లభించాయి.

ప్రత్యేక వనరులు... దేశ స్థాయిలో ఖ్యాతి...

భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విద్యాలయానికి దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించనుంది. ఇక్కడ బొగ్గుతోపాటు అన్ని ఖనిజాలు (సహజ వనరుల) ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఖనిజనిధిగా జిల్లాకు పేరుంది. ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అన్ని అనుకూల వసతులు ఉన్నాయి. నేషనల్ హైవేకి సమీపంలో 300 ఎకరాల్లో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. విశ్వవిద్యాలయానికి సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నావా లిమిటెడ్, ఫెరో ఎల్లాయి, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. విద్యుత్ ప్లాంట్లు కూడా మరో 300 మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్నాయి. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ కల నెరవేరనుంది. రోడ్డు, రైలు రవాణా మార్గాలు ఈ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండవు. అన్ని అవకాశాలు ఉన్న దృష్ట్యా ఇక్కడ ఎర్త్ సైన్సెస్ విద్యాలయం ఏర్పాటుకు అనుకూల అంశాలుగా ప్రభుత్వం గుర్తించింది.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఇల్లందు : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమయిందని సీపీఐ(ఎం) మండల నాయకులు మన్యం మోహన్ రావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేలో భాగంగా దేవులపల్లి యాకయ్య నగర్‌లో సర్వే నిర్వహించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాలకులు, అధికారులు స్పందించక పోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రములో సంతోష, వీరభద్రం, నీలరాని,వెంకన్న హుస్సేన్, హేమలి, పంజా పద్మ, హుస్సేని పాల్గొన్నారు.

బెయిల్ కోసం ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నిందితులు అరెస్ట్

సీఐ బాలకృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం

కీలకమైన జంట హత్య కేసులోని నిందితులకు బెయిల్ షూరిటీల కోసం ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూ టౌన్ సిఐ బాలకృష్ణ తెలిపారు. నేలకొండపల్లి మండలంలో గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన వృద్ధ దంపతుల హత్యల కేసులో అరెస్ట్ అయి జైల్లో ఉన్న నిందితులకు బెయిల్ ఇప్పించేందుకు నేరపూరిత కుట్రలో భాగంగా ఉప్పలచలక పంచాయతీ సెక్రటరీకి సంబంధించిన సంతకాన్ని అలాగే పంచాయతీ కార్యాలయం ముద్రను ఫోర్జరీ చేశారు. నకిలీ ఆస్తి వాల్యుయేషన్ ఫోర్జరీ షూరిటీలను తయారు చేసి కోర్టుకు సమర్పించి తద్వారా న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించారని తెలిపారు. జైల్లో ఉన్న నిందితులతో పాటు బానోత్ భరత్ (వ్యవసాయం), నూనవత్ రవి (వ్యవసాయం), షేక్ లతీఫ్ (న్యాయవాది), పోట్లపల్లి సురేష్ (స్టాంపుల తయారీ)లను ఉప్పలచలక పంచాయతీ సెక్రటరీ వంకుడోత్ రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందుతులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

క్రమశిక్షణకు మారు పేరు గ్లోబల్ రెయిన్ బో స్కూల్

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాంలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి
- విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి
- వార్షికోత్సవ సభలో డాక్టర్ కూరపాటి ప్రదీప్

నవతెలంగాణ-కూసుమంచి



క్రమశిక్షణకు మారు పేరు గ్లోబల్ రెయిన్ బో పాఠశాల అని, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో గల గ్లోబల్ రెయిన్ బో పాఠశాల గ్లోబల్ ఉత్సవ్ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆనాడు వీధి దీపాల క్రింద కూర్చుని చదివి భారత రాజ్యాంగ నిర్మాత అయినారని, వీధిదీపాల క్రింద కూర్చుని చదివే స్థితి నుంచి వెలుతురుని పంచే ఎల్ఈడి కాంతిలో మన పిల్లలు చదువుకుంటూ ఉన్న పరిస్థితిని, మనం చూస్తున్నాం అని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను, సైకిల్ పై పేపర్ వేసిన దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని విద్యలో ముందుకు సాగాలని డాక్టర్ కూరపాటి ప్రదీప్ ఉద్ఘాటించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలలో విద్యార్థులు భాగస్వామ్యం అయినపుడే శరీర సౌస్టవంతో పాటు ఆరోగ్యానికి ఈ క్రీడలు ఎంతో దోహద పడతాయని ఆయన అన్నారు. క్రీడాకారులు ఎక్కడా కూడా ఆత్మహత్యలకు పాల్పడిన దాఖలాలు లేవని, విద్యతో పాటు స్పోర్ట్స్ తప్పనిసరి అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి తమ సంతకమే సెలబ్రిటీ ఆటోగ్రాఫ్ గా మారాలని ఆ దిశగా నేటి విద్యార్థులు రేపటి భావిభారత ప్రయోజకులుగా తీర్చిదిద్దబడాలని అన్నారు. పాఠశాల యజమాని ముస్లిం అని, తన తన ప్రియ మిత్రుడు జర్నలిస్ట్ ఖదీర్ కూడా ముస్లిమేనని, కుల మతాలకు అతీతంగా ఈ సమాజంలో మెలిగిప్పుడే ఆరోగ్యకరమైన సమాజం డెవలప్ అవుతుందని ఆయన అభివర్ణించారు.



ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అధ్యాపకులకు ఆయా విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు చేసిన చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. తొలుత ఎల్ కేజీ, యూకేజీ, ఫస్ట్, సెకండ్ క్లాస్ చిన్నారుల నృత్యాలు ఆద్యాంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం ఇర్షాద్ ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవ సభలో జిల్లా ట్రెస్మా అధ్యక్షులు జి.కాంతారావు, ట్రెస్మా రాష్ట్ర నాయకులు కే.శశిధర్ రెడ్డి, రామచంద్రయ్య, జిల్లా కోశాధికారి నాసరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పాలేరు డివిజన్ ప్రెసిడెంట్ బి.శివకృష్ణ, పాలేరు డివిజన్ సెక్రటరీ బి.శ్రీనివాస్, ఖమ్మం నగర కార్యదర్శి శ్రీకాంత్, నగర కోశాధికారి సూరిబాబు, జేవిఆర్ కాలేజీ ఫౌండర్ ప్రెసిడెంట్ రమేశ్‌లతో పాటు గ్లోబల్ రెయిన్ బో స్కూల్స్ ఇంచార్జ్ జాహ్నవి, పాపారావు, నరేంద్ర వర్మ, అకాడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ ఖదీర్‌లకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు దువ్వా సాగర్, మాధవ్ చౌదరి, జానీ పాషా, యాకేష్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులు, పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యం

- ఉచిత పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు

కార్మికులు, పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యమయిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) మండల స్థాయి వర్క్ షాప్ పిట్టల నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ప్రజా సమస్యలు కార్మిక కర్షక సమస్యలు పరిష్కరించడంలో పూర్తి వైఫల్యం చెందిందని అన్నారు. ఆరు పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాలం గడుపుతుందన్నారు. గ్రామాలలో సమస్యలు పేరుకుపోయి ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకై సీపీఐ(ఎం) కార్యకర్తలు గ్రామంలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నా ఆభూత కల్పితాలను ప్రజలకు తెలియపరచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సత్ర పల్లి సాంబశివరావు, సీపీఐ(ఎం) సీరియల్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మడి నరసింహారావు, పార్టీ మండల కమిటీ సభ్యులు తోట పద్మ, కొండ్రు గౌరీ, ఎ.సుధాకర్, ములకల ఉత్తం, గుండి భీమయ్య, శాఖ కార్యదర్శులు కోటయ్య, గుండి రమేష్, తాటి నరసింహారావు, సంకిని వెంకట్రావు, కొరివి బసవయ్య, విల్సన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన' కుటుంబాలతో కలిసి... సన్నబియ్యం భోజనాన్ని తిన్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-సత్తుపల్లి



మండలంలోని రుద్రాక్షపల్లి పంచాయతీ సత్యంపేటలో గిరిజన కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ దంపతులు ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని ఆరగించారు. గ్రామంలోని గిరిజన కుటుంబానికి చెందిన బండారి వెంకటేష్ గృహంలో ఎమ్మెల్యే దంపతులు సన్నబియ్యం భోజనాన్ని అక్కడి గిరిజనులతో కలిసి తిన్న ఎమ్మెల్యే దంపతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ మీతో కలిసి భోజనం చేయడం ఎప్పటికి మదిలో గుర్తుండి పోతుందన్నారు. సన్నబియ్యం అందించి పేదల మోముల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతోషాన్ని నింపారన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ మేం పుట్టి బుద్దెరిగాక మా కోయజాతి ఇళ్లకు వచ్చి రేషన్ బియ్యంతో అన్నం తిన్న వారిని ఎరుగమన్నారు. మాతో కలిసి భోజనం చేయడాన్ని జీవితంలో మర్చిపోలేమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అందించిన బియ్యం వండుకొని తినడమనేది ఆ దేవుడికే ఎరుకన్నారు. ఆ బియ్యాన్ని అటు నుంచి అటే అమ్ముకొనే వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందించి మా కుటుంబాల్లో సంతోషం నింపిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్సీహెచ్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మొహమ్మద్ కమల్‌పాషా, బత్తుల భరత్‌కుమార్, ఒగ్గు భూపతిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి పాల్గొన్నారు.

నేడు హజరత్ నాగుల్ మీరా మౌలా చాంద్ దర్గా షరీఫ్‌లో శ్రీ సీతారాముల కల్యాణం

- దర్గాలో గోటి తలంబ్రాల సమర్పన

నవతెలంగాణ-ఇల్లందు

మంలంలోని సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్ మీరా మౌలాచాన్ దర్గాలో ఆదివారం శ్రీ సీతారామ కళ్యాణం జరగనుంది. ఈ మహోత్సవానికి సత్యనారాయణ పురంలో గల దమ్మక్క వారసులచే గోటి తలంబ్రాలు ఊరేగింపుగా బయలుదేరి దర్గా లో ఉన్నటువంటి రాములవారికి సమర్పించారు.

మతసామరస్యానికి ప్రతీక....

హజరత్ నాగుల్ మీరా మౌలా చాంద్ దర్గా షరీఫ్‌లో నేడు శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. శ్రీరామ నవమి, శ్రీ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం కార్యక్రమానికి కులమతాల కతీతంగా ప్రజలంతా హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. 6వ తేదీన శ్రీ సీతారాముల కళ్యాణం, 7వ తేదీన అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిశేకం, అనంతరం ప్రముఖ నృత్య కళాకారులచే కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నారు.

విభిన్న రంగాల్లో విద్యార్థులు రాణించాలి

- 15వ గిరిజన బెటాలియన్ కమాండెంట్ పెద్దబాబు
- 110మంది విద్యార్థులకు ఛాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం

నవతెలంగాణ-సత్తుపల్లి



విద్యార్థి దశలోనే చదువుతో పాటు విభిన్న రంగాల్లో విద్యార్థులు రాణించడానికి పాఠశాలలు పునాది వేయాలని సత్తుపల్లి మండలం గంగారం 15వ గిరిజన బెటాలియన్ కమాండెంట్ పెద్దబాబు అన్నారు. స్థానిక విశ్వశాంతి విద్యాలయానికి చెందిన 110 మంది విద్యార్థులు 'డు సంథింగ్ గ్రేట్' పేరిట ప్రదర్శించిన అంశాలను గుర్తించిన ఛాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ప్రతిభ పత్రాలు అందాయి. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యే కార్యక్రమంలో కమాండెంట్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆయా ప్రతిభా పత్రాలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చదువుతో పాటు వేమన శతక పద్యాలు, భగవద్గీత, చేతిరాత, ప్రముఖ దినాలు తదితరాంశాలను విద్యార్థులకు నేర్పించడం అభినందనీయమన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ రంగారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యక్ష దైవాలన్నారు. పిల్లల ముందు గురువులను కించపర్చడం తల్లిదండ్రులు మానుకోవాలన్నారు. విశ్వశాంతి ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో బెటాలియన్ రిజర్వడ్ ఇన్స్పెక్టర్ సాయాబాబా, పాఠశాల యాజమాన్య బాధ్యులు నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవచిత్రం



ఘనంగా 'మ్యాడ్ స్క్వేర్' విజయోత్సవ వేడుక

"నవ్వించడం అనేది చాలా గొప్ప వరం. మనకు ఎన్నో బాధలున్నా, ఎన్ని కష్టాలున్నా ఒక మనిషి వచ్చి మనల్ని నవ్వించగలిగితే ఈ కష్టాల నుంచి బయటకు వెళ్ళిపోదాం కదా అనే ఆలోచన మన అందరికీ ఉంటుంది. అలా నవ్వించగలిగిన మనిషి చాలా అరుదుగా దొరుకుతారు. అలాంటి అరుదైన దర్శకుడు కళ్యాణ్ శంకర్ మనకు దొరికాడు. 'మ్యాడ్ 2'తో ఇంతటి భారీ విజయాన్ని అందుకున్న కళ్యాణ్‌కి కంగ్రాచ్యులేషన్స్. ఒక చిత్రాన్ని హిట్ చేసిన తర్వాత సీక్వెల్‌గా అంతకంటే గొప్పగా ప్రేక్షకులను రంజింపజేయడం చాలా కష్టం. కానీ కళ్యాణ్ అది సాధించగలిగాడు' అని హీరో ఎన్టీఆర్ అన్నారు.

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా ఇటీవల విడుదలై భారీ వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో శిల్పకళా వేదికలో విజయోత్సవ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హీరో ఎన్టీఆర్, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎన్టీఆర్ మాట్లాడుతూ, "అత్తారింటికి దారేది'లో ఒక డైలాగ్ ఉంటుంది. మీ వెనకాల కనబడని ఒక శక్తి ఉంది అని, వీళ్ళందరి వెనుక ఆ కనబడని శక్తే మా నాగవంశీ. సినిమా అంటే చాలా ప్యాషన్ తనకి. మాట కఠినంగా ఉంటుంది కానీ, మనసు చాలా మంచిది. ఆ మంచితనమే తనని కాపాడుతుంది. వంశీతో త్వరలో ఒక సినిమా చేయబోతున్నాను. మా చినబాబు చిన్నితల్లి హారిక నిర్మాతగా మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'రేయి లోలోతుల సితార..'



రష్మిక మందన్న

హీరో దీక్షిత్ శెట్టి, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా దీన్ని నిర్మిస్తున్నాయి. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. శనివారం రష్మిక మందన్న బర్త్ డే సందర్భంగా ఈ సినిమా నుంచి విషెస్ చెబుతూ కొత్త పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల' రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రష్మిక వారియర్ లుక్‌లో గన్, కత్తితో పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. 'రేయి లోలోతుల' పాటను మ్యూజిక్ డైరెక్టర్ 'హేషమ్ అబ్దుల్ వాహబ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, రాకేందు మౌళి క్యాచీ లిరిక్స్ అందించారు. విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీపాద ఆకట్టుకునేలా పాడారు. ఈ పాటలో వచ్చే పోయెమ్‌ను డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ రాశారు. 'రేయి లోలోతుల సితార, జాబిలి జాతర, కన్నులలో వెన్నెలలే కురిసే, మదిమోసే తలవాకిట తడిసే, యెద జారెనే మనసు ఊగెనే, చెలి చెంతలో జగమాగెనే, యెద జారెనే మనసా..' అంటూ మంచి లవ్‌ఫీల్‌తో సాగుతుందీ పాట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది అని చిత్ర బృందం తెలిపింది.



'ప్రియమార..' సందడి మొదలైంది



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'.

ఈ సినిమా నెల 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. దీనికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా శనివారం మేకర్స్ 'ప్రియమార..' అంటూ సాగే సాంగ్ రిలీజ్ చేశారు. రథన్ ఈ పాటను సాంగ్ లవ్లీ మెలోడీగా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి రాసిన సాహిత్యం అద్భుతంగా ఉంది. శరత్ సంతోష్, లిప్సిక భాష్యం వోకల్స్ మెలోడీని మరింత ఎలివేట్ చేశాయి. నాయకానాయికలు ప్రదీప్, దీపికల కెమిస్ట్రీ ఆన్-స్క్రీన్ మీద అద్భుతంగా ఉంది.

ప్రదీప్ తొలి చిత్రం లాగానే ఈ సినిమా కూడా విడుదలకు ముందే మ్యూజికల్ హిట్‌గా సంచలనాలు సృష్టిస్తోంది. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

మురళీధర్ గౌడ్, జి.ఎం.సుందర్, జాన్.విజయ్, రోహిణి, ఝాన్సీ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి స్క్రీన్ ప్లే - దర్శకత్వం: నితిన్, భరత్, సంగీతం: రథన్, డీఓపీ : బాలరెడ్డి, ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, ప్రొడక్షన్ డిజైనర్: ఆశిస్తేజ పులాల, కథ - మాటలు: సందీప్ బొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్, విశ్వ రఘు, యష్, రామ్, సాహిత్యం: చంద్రబోస్, రాకేందు మౌళి, శ్రీధర్ ఆవునూరి.

ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్



మంచి ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీలు వచ్చి చాలా కాలమే అవుతోంది. ప్రస్తుతం వెండితెరపై మాస్, యాక్షన్, కామెడీ చిత్రాలే కనిపిస్తున్నాయి.

కానీ స్వచ్ఛమైన వింటేజ్ విలేజ్ లవ్ ఎమోషనల్ డ్రామాలు కనిపించడం లేదు. ఆ లోటుని భర్తీ చేసేందుకు 'కౌసల్య తనయ రాఘవ' చిత్రం రాబోతోంది. రాజేష్ కొంచాడా, శ్రావణి శెట్టి నటీనటులుగా ఏఆర్ మూవీ మేకర్స్ బ్యానర్ పై కుటుంబ మంతా కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అడపా రత్నాకర్ నిర్మిస్తున్న ఈ మూవీకి స్వామి పట్నాయక్ కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.


ఈ సినిమాను ఈనెల 11న రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో శనివారం ఆర్కే నాయుడు, చంటి, నిర్మాత రత్నాకర్ సంయుక్తంగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో రాజేష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది. ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. 'నిర్మాత రత్నాకర్ ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజేష్, శ్రావణి, ఆర్కే నాయుడు ఇలా అందరూ అద్భుతంగా నటించారు' అని దర్శకుడు స్వామి పట్నాయక్ చెప్పారు. నిర్మాత రత్నాకర్ మాట్లాడుతూ, 'మా సినిమాకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. మా చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయండి' అని తెలిపారు.

ఆటలు

గెలుపు బాట పట్టేనా?

టైటాన్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు



నవతెలంగాణ-హైదరాబాద్ : ధనాధన్ దూకుడు మంత్ర జోరులో నిలకడలేమి, బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. సీజన్లో సొంతగడ్డపై మూడో మ్యాచ్ ఆడుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండో విజయంపై కన్నేసింది. గత మూడు మ్యాచుల్లో బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో పరాజయం మూటగట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. నేడు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. వరుస విజయాల ఊపుమీదున్న గుజరాత్ టైటాన్స్‌ను సన్‌రైజర్స్ నేడు ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి.

ఆ ముగ్గురు మెరవాలి! : ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ ఇషాన్ కిషన్.. సన్‌రైజర్స్ టాప్-3 బ్యాటర్లు. ఈ ముగ్గురులో కనీసం ఇద్దరు రాణిస్తేనే సన్‌రైజర్స్ భారీ స్కోరు చేయగలదు. మిడిల్ ఆర్డర్‌లో నితీశ్ కుమార్ రెడ్డి నిలకడగా విఫలమవుతున్నాడు. లోయర్ ఆర్డర్‌లో అనికెత్ వర్మ, హెన్రిచ్ క్లాసెన్‌లు ఫామ్‌లో ఉన్నారు. కానీ పవర్‌ప్లేలో హెడ్, అభిషేక్ ద్వయం దూకుడు సన్‌రైజర్స్‌కు కరువైంది. బౌలర్లలో పాట్ కమిన్స్, మహ్మద్ షమి మెరుగ్గా రాణించాల్సి ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్ కామిందు మెండిస్ రాక సన్‌రైజర్స్ తుది జట్టును మరింత సమతూకం చేసింది. గత సీజన్‌లో ఉప్పల్‌లో టైటాన్స్‌తో మ్యాచ్ వర్షార్పణం కాగా.. నేడు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుందని వాతావరణ శాఖ సమాచారం.

ఢిల్లీ హ్యాట్రిక్ విక్టరీ

సూపర్‌కింగ్స్‌పై క్యాపిటల్స్ గెలుపు
ఢిల్లీ 183/6, చెన్నై 158/5

నిన్న బెంగళూర్, నేడు ఢిల్లీ.. చెపాక్‌లో సూపర్ కింగ్స్‌పై మెరుపు విజయం సాధించాయి. 15 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ చెపాక్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయం సాధించింది. 184 పరుగుల ఛేదనలో సూపర్‌కింగ్స్ తేలిపోయింది. 158/5 పరుగులకే పరిమితమై 25 పరుగుల తేడాతో ఓటమి చెందింది. కెఎల్ రాహుల్ (77) అర్ధ సెంచరీ మెరుపులతో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ 183/6 పరుగులు చేసింది. ఐపీఎల్18లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా మూడో విజయం.

నవతెలంగాణ-చెన్నై



ఐపీఎల్18లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగుతుంది. బ్యాట్‌తో, బంతితో అదరగొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ చెపాక్ కోటను బద్దలు కొడుతూ 15 ఏండ్ల తర్వాత ఈ స్టేడియంలో తొలిసారి గెలుపు రుచి చూసింది. సీజన్లో హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ అజేయ రికార్డును సైతం కొనసాగించింది. ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ చతికిల పడింది. 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులే చేసింది. విజయ్ శంకర్ (69 నాటౌట్, 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో మెరిసినా..ఇతర బ్యాటర్లు తేలిపోయారు. ఎం.ఎస్ ధోని (30 నాటౌట్, 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) అంచనాలను అందుకోలేదు. రవీంద్ర జడేజా (2), శివం దూబె (18, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రుతురాజ్ గైక్వాడ్ (5), డెవాన్ కాన్వే (13), రచిన్ రవీంద్ర (3)లు విఫలం అయ్యారు. 74/5తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న సూపర్‌కింగ్స్‌ను విజయ్ శంకర్, ఎం.ఎస్ ధోని నిలబెట్టినా.. వేగంగా పరుగులు సాధించటంలో నిరాశపరిచారు. దీంతో 25 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో విప్‌రాజ్ నిగమ్ (2/27), కుల్దీప్ యాదవ్ (1/30), మిచెల్ స్టార్క్ (1/27) రాణించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (77, 51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలో రాణించగా.. అభిషేక్ పోరెల్ (33, 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (21, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), సమీర్ రిజ్వీ (20, 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), ట్రిస్టన్ స్టబ్స్ (24 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. సూపర్‌కింగ్స్ పేసర్ ఖలీల్ అహ్మద్ (2/25) రెండు వికెట్లతో రాణించాడు. సూపర్‌కింగ్స్‌కు నాలుగు మ్యాచుల్లో ఇది మూడో పరాజయం.

రాణించిన రాహుల్ :

టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ చెపాక్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ధనాధన్ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (0) డకౌట్‌గా నిష్క్రమించినా.. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ (77) అదరగొట్టాడు. అభిషేక్ పోరెల్ (33)తో కలిసి రెండో వికెట్‌కు రాహుల్ కీలక భాగస్వామ్యం నిర్మించాడు. మిడిల్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ (24 నాటౌట్) ధనాధన్ మెరుపులతో దంచికొట్టగా.. రాహుల్ మరో ఎండ్‌లో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. పవర్‌ప్లేలో 51/1తో నిలిచిన క్యాపిటల్స్ రాహుల్ అర్ధ సెంచరీతో భారీ స్కోరు చేసింది. రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో కదంతొక్కిన రాహుల్ 33 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. ఆఖరు ఓవర్ వరకు క్రీజులో నిలిచిన రాహుల్ కఠిన చెపాక్ పిచ్‌పై క్యాపిటల్స్‌కు 183 పరుగుల స్కోరు అందించాడు. సూపర్ అర్ధ సెంచరీతో విజయంలో కీలక పాత్ర పోషించిన కెఎల్ రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నేడు భద్రాద్రికి ముఖ్యమంత్రి

సీఎం హోదాలో శ్రీరామనవమికి తొలిసారి..

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో తొలిసారి భద్రాచలంలోని శ్రీరామనవమి వేడుకలకు ఆదివారం హాజరవుతున్నారు. ఆయనతోపాటు ఏడుగురు మంత్రులు కూడా వస్తున్నారు. ఇటీవల భద్రాచలం సమీపంలో ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్‌లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో 1800 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. 2024 శ్రీరామ నవమి వేడుకలకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి హాజరుకావాల్సి ఉండగా, నాడు పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో హాజరు కాలేకపోయారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరయ్యారు. ఈసారి ముఖ్యమంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలువురు ఎమ్మెల్యేలు శ్రీరామనవమికి హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా వస్తున్నట్టు వార్తలు వచ్చినా చివరి నిమిషంలో ఆయన పర్యటన వాయిదా పడింది. సీఎం పర్యటన కూడా చివరి వరకు సందిగ్ధంగానే ఉంది. హెచ్‌సీయూ భూముల అంశంపై చర్చల నేపథ్యంలో సీఎం పర్యటనపై సందేహాలు నెలకొన్నాయి. శనివారం రాత్రి 7 గంటలకు సీఎంవో నుంచి షెడ్యూల్ విడుదలైంది.

ముఖ్యమంత్రి రాకకు సర్వంసిద్ధం

భద్రాచలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం, బూర్గంపాడు మండలం సారపాకలో అధికారులు హెలీప్యాడ్‌లు సిద్ధం చేశారు. స్వామివారి దర్శనం తర్వాత పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో మిథిలా స్టేడియం మండపంలో వైదిక పెద్దలకు వాటిని సీఎం అందజేస్తారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ఆదివారం ఉదయం 8.45 గంటలకు బయలుదేరనున్న సీఎం బూర్గంపాడు మండలం సారపాక హెలీప్యాడ్‌లో 10 గంటలకు దిగుతారు. అక్కడి ఐటీసీ భద్రాచలం గెస్ట్‌హౌస్‌లో కొద్దిసేపు ఉండి 10.40 గంటలకు భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుంటారు. 11.10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామివారి కల్యాణ క్రతువును వీక్షిస్తారు. 12.35 గంటలకు బూర్గంపాడు మండలం సారపాక వెళ్లి సన్నబియ్యం అన్నం రుచిచూస్తారు.



ఆదివాసీ ఇంట్లో సన్నబియ్యం అన్నం రుచి..

ముఖ్యమంత్రితోపాటు ఏడుగురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఇతర అధికారులు ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం అన్నం రుచిచూస్తారు. బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన ఆదివాసీ గిరిజనుడు బోరం శ్రీనివాసరావు ఇంట్లో 12.35 నుంచి 1.10 గంటల వరకు ఉంటారు.

తానీషా నాటి ఆనవాయితీ పునరుద్ధరణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు శ్రీరామనవమికి హాజరవుతుండటంతో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన తానీషా ప్రభువు కాలం నాటి ఆనవాయితీ పునరుద్ధరిస్తున్నట్టయిందని చర్చిస్తున్నారు. తెలంగాణ వచ్చాక 2015లో ముఖ్యమంత్రి హోదాలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలిసారి భద్రాచలం శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యారు. 2016లోనూ వచ్చారు. ఆ తర్వాత నుంచి ఆ సంప్రదాయానికి తెరదించారు. సీఎం బదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరవుతూ వచ్చారు. నాడు శ్రీరామదాసు నేతృత్వంలో నిర్వహించే శ్రీసీతారామ కల్యాణ వేడుకకు నాటి నైజాం ప్రభువు తానీషా అధికారిక లాంఛనాలతో హాజరయ్యేవారు. నాడు మొదలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రు లందరూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప ఈ ఆనవాయితీని కొనసాగించారు. కానీ గత సీఎం కేసీఆర్ దీనికి ఆకస్మికంగా ఫుల్‌స్టాప్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. మొత్తమ్మీద 9 ఏండ్ల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి గత సంప్రదాయానికి తెరదీస్తుండటంపై భక్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం : సీఎం


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమనీ, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని బాబూజీ సేవలను సీఎం స్మరించుకున్నారు. పేదరికంలో జన్మించిన ఆయన అంకుఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని గుర్తు చేశారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారనీ, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారని.. కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారనీ, దళితుల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తు చేశారు. బాబూజీ స్ఫూర్తితో ప్రజా పాలన కొనసాగిస్తున్నామనీ, ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రజా ప్రభుత్వం కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణను అమలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వి హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

కళ మానవత్వానికి అంకితం



అంజలి ప్రభాకర్... అనేక కళారూపాలను తన చిత్రాల్లో ప్రతిబింబించగల బహుముఖ ప్రతిభాశాలి. చిత్ర కళలోనే కాదు సంగీతం, నృత్యం వంటి వాటిల్లో కూడా ఆమెకు ప్రావీణ్యం ఉంది. అయితే తన చిత్రకళకు మాత్రం ఒక నూతన శక్తిని అందిస్తోంది. జీవిత తత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడం వల్ల ఆమె కళలో అంతరార్థం, స్పష్టత, సున్నితమైన భావోద్వేగాలు కనిపిస్తాయి. ఫ్యాషన్ ఆర్ట్‌లో మాస్టర్స్‌తో పాటు మానసికశాస్త్రం, మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన ఆమె చిత్రాల సౌందర్యం, భావ వ్యక్తీకరణలో మరింత పరిపక్వత ప్రతిఫలించింది. ఈనెల 4,5,6 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో తన కళాఖండాలను ప్రదర్శించడానికి వచ్చిన ఆమె గురించి క్లుప్తంగా...



1975 ఫిబ్రవరి 15న బీహార్‌లో జన్మించిన అంజలి ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థిరపడ్డారు. భోపాల్ అనేక కళారూపాలకు కేంద్రంగా నిలిచి ఆమె కళకు కొత్త స్ఫూర్తినిచ్చింది. ఆమె ఫ్యాషన్ డిజైనింగ్‌లో మాస్టర్స్, ఎం.బి.ఏ (హ్యూమన్ రీసోర్సెస్) పూర్తి చేసి 1993 నుంచి చిత్రకళలో తన నైపుణ్యాన్ని కొనసాగిస్తున్నారు. లియోనార్డో డా విన్సీ, రాజా రవి వర్మ, ఫ్రిడా కాలో వంటి మహా కళాకారులు ఆమెకు ప్రేరణగా నిలిచారు. ప్రస్తుతం ఆమె ఇనోవేటివ్ సంస్థకు ఎండీగా ఉన్నారు. మరోవైపు ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్‌గా అద్భుతమైన కళారూపాలను సృష్టిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో...

కళా ప్రపంచంలో తన ప్రాముఖ్యతను చాటుకుంటున్నారు అంజలి. ఆమె కళలోని సమతుల్యత రంగుల సమన్వయం, ఆకారాల నిర్మాణం, కథనంతో కూడిన వినూత్న దృక్కోణాన్ని ప్రతిబింబిస్తుంది. విజయం, ప్రేమ, ఆధ్యాత్మికత, మానవ సంబంధాలు, సామాజిక సమస్యలు వంటి అనేక అంశాలను తన చిత్రాల్లో భావోద్వేగంతో చిత్రికరించారు. అందుకే ఆమె చిత్రాలు కళాభిమానులను, కళా సేకరణ కర్తలను ఎప్పటికప్పుడు ఆకర్షిస్తూనే ఉంటాయి. ఆమె కళా కృతులు భారతదేశంతో పాటు అంతర్జాతీయ కళా ప్రపంచంలో ప్రాముఖ్యత పొందాయి.

కళా ప్రదర్శనలు, ప్రచురణలు

అనేక సోలో, గ్రూప్ ప్రదర్శనల ద్వారా ఆమె చిత్రకళ కళా ఆరాధకులకు పరిచయమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 75కు పైగా ప్రదర్శనల్లో పాల్గొని, విశేష గుర్తింపు పొందారు. అనేక పత్రికలు, మ్యాగజైన్లు, ఆర్ట్ జర్నల్‌లు ఆమె కళను విశ్లేషిస్తూ ప్రచురించాయి. ఆమె కళా ప్రయాణాన్ని వివరించే Tunes of Life అనే పుస్తకం కూడా వెలువడింది. ప్రస్తుతం ఆమె 'ఆర్ట్ థెరపీ మహిళల మానసిక ఆరోగ్యంపై ఎలా ప్రభావితం చేస్తుందో' అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నారు.

వృత్తి, సేవా కార్యక్రమాలు

కళా, హస్తకళ తరగతులైన NID, NIFT, NATA & B Arch ప్రవేశ పరీక్షలతో పాటు UPSC, MPPSC, రైల్వే ఎస్సీస్సీ కోసం ఆమె కోచింగ్ ఇస్తారు. అలాగే ఆమె ప్రొఫెషనల్ టారో కార్డ్ రీడర్, న్యూమరాలజిస్ట్, లైఫ్ కోచ్ కౌన్సిలర్, హీలర్ హీలింగ్ ద్వారా శారీరక, మానసిక సమస్యల నివారణ నైపుణ్యాలు, వివిధ కళారూపాల్లో నైపుణ్యం, పోర్ట్రెయిట్ స్కెచింగ్, ఫోక్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం, యువ మానసిక శాస్త్రంలో లోతైన అవగాహన, మ్యూరల్ ఆర్ట్, తంజావూరు, మధుబని పెయింటింగ్, క్రిస్టల్ రెజిన్, సెఫోరిక్స్, అబ్స్ట్రాక్ట్ చిత్రకళలో నైపుణ్యం, టీమ్ వర్క్‌లో, స్వతంత్రంగా పని చేసే సామర్థ్యం ఆమెకు ఉన్నాయి. ఇంకా ఆమె గ్రాండ్ మాస్టర్ సర్టిఫికేట్ కూడా పొందారు.

కళ సందేశాన్ని ఇస్తుంది

అంజలి కళను కేవలం తన కోసమే కాకుండా తద్వారా మహిళా సాధికారతను పెంపొందించడానికి, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నారు. ఆమె చేత సృష్టించబడే ప్రతి కళ ఒక సందేశాన్ని ఇస్తుంది. మనిషి ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానంతో ముందుకు సాగాలని గుర్తు చేస్తుంది. భవిష్యత్తులో ఆమె మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారతీయ కళా ప్రపంచంలో గొప్ప స్థానాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తూ... ఆమె కళా ప్రయాణానికి అభినందనలు.

- వి.యశోధ

కళకు అందిన పురస్కారాలు

అంతర్జాతీయ, జాతీయ పురస్కారాలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, మెడల్ - కళాకార్ ఫౌండేషన్ (2018), సిల్వర్ మెడల్ - ఆల్ ఇండియా ఆర్ట్ ఫియెస్టా (2018), రాజా రవి వర్మ స్వదేశి శ్రే అవార్డు (2021), అంబేద్కర్ ఫౌండేషన్ అవార్డు (ప్రొఫెషనల్ కేటగిరీ), గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ (2022), గోల్డెన్ ఫ్రేమ్ ఎక్సలెన్స్ అవార్డు (2021), కల్చరల్ రివెరెన్స్ ఆర్ట్ అండ్ కల్చర్ మ్యాగజైన్ - పెయింటింగ్ ప్రచురణ (2021), ఆమె జీవిత చరిత్ర ప్రచురణ (2021) జరిగింది.



సాటి వారికి భరోసా ఇవ్వాలి...

అమ్మ లేఖ



హలో బంగారు తల్లీ...

ఈ రోజు నీకు ఓ విషయం చెప్తాను. ఇరుగు పొరుగు అంటే మన ఇంటి చుట్టూ ఉండే వారు. పూర్వం ఇరుగు పొరుగు వారు సాయంత్రం అయ్యేసరికి వాకిట్లో కూర్చుని కష్ట సుఖాలు చెప్పుకునే వారు. ఏదైనా వస్తువు ఇంట్లో లేకుంటే పక్కింట్లో అడిగి తెచ్చుకోవడం, చేబదులుగా ఉప్పు, పప్పు తెచ్చుకుంటూ ఉండేవారు. దీనివల్ల మనుషుల మధ్య అనుబంధాలు పెరిగేవి. ఒకరి కొకరు సాయం చేసుకుంటూ ఉండేవారు. ఇప్పుడు కూడా పల్లె టూర్లలో ఎవరి ఇంట్లో అయిన శుభకార్యం అయితే ఇరుగు పొరుగు వచ్చి పనులలో సాయం చేస్తుంటారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నాంటే ఈ నాగరిక ప్రపంచంలో ముఖ్యంగా పట్టణ వాతావరణంలో ఇటువంటి అనుబంధాలు కనిపించవు. మనిషి తన కోసమే బతుకుతున్నాడు తప్ప చుట్టుపక్కల వారితో స్నేహ బాంధవ్యాలు పెంచుకోవడం లేదు. మన చుట్టూ ఉన్నవారితో మనం కలుపుగోలుగా ఉండాలి, కనిపించినప్పుడు పల కరించాలి. అవసరం అయినప్పుడు ఒకరికి ఒకరు సాయ పడాలి. ఈ మధ్య కాలంలో పిల్లలు విదేశాల్లో ఉంటే వృద్ధులైన తల్లిదండ్రులు ఒంటరిగా ఉంటున్నారు. అటువంటి వారి యోగక్షేమాలు కనుక్కోవాలి. ఏదైనా అవసరం అయితే సాయపడాలి. మరి కొన్ని చోట్ల చంటి పిల్లలతో ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటూ, పిల్లలకు ఏమైనా అయితే హాస్పిటల్స్‌కి వెళ్లాల్సి వస్తుంది. అటువంటప్పుడు వారికి కావాల్సిన సాయం చేయాలి.

నా కేందుకు అని అనుకోకూడదు నాన్న. చుట్టు పక్కల వారి పరిస్థితులు గమనించి, గ్రహించి కనిపించినప్పుడు పలకరించి 'ఏదైనా అవసరం అయితే చెప్పండి' అని భరోసా ఇవ్వాలి. కొన్ని అనుకోకుండా జరుగుతాయి. అటువంటప్పుడు సాటి వారి అవసరం ఉంటుంది. కష్ట కాలంలో ఆదుకోవాలి. అది మానసిక స్థైర్యం కావచ్చు, శారీరక సాయం కావచ్చు, ఆర్థిక సాయం కావచ్చు. మనిషి ఒక్కో సారి పరిస్థితుల రీత్యా డీలా పడిపోతాడు. అటువంటప్పుడు ధైర్యం చెప్పాలి. సాయం వేరు, సేవ వేరు నాన్న.

ఈ మధ్య కాలంలో ప్రతి మనిషితో తమ అవసరం కోసమే మాట్లాడుతారు. లేదా నాకేమి అవసరం వాళ్లతో అంటారు. ఇది సరైన పద్ధతి కాదు. అలాగని అవసరాల కోసమే బాంధవ్యాలు పెంచుకోకూడదు. నువ్వు ఇప్పుడు టౌన్ షిప్‌లో ఉంటున్నావు. అక్కడ ఎందరో పెద్దలు, పిల్లలు కనిపిస్తుంటారు. పలకరింపుగా ఒక చిరునవ్వు చాలు నాన్నా. కొన్ని చోట్ల ఇరుగుపొరుగు వారు కలిసి చక్కగా పండుగలు, పార్టీలు చేసుకుంటూ ఉంటారు. సరదాగా బైటకి కలిసి వెళ్తుంటారు. ఇటువంటివి అప్పుడప్పుడు చేస్తూ ఉండాలి. అప్పుడే మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు పెరుగుతాయి. ఉంటాను...



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

వీడీసీ ఆగడాలు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. కల్లు గీస్తున్నందుకు ప్రతేడాదీ వీడీసీకి కొద్ది మొత్తంలో డబ్బులు చెల్లిస్తుండేవారు. అయితే, ఈసారి పెద్దమొత్తంలో డబ్బులు కట్టాలని వీడీసీ హుకుం జారీ చేయడంతో అంత కట్టలేమని ప్రాధేయపడినా వినిపించుకోలేదు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో గౌడ కులస్తులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. కాగా శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో అన్ని సామాజిక తరగతుల వారూ చిన్నాపెద్దా అని తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇదే విషయమై శనివారం గ్రామస్తులందరూ కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం మైకులో చాటింపు వేశారు. గౌడ సంఘానికి చెందిన మహిళలు కూడా కుంకుమార్చనలో పాల్గొనడానికి రామాలయంలోకి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి.. గౌడ సామాజిక తరగతి మహిళలను పూజలో పాల్గొనకుండా అడ్డుకొని అవమానించారు. దాంతో మనస్తాపానికి గురైన మహిళలు ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమను పూజలు చేయకుండా అడ్డుకొని అవమానించారని ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు తాళ్లరాంపూర్ వెళ్లి విచారణ చేపట్టి, ముగ్గురు గ్రామకమిటీ సభ్యులు, పూజరిపై కేసు నమోదు చేసినట్టు సమాచారం.

హెచ్‌సీయూ భూములు లాక్కున్నట్టు తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఉన్నవి లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వాస్తవాలు వెల్లడించేలోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని తెలిపారు. నెమళ్లు ఏడ్చినట్టుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్టుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్‌జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలగించి క్షమాపణలు చెప్పారనీ, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సీఎం అన్నారు. ఈ సమీక్షలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని..

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇతరుల వద్ద అప్పులు చేశాడు. అలాగే, మద్యానికి బానిసైన రాజ్వీర్‌సింగ్ ఠాకూర్ అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. శనివారం తెల్లవారు జామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాయ్‌కాట్ అమెరికా

(మొదటిపేజీ తరువాయి)

పైన ధరల లేబుల్ ముద్రించింది. దీంతో వినియోగదారులు అమెరికా వస్తువుల వైపు చూడడం లేదు. గ్రీన్‌లాండ్‌లోని దుకాణదారులు టెస్లా, నెట్‌ఫ్లిక్స్, కోకా-కోలా వంటి అమెరికా ఉత్పత్తులు, సేవలను బహిష్కరించారు. సూపర్ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులు బాగా కనిపించేలా ఏర్పాటు చేశారు. స్థానిక వస్తువుల కొనుగోలులో సెల్‌ఫోన్ యాప్స్ వినియోగదారులకు సహకరిస్తున్నాయి. అమెరికా వస్తువులు, సేవలను ఎలా వదిలించుకోవాలో తెలియజేసేందుకు ఫేస్‌బుక్ గ్రూపులను ఏర్పాటు చేశారు. గత నెలలో ఏర్పాటు చేసిన ఈ గ్రూపులలో ఇప్పటికే వేలాదిగా సభ్యులు చేరారు. 'మేము అమెరికాను, దాని సంస్కృతిని ప్రేమిస్తాము. కానీ అధ్యక్షుడిని ఇష్టపడము' అని ఓ ఫేస్‌బుక్ గ్రూప్ సహ అడ్మినిస్ట్రేటర్ వ్యాఖ్యానించారు. డెన్మార్క్‌లో భాగమైన గ్రీన్‌లాండ్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని స్థానికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. అమెరికా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాలను ఈ గ్రూపులు వినియోగదారులకు సూచిస్తున్నాయి. స్థానికంగా తయారవుతున్న సాఫ్ట్ డ్రింకులు, పాదరక్షలకు విశేష ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నాయి. అమెరికా కంపెనీలు, ఉత్పత్తులను బహిష్కరించిన కెనడాను అనేక మంది ఆదర్శంగా తీసుకొంటున్నారు. ఒకప్పుడు అమెరికాకు డెన్మార్క్ చాలా సన్నిహితంగా ఉండేది. అలాంటి దేశం ఇప్పుడు ట్రంప్ పేరెత్తితేనే మండిపడుతోంది. ట్రంప్ ప్రభుత్వంపై మరింత బలంగా పోరాడాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ తమదేనంటూ ట్రంప్ పదే పదే చేస్తున్న ప్రకటనలపై ప్రజానీకం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న దుందుడుకు విదేశీ విధానాలపై మండిపడుతున్నారు. అమెజాన్ సబ్‌స్క్రిప్షన్లను, కాలిఫోర్నియా వైన్స్‌ను వారు బహిష్కరించారు. అమెరికా ఉత్పత్తులపైన కోకా-కోలా, ప్రింగిల్స్‌కు స్థానిక ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నారు. కెనడాలో వ్యాపారులు వినూత్నంగా తమ షాపులలో అమెరికా వస్తువులను తలకిందులుగా ఉంచుతున్నారు. వినియోగదారులు అమెరికా వస్తువులను సులభంగా గుర్తు పట్టేందుకు వారు ఈ ఎత్తుగడ వేశారు. అయితే కొన్ని దేశాలలో దుకాణాలలో అమ్మకానికి ఉంచుతున్న బ్రాండ్లు ఏ దేశానికి చెందినవో అర్థం కాక వినియోగదారులు తికమక పడుతున్నారు. ఉదాహరణకు బ్రిటన్‌లో విక్రయించే కాడ్బరీ, వాటర్‌స్టోన్స్, బూట్స్ వాస్తవానికి అమెరికా బ్రాండ్లే. కాగా కొన్ని దేశాలలో వినియోగదారులు అమెరికా వస్తువులకు ప్రత్యామ్నాయాల కోసం వెతుకుతున్నారు. యూరప్‌లో కూడా అమెరికా వస్తువుల బహిష్కరణ ఊపందుకుంటోంది. ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ సహా పలు దేశాలలో పెద్ద ఎత్తున బహిష్కరణలు కొనసాగుతున్నాయి.

హిందూత్వ శక్తుల 'డిజిటల్' మాయ

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్నాయి. కోవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ఈ గ్రూపులు ముస్లింలను టార్గెట్‌గా చేసుకున్నాయని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కమ్యూనికేషన్ వివరించింది. కరోనాకు వారే కారణమంటూ 'కరోనా జిహాద్' వంటి కుట్ర సిద్ధాంతాలకు తెరలేపాయని పేర్కొన్నది. ప్రస్తుత కాలంలో డీప్‌ఫేక్ వీడియోలు, ఎడిట్ చేసిన ప్రసంగాలను షేర్ చేస్తూ ప్రతిపక్ష నాయకులను హిందూత్వ శక్తులు టార్గెట్ చేస్తున్నాయి. వారిని హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నాయి. ఇక గోరక్షణ పేరుతో కొన్ని గ్రూపులు మానవత్వాన్ని మరుస్తున్నాయి. ఇందుకోసం.. అవి సామాజిక మాధ్యమాల పైనే ఆధారపడుతున్నాయి. వాటిలో వచ్చే గాలి సందేశాల ఆధారంగా వ్యక్తులపై, ముఖ్యంగా ముస్లింలపై దాడులకు తెగబడుతున్నాయి.

కఠిన చర్యలు అవసరం

డిజిటల్ వేదికలపై ప్రజాస్వామ్యవాదులైన జర్నలిస్టులు, విమర్శకులు, విద్యావేత్తలు, మేధావుల గొంతులు అణచివేయబడుతున్నాయి. ఇందుకు బీజేపీ ప్రభుత్వాల సహకారమూ ఉంటున్నదని విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్ట్ చెకర్ మహ్మద్ జుబేర్‌ను అరెస్ట్ చేసిన విధానమే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో హిందూత్వ శక్తుల విపరీత ధోరణులు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తాయని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. ఈ డిజిటల్ యుగంలో సెక్యులరిజం, విభిన్నతల వైపు భారత రాజ్యాంగ నిబద్ధతను కాపాడుకోవటంలో కఠిన చర్యలు చాలా అవసరమని వారు నొక్కి చెప్తున్నారు.

సమగ్ర రక్షణ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

అనుర కుమార దిసనాయకె విస్తృతాంశాలపై చర్చలు జరిపారు. వ్యూహాత్మక సంబంధాలను పెంపొందించడానికి ప్రధానమైన చర్యగా ఈ రక్షణ సహకార ఒప్పందాన్ని భావిస్తున్నారు. శ్రీలంకలో భారత శాంతి పరిరక్షక దళం కార్యకలాపాల తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం ఇరు దేశాల మధ్య రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. "మా భద్రతా ప్రయోజనాలు దాదాపు ఒకటేనని మేం విశ్వసిస్తున్నాం. ఇరు దేశాల భద్రత పరస్పరం ముడిపడి వుంది, ఆధారపడి వుంది." అని ప్రధాని మోడీ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రయోజనాల గురించి అధ్యక్షుడు దిసనాయకె ఆలోచిస్తున్నందుకు కృతజ్ఞతలు. రక్షణ సహకారంతో సహా పలు ముఖ్యమైన ఒప్పందాలను స్వాగతిస్తున్నామని మోడీ పేర్కొన్నారు. భారత భద్రతా ప్రయోజనాలకు భంగకరమైన రీతిలో తమ భూభాగాన్ని ఉపయోగించేందుకు శ్రీలంక అనుమతించబోదని దిసనాయకె, మోడీకి హామీ ఇచ్చారు. కీలకమైన సమయాల్లో భారత్ అందించిన సాయానికి, కొనసాగిస్తున్న సంఘీభావానికి తామెంతగానో రుణపడి వున్నామని పేర్కొన్నారు. ట్రింకోమలిని ఇంధన కేంద్రంగా అభివృద్ధిపరచడానికి మరో కీలకమైన ఒప్పందంపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. దేశ ఇంధన భద్రతకు సాయపడే సంపూర్ సౌర విద్యుత్ ప్రాజెక్టును ఇరువురు నేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రారంభించారు. పొరుగుదేశాలకు ప్రాధాన్యతనివ్వాలనే భారత్ విధానంలో శ్రీలంకకు ఎప్పుడూ ప్రత్యేక స్థానముందని మోడీ వ్యాఖ్యానించారు.

ప్రధాని మోడీకి మిత్ర విభూషణ అవార్డు ప్రదానం

ద్వైపాక్షిక సంబంధాలకు ఊతమివ్వడంలో ప్రధాని మోడీ చేసిన సేవలకు గుర్తింపుగా శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె, మోడీకి మిత్ర విభూషణ అవార్డును ప్రదానం చేశారు. శ్రీలంక అత్యున్నత పౌర పురస్కారమైన ఈ అవార్డును 2008 ఫిబ్రవరిలో అప్పటి అధ్యక్షుడు మహీందా రాజపక్సా ఏర్పాటు చేశారు. ఇది తనకే కాదని, 140కోట్ల మంది భారతీయులకు అందిన గౌరవమని మోడీ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆయనకు సాదర స్వాగతం లభించింది.

కమిషన్ల ఏర్పాటుపై సీఎం సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పలు కమిషన్ల చైర్మెన్లు, సభ్యుల ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షలు నిర్వహించారు. ఆయనతో పాటు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మెన్, సభ్యుల ఎంపిక, తెలంగాణ లోకాయుక్త, ఉపలోకాయుక్త ఎంపిక, తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, కమిషనర్‌ల ఎంపికపై సమీక్ష నిర్వహించారు. వాటి విధివిధానాలు, దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా వీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు.

ఆయుధాలు వీడండి

(మొదటిపేజీ తరువాయి)

లేరని వ్యాఖ్యానించారు. వారు కూడా మనలో భాగమేనని అన్నారు. "నక్సల్స్ సోదరులందరికీ ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా, ఆయుధాలను విడనాడండి, ప్రధాన స్రవంతిలో కలవండి, మీరందరూ కూడా మాలోని వారే, మావోయిస్టు ఎక్కడైనా చనిపోతే మేం సంతోషపడలేం. కానీ ఈ ప్రాంతానికి అభివృద్ధి కావాలి. గత 50ఏళ్ళలో ఆ అభివృద్ధి జరగలేదు. కానీ ఐదేళ్ళలో బస్తర్ ప్రాంతానికి ప్రతీదీ అందచేయాలని ప్రధాని మోడీ భావిస్తున్నారు." అని అమిత్ షా చెప్పారు. దంతెవాడలోని గిరిజనుల పండుగ బస్తర్ పండూమ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగిపోయేలా చేసిన గ్రామాలకు అభివృద్ధి నిధి కింద కోటి రూపాయిలు ఇస్తామన్నారు. మావోయిస్టు వ్యతిరేక చర్యల్లో యువత చనిపోతున్నారని కొంతమంది తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. బస్తర్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఢిల్లీ పోలీస్ కమిషనర్ వాంగ్మూలం నమోదు

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ (డీసీపీ) దేవేశ్ కుమార్ మహలను దాదాపు నాలుగు గంటల పాటు విచారించి ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేసింది. చాణక్యపురిలోని హర్యానా స్టేట్ గెస్ట్ హౌజ్‌లో వీరిని విచారించినట్టు సమాచారం. ఇప్పటికే పలువురు పోలీసులు, సిబ్బందిని దర్యాప్తు కమిటీ విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసింది.జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నా ముగ్గురు జడ్జిలతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. కమిటీ ఇప్పటి వరకు పలువురిని విచారించింది. ఇందులో ఐదుగురు పోలీసుల వాంగ్మూలాలను నమోదు చేసింది. అలాగే, ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్, ముగ్గురు ఫైర్‌ఫైటర్లు, జడ్జికి సంబంధించిన ముగ్గురు భద్రతా సిబ్బంది స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేసింది. కమిటీ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదం తర్వాత నోట్ల కట్టలు కనుగొన్న స్టోర్‌రూమ్‌ను డీసీపీ మహల సీల్ చేశారు. "గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ ఇంటికి ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వివరాలను ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఢిల్లీ పోలీసులు సమర్పించారు. అలాగే, ఇదే ఆరు నెలల కాలానికి చెందిన ఆయన కాల్ వివరాల రికార్డులను, ఇంటర్నెట్ ప్రోటోకాల్ డిటెయిల్ రికార్డ్ (ఐపీడీఆర్)ను కూడా అందించారు. సీజేఐ ఆదేశాల తర్వాత ప్రధాన న్యాయమూర్తి ఈ వివరాలను కోరుతూ పోలీసులకు లేఖ రాశారు" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గతనెల 14న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో జస్టిస్ వర్మ ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ఘటన గురించి ఆయన పీఏ ద్వారా పోలీసులకు తెలిసింది. ఆ తర్వాత అక్కడికి పోలీసులు వచ్చారు. అయితే, మంటలు ఆరిపోయిన తర్వాత.. అక్కడ ఉన్న ఐదుగురు పోలీసు సిబ్బందిని అక్కడి నుంచి వెళ్లి, తిరిగి ఉదయం రావాలని జస్టిస్ వర్మ పీఏ కోరినట్టు సమాచారం.

కాసాగ్రాండ్ ఆక్రమణలపై విచారణ జరపండి

కొంపల్లి మున్సిపాలిటీకి హైకోర్టు ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రియల్ ఎస్టేట్ సంస్థ మెస్సర్స్ కాసాగ్రాండ్ హైడర్‌వైజ్ ప్రయివేటు లిమిటెడ్ భూ ఆక్రమణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని హైకోర్టు కొంపల్లి మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ అధికారుల్ని ఆదేశించింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం కొంపల్లి గ్రామంలోని సర్వే నెం. 105లోని ప్రభుత్వ రహదారి భూమిని రియల్ ఎస్టేట్ సంస్థ మెస్సర్స్ కాసాగ్రాండ్ హైడర్‌వైజ్ ప్రయివేటు లిమిటెడ్ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ హైకోర్టులో దాఖలైన పిటీషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి విచారణ జరిపారు. కాసాగ్రాండ్ హైదర్‌వైజ్ భూ యజమానులు మాజీ ఎంపీ జీ రంజిత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి అనే వ్యక్తులు ప్రజా రహదారిని ఆక్రమించి, గేటు, షీట్లు వేసి 40 అడుగుల వెడల్పు గల రహదారిపై సాధారణ ప్రజల రాకపోకలను నిలిపివేసారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. దానికి సంబంధించిన రోడ్డు గూగుల్ మ్యాప్స్, ఫోటోలను సమర్పించారు. దీనిపై రియల్ ఎస్టేట్ సంస్థ తరపు న్యాయవాది పుష్పవర్ధన్ వాదిస్తూ, తన క్లయింట్లు ఎటువంటి భూమిని లేదా రహదారిని ఆక్రమించలేదన్నారు. విలేజ్ మ్యాప్ ఇతర రికార్డులకు కట్టుబడి ఉన్నారని వాదించారు. దీనితో పిటిషనర్ వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, స్థలాన్ని పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.







బహిరంగ సభకు ముస్తాబైన మదురై



సీపీఐ(ఎం) మహాసభల్లో సినీనటుడు ప్రకాశ్‌రాజ్





సైకిల్‌పై తిరుపతి నుంచి మదురై మహాసభకు హాజరైన కామ్రేడ్లు

మహాసభ కోసం తిరుపతి నుంచి మదురైకి సైకిల్ యాత్ర

8 రోజులు 550 కిలోమీటర్లు...

చల్లా వెంకటయ్య, కుప్పుస్వామికి ఘన స్వాగతం

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వారిద్దరికీ సీపీఐ (ఎం) అంటే ఎనలేని ప్రేమ. మహాసభలంటే వీపరీతమైన ఇష్టం. ఆ ప్రేమ, ఇష్టమే... ఆ ఇద్దరిని తిరుపతి నుంచి మదురై దాకా సైకిల్ యాత్ర చేపట్టేలా చేశాయి. ఆ కామ్రేడ్లే చల్లా వెంకటయ్య, కె.కుప్పుస్వామి. వీరిలో వెంకటయ్య సీపీఐ (ఎం) చిత్తూరు జిల్లా మాజీ కార్యదర్శికాగా, కుప్పుస్వామి ప్రజాశక్తి మాజీ ఉద్యోగి. ఈ ఇద్దరూ మహాసభల కోసం మార్చి 29న తిరుపతిలో బయల్దేరారు. అక్కడి నుంచి సైకిల్ యాత్ర చేసుకుంటూ ఎనిమిదో రోజైన శనివారం మదురైకి చేరుకున్నారు. మొత్తం 550 కిలోమీటర్లు ప్రయాణించి, ఇక్కడి సీతారాం ఏచూరి నగర్ (మహాసభల ప్రాంగణం) నగర్‌కు చేరుకున్న వీరికి ప్రతినిధులు, స్థానిక పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తిరుపతిలో బయల్దేరిన దగ్గర్నుంచి మదురై దాకా ప్రతీచోటా తమకు భోజనం, బస, వసతి ఇతర సౌకర్యాలను ఆయా ప్రాంతాల్లోని సీపీఐ (ఎం) కమిటీలే చూసుకున్నాయని వెంకటయ్య, కుప్పుస్వామి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సైకిల్ యాత్ర తమ జీవితంలో మరపురాని మధురఘట్టంగా నిలిచిపోతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

లాల్ సలామ్ కామ్రేడ్..

కేరళ సీఎం పినరయి విజయన్‌తో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీపీఐ (ఎం) 24వ మహాసభల్లో భాగంగా శనివారం మదురైలోని సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహించతలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య వక్తగా పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన కేరళ సీఎంతో సమావేశమయ్యారు. 'లాల్ సలామ్ కామ్రేడ్, హౌ ఆర్ యూ...' అంటూ ఆయన విజయన్‌ను ఆప్యాయంగా పలకరించారు. పినరయి కూడా ప్రకాశ్ రాజ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువురూ కొద్దిసేపు సమకాలీన రాజకీయాల గురించి చర్చించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్... వేదిక వద్దకు చేరుకోగానే భారీ వర్షం మొదలైంది. ఆగకుండా రెండు గంటలపాటు అది కొనసాగటంతో ప్రకాశ్ రాజ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిపోయారు. కాగా... వర్షం కురవటానికి ముందు 'కర్నాటక స్టేట్ డొల్లు కునిత మహిళా బృందం' నిర్వహించిన జానపద నృత్యాలు సభికులను అలరించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి కళాకారుడు జగన్ ఆధ్వర్యంలో పాడిన 'భరతమాత ముద్దుబిడ్డ సుందరయ్య...' పాట విప్లవ స్ఫూర్తిని నింపింది.



చుక్కా రాములు

చర్చల్లో తెలంగాణ ప్రతినిధులు



బండారు రవికుమార్



సాయిబాబు



కిరణ్‌చంద్ర



మహాసభలో తీర్మానాలను ఆమోదిస్తున్న తెలంగాణ ప్రతినిధులు





బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు



పదివేల మందితో నేడు ఎర్రదండు కవాతు..

అతిరథ మహారథులతో భారీ బహిరంగ సభ

ముగియనున్న సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాబోయే మూడేండ్ల కాలానికి దేశానికి దిశ, దశ, నిర్దేశం చేసేందుకు వీలుగా మదురైలో కొనసాగుతున్న సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ ఐదో రోజైన శనివారం ముగియనుంది. ఈ సందర్భంగా నగరంలో పది వేల మందితో ఎర్రదండు కవాతును నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్.శంకరయ్య స్క్వేర్ (స్థానిక మస్తాన్‌పట్టి దగ్గరల్లోని వండియూర్ రింగ్‌రోడ్ టోల్‌గేట్ ప్రాంతం) వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. తొలుత పుదుగయి భూపాలమ్ కళా బృందం, కామ్రేడ్ గ్యాంగ్‌స్టా మ్యూజిక్ బృందం, కుమారి మురసు సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు.



ప్రతినిధుల కోసం తాటి ముంజలు

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886